# దారి దీపం

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175
మాసపత్రిక

సంపుటి 3 - సంచిక 4 | జనవరి 2025 | వెల : రూ.15

పేదలు లేని వికసిత భారత్ బడ్జెట్

వలసవాదం, మతతత్వంపై పోరాడిన గాంధీజీ

హిందుత్వ తొలి బాధితుడు మహాత్మాగాంధీ

అంబేద్కర్, హిందూ మితవాదం, భారత జాతీయ కాంగ్రెస్

ఓట్ల మాయా బజార్లో మన స్వతంత్రం గణతంత్రం

అత్యంత ధనిక పార్టీ బీజేపీనే..

ఎన్నికల ప్రక్రియపై అర్థవంతమైన చర్చ జరగాలి

75 ఏళ్ల భారత రాజ్యాంగం - సవాళ్లు

మహా కుంభమేళాలో హిందూ రాష్ట్ర రాజ్యాంగం

శ్రమజీవుల 'ప్రజా రిపబ్లిక్' ఉద్యమం

తెలుగు రాష్ట్రాలలో కుర్చీలాట

జన దృక్పథంతో రాసిన చరిత్ర

కృత్రిమ మేధస్సు - ఒక మార్క్సిస్టు విశ్లేషణ

భవిష్యత్తరాల కోసం కలత చెందిన దార్శనికులు

చరిత్రను ఆయుధంగా మారుస్తున్న హిందుత్వ

సావర్కార్‌ను మోడీ గౌరవించటం అంటే గాంధీ,
సర్దార్ పటేల్, అంబేద్కర్‌ను అవమానించటమే

చరిత్రలో ఇష్టా వారసత్వం

మన స్థల కాలాలకు గ్రాంసీ

ఏం చేయాలి ? ఉద్యమం ఎదుర్కొంటున్న తక్షణ సవాళ్లు

జనవరి - 2025 పేజీలు : 44

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 4


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) పేదలు లేని వికసిత భారత్ బడ్జెట్ - సంపాదకీయం 3
2) వలసవాదం, మతతత్వంపై పోరాడిన గాంధీజీ - వి.రాంభూపాల్ 4
3) హిందుత్వ తొలి బాధితుడు మహాత్మాగాంధీ - రవి జోషి 6
4) అంబేద్కర్, హిందూ మితవాదం, భారత జాతీయ కాంగ్రెస్ - రామ్ పునియానీ 8
5) ఓట్ల మాయా బజార్లో మన స్వతంత్ర గణతంత్రం - మాడభూషి శ్రీధర్ 10
6) అత్యంత ధనిక పార్టీ బీజేపీనే.. 13
7) ఎన్నికల ప్రక్రియపై అర్థవంతమైన చర్చ జరగాలి - పరకాల ప్రభాకర్ 14
8) 75 ఏళ్ల భారత రాజ్యాంగం - సవాళ్లు - కె.ఎస్.లక్ష్మణరావు 16
9) మహా కుంభమేళాలో హిందూ రాష్ట్ర రాజ్యాంగం - సంజయ్ పాండే 18
10) శ్రమజీవుల 'ప్రజా రిపబ్లిక్' ఉద్యమం - డి.వి.వి.ఎస్.వర్మ 19
11) తెలుగు రాష్ట్రాలలో కుర్చీలాట - సురవరం సుధాకరరెడ్డి 21
12) జన దృక్పథంతో రాసిన చరిత్ర - ఆర్వీ రామారావ్ 22
13) కృత్రిమ మేధస్సు - ఒక మార్క్సిస్టు విశ్లేషణ - మర్ల విజయకుమార్ 23
14) భవిష్యత్తరాల కోసం కలత చెందిన దార్శనికులు - డాక్టర్ దేవరాజు మహారాజు 26
15) చరిత్రను ఆయుధంగా మారుస్తున్న హిందుత్వ - ఆదిత్య ముఖర్జీ, మృదుల ముఖర్జీ 28
16) సావర్కార్‌ను మోడీ గౌరవించటం అంటే గాంధీ, సర్దార్ పటేల్, అంబేద్కర్‌ను అవమానించటమే - ఎస్.ఎన్.సాహు 32
17) చరిత్రలో ఇష్టా వారసత్వం - నీరజ చందోక్ 34
18) మన స్థల కాలాలకు గ్రాంసీ - పాణి 37
19) ఏం చేయాలి ? ఉద్యమం ఎదుర్కొంటున్న తక్షణ సవాళ్లు - ఎంఎస్ శర్మ 39
20) కార్టూన్లు.. - 43
21) కొత్త పుస్తకాలు స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

**దారి దీపం**

మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495



# పేదలు లేని వికసిత భారత్ బడ్జెట్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 8వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత సాధించారు. తన బడ్జెట్ ప్రసంగాన్ని 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ దేశభక్తి గీతంతో ప్రారంభించారు. ఈ బడ్జెట్‌లో అత్యధిక సంఖ్యాక ప్రజలకు పెద్ద పీట వేస్తున్నట్లు సంకేతం ఇచ్చారు. అయితే ఈ ప్రభుత్వం దృష్టిలో మనుషులంటే కార్పొరేట్లు, బిలీనియర్లు, భద్రజీవులు మాత్రమేనని బడ్జెట్ కేటాయింపులతో స్పష్టం చేశారు. బడ్జెట్ ప్రసంగం ప్రారంభంలోనే వికసిత భారత్ లక్ష్యాలను ప్రకటిస్తూ 'పేదరికం లేని భారత్' అందరినీ కలుపుకుని అభివృద్ధి సాధించే లక్ష్యాలను ఉద్ఘాటించారు. కాని, బడ్జెట్ కేటాయింపుల్లో చేతి వృత్తులు, శ్రామికులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, సాగు రైతులకు అదనపు ప్రకటనలు లేవు. ఉన్న పథకాల విస్తరణ లేదు.

దేశం ఆర్థికంగా దూసుకుపోతుందన్న ప్రకటనకు, బడ్జెట్ నిధుల పెరుగుదలకు పొంతన లేదు. గత బడ్జెట్‌లో రూ.48 లక్షల కోట్లు అంచనాతో వేస్తే ఈసారి రూ.50 లక్షల కోట్ల నామమాత్రపు పెరుగుదలే కనిపించింది. ఇందులోనూ రూ.17 లక్షల కోట్లు అదనపు అప్పులున్నాయి. రూ.48 వేల కోట్ల ప్రభుత్వ రంగ ఆస్తుల అమ్మకాలు ఉన్నాయి. ఏతా వాతా ఆర్థిక పురోగమనం మందకొడిగా కూడా లేదు. దాదాపు నిశ్చలంగా వున్నట్టు కనిపిస్తుంది.

రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న ఉటంకింపు తప్ప, పంటలకు చట్టబద్ధంగా లాభసాటి ధర ఇచ్చే ప్రస్తావన లేదు. బడ్జెట్ పెరుగుదల ఐదు శాతంగా వుంటే గత కేటాయింపులు కనీసం ఐదు శాతమైనా పెరగాలి. ఉపాధి హామీకి గతంలో 86 వేల కోట్లు వుంటే ఈ బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా పెంచలేదు. 84 కోట్ల మందికి ఉచిత రేషన్ పంపిణీకి గతంలో 2.70 లక్షలు కోట్లు కేటాయిస్తే ఇప్పుడు 2.03 కోట్లకు కుదించారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి జల్ జీవన్ మిషన్‌కు కేటాయింపులు భారీగా చూపించడం, తీరా ఖర్చు సగం కూడా చెయ్యకపోవడం రివాజు అయ్యింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన స్థితి కూడా కేటాయింపులు చేయడం, చివరకు భారీగా కోత పెట్టడం జరిగింది.

ఇక ఉద్యోగులకు, భద్రజీవులకు ఆదాయ పన్ను మినహాయింపు 12 లక్షలకు పెంచడం మీద మొత్తం బడ్జెట్ చర్చ అంతా నడుస్తున్నది. దీనివల్ల ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడుతుందని అంటున్నారు. అదనపు కొనుగోళ్లతో పన్నుల రూపంలో తిరిగి ఖజానాకు సొమ్ము చేరుతుందని అంటున్నారు. ఇందులో వాస్తవం ఎంత అన్నది పరిశీలన లేని చర్చ నడుస్తున్నది. ఈ పన్ను రాయితీ దేశంలో ఒక శాతం మందికి వర్తిస్తుంది. ఈ భద్రజీవులు ఇప్పటికే తమకు అవసరమైన సరుకులు కొనుగోలు చేయగలుగుతున్నారు. అదనపు మిగులు వస్తువుల మీద కొనుగోలు చేసే దానికంటే రియల్ ఎస్టేట్‌లో, షేర్లలో పెట్టుబడికి, నల్లధనంగాను వినియోగపడుతుందే తప్ప విశ్లేషకులు ఆశించిన ఫలితాలు రావు. వాస్తవానికి శ్రమ జీవులకు, రైతులకు అదనపు ప్రయోజనాలు కల్పించి వుంటే వారి దగ్గరకు అదనపు నిదులు చేర్చగలిగితే 60,70 శాతం మంది కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక వ్యవస్థ మరింత విస్తృతం అవుతుంది. ఈ బడ్జెట్ దానికి దోహదం చేసేది కాదు. ఇది పేదలను, రైతులను విస్మరించిన బడ్జెట్.

**- డీవీవీఎస్ వర్మ**

**సంపాదకులు, 85006 78977**

# వలసవాదం, మతతత్వంపై పోరాడిన గాంధీజీ




- వి.రాంభూపాల్

సామ్రాజ్యవాదం, మతతత్వంపై జీవిత కాలమంతా పోరాడిన గాంధీజీ ఓ మతోన్మాది చేతిలో 77 సంవత్సరాల క్రితం బలి అయ్యాడు. విదేశీ బంధనాల నుండి దేశాన్ని విముక్తి చేయాలని, మత సామరస్యాన్ని కాపాడుకోవాలని దృఢంగా నిర్ణయించుకున్న మహనీయుడాయన. జాతీయోద్యమంలో మతోన్మాదాన్ని పెంచి పోషించింది సామ్రాజ్యవాదం. ఆ సామ్రాజ్యవాదాన్ని చివరి వరకు బలపరచింది మతోన్మాదం. ఈ రెండూ పరస్పర పోషకాలుగా బలపడుతూ వచ్చాయి. వీటికి వ్యతిరేకంగా జాతీయ కాంగ్రెస్, కమ్యూనిస్టులు, సంఘ సంస్కరణవాదులు, పూలే-అంబేద్కరిస్టులు పోరాడుతూ వచ్చారు.

నాడు సామ్రాజ్యవాదుల ప్రోత్సాహంతో నాటిన మత విద్వేష విష బీజాలు నేడు మహావృక్షాలుగా దేశమంతటా విస్తరించి, సామ్రాజ్యవాద అనుకూల కార్పొరేట్ ఆర్థిక విధానాలతో, మతోన్మాద విచ్ఛిన్నకర చర్యలతో కోట్ల మంది ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నాయి. జాతీయోద్యమంలో ప్రజల ఐక్యతను చీల్చడానికి, నేడు ప్రజా పోరాటాలను విచ్ఛిన్నం చేయడానికి మతోన్మాదాన్ని ఒక పదునైన ఆయుధంగా వాడుకుంది పెట్టుబడిదారీ వ్యవస్థ. నాడు స్వాతంత్ర్యం కోసం, నేడు ఆ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం కోసం, నాడు మత సామరస్యం కోసం, నేడు లౌకికతత్వ కోసం కార్పొరేట్ శక్తులకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే గాంధీజీకి నిజమైన నివాళి. గాంధీజీ రాజకీయాల్లో అత్యుత్తమ నైతిక విలువలను పాటించాడు. అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపిన ఆదర్శమూర్తి. రైతు, కార్మిక సమస్యలపై ప్రత్యక్షంగా ఉద్యమాలు నడిపి అనుభవం నుండి నేర్చుకున్న ఆచరణవాది. జాతీయోద్యమంలో ప్రజల పాత్రను గుర్తించి అందుకు అనుగుణంగా పిలుపులను ఇచ్చిన ప్రజా నాయకుడు. తనకు తాను నిత్యం మార్పు చెందుతూ మహాత్ముడిగా ఎదిగాడు. పౌర హక్కుల రక్షణ పట్ల ఆయన అకుంఠిత దీక్షతో కృషి చేశాడు. కుల వివక్షను, మత విద్వేషాలను తనదైన అవగాహనతో నిష్కపటంగా వ్యతిరేకిస్తూ అందులో ప్రజలను భాగస్వాములను చేయగలిగిన భారతీయుడు.

మతాన్ని విశ్వసిస్తూనే, సర్వ మత సమానత్వాన్ని చాటి చెప్పిన మానవతా వాది. మతతత్వం ఏ రూపంలో వున్నా అది ప్రజల ఐక్యతకు, దేశ భద్రతకు పెద్ద ప్రమాదం అని గాంధీజీ దేశ ప్రజలను హెచ్చరించాడు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న



సామ్రాజ్యవాదాన్ని, సామ్రాజ్య వాదాన్ని బలపరుస్తున్న మతోన్మాదాన్ని గుర్తించి ఈ రెండూ పరస్పర పోషకాలని, మతం రాజకీయాల్లోకి జొరబడకూడదని భావించాడు. ఆయనలో వున్న పరిమితులకు ఆయన వర్గ దృక్పథం కారణమే కానీ వ్యక్తిగా మహోన్నతుడే. 1905 బెంగాల్ విభజన మత విభజనకు తోడ్పడుతుందని బ్రిటీష్ సామ్రాజ్యవాదం భావించింది. కానీ అందుకు భిన్నంగా బెంగాల్ ఐక్యత కోసం మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పెద్ద ఉద్యమం దేశమంతటా సాగింది. అనేక నిర్బంధ చర్యలు చేపట్టినా బ్రిటీష్ వారు అనుకున్నట్లు బెంగాల్ విభజన చేయలేకపోయారు. పెరుగుతున్న స్వాతంత్ర్య పోరాటాన్ని కేవలం నిర్బంధ చర్యలతోనే అణచివేయలేమని పాలకులు గుర్తించారు. హిందూ, ముస్లింల మధ్య విభజన తీసుకురావాలని నిర్ణయించుకున్నారు. అందు కోసం ముస్లింలకు ఒక రాజకీయ సంస్థ వుండాలని కాంగ్రెస్‌కు పోటీగా 1906 డిసెంబరులో ముస్లిం లీగును ఏర్పాటుచేశారు. మింటో-మార్లే సంస్కరణల పేరుతో మొట్ట మొదటిసారి ముస్లింలకు మత ప్రాతిపదికన నియోజక వర్గాల ప్రతిపాదన తెచ్చారు. జాతీయ కాంగ్రెస్‌లో మదన్ మోహన్ మాలవీయ, లాలా లజపతిరాయ్, స్వామి శ్రద్ధానంద, డా॥ మూంజే వంటి వారు హిందువులను ప్రత్యేకంగా మత ప్రాతిపదికన సంఘటితపరచాలన్న వైఖరిని చేపట్టారు. ఇది 1913లో హిందూ మహాసభ 1925లో ఆరెస్సెస్ ఏర్పడడానికి కారణమైంది. హిందూ, ముస్లిం మత సంస్థల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం అవకాశవాదంతో వ్యవహరించి ప్రజల మధ్య ఐక్యతను చీల్చే ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

మోతీలాల్ నెహ్రూ హిందూ వ్యతిరేకి అని, ఇస్లాం అభిమాని అని, ఆవు మాంసం తింటాడని హిందూ మహాసభ సభ్యులు ఒకవైపు నిందా ప్రచారం చేయగా, మరోవైపు హిందువుల రాజ్యం స్థాపించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని, ముస్లింలను అణచివేస్తుందని ముస్లిం లీగు నాయకులు ప్రచారం చేశారు. ఇవి చేసిన దుష్ప్రచారాలు. రెచ్చగొట్టే ఉపన్యాసాలు. పుకార్లతో 1917-27 మధ్య కాలంలో రష్యాలో సోషలిస్టు వ్యవస్థ ఏర్పడడం జాతీయోద్యమానికి కొత్త ఊపునిచ్చింది. కమ్యూనిస్టు పార్టీ కార్మికుల, ప్రజల రోజువారీ సమస్యలు, సామాజిక అణచివేత, వెట్టిచాకిరి, భూస్వామ్య దోపిడీ పద్ధతులకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాలు మతతత్వాన్ని వెనక్కు నెట్టగలిగాయి.

## గాంధీ రాజకీయ ప్రవేశం

గాంధీ 1869 అక్టోబరు 2వ తేదీన గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించాడు. సముద్ర ప్రయాణం చేయరాదనే కుల కట్టుబాట్లను ధిక్కరించి 1888లో బొంబాయి నుండి ఇంగ్లాండు వెళ్లి చదువుకున్నాడు. టాల్‌స్టాయ్ రచనలతో ప్రేరేపితుడయ్యాడు. బారిస్టరు పూర్తి చేసిన తర్వాత ఓ కేసు వాదించడం కోసం దక్షిణాఫ్రికా వెళ్లి అక్కడి జాతి వివక్షకు గురయి, భారతీయులు, నల్లజాతి పౌరులు పడుతున్న బాధలకు చలించి ఆందోళనల్లో పాల్గొన్నాడు. సత్యాగ్రహం అనే కొత్త తరహా ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. దక్షిణాఫ్రికాలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'సత్యం అనేది మహా వృక్షం. మనం దాన్ని ఎంతగా పోషిస్తే అది అంతగా ఫలాలు అందిస్తుంది' అని 'జనంతో ఏమైనా పని చేయించాలంటే ముందు మనకు ఎంతో ఓర్పు, సహనం ఉండాలి' అనే నాయకత్వ లక్షణాన్ని సంతరించుకున్నాడు. గోపాలకృష్ణ గోఖలే ద్వారా గాంధీ భారత రాజకీయాలను, సమస్యలను అర్థం చేసుకునే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రజల నుండి నేర్చుకోవడానికి ప్రజల దగ్గరకే వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.

బీహార్‌లోని అత్యంత వెనుకబడిన చంపారన్ జిల్లాలో బ్రిటీష్ వారి ఒత్తిడి కారణంగా నీలిమందు వంటి వాణిజ్య పంటలు పండించే రైతుల పక్షాన 1917లో సత్యాగ్రహం చేసి అరెస్టయ్యాడు. 1918లో అహ్మదాబాద్‌లో మిల్లు కార్మికులకు, యజమానులకు మధ్య ఏర్పడిన వేతన పెంపు తగాదాలో 21 రోజుల సమ్మెలో పాల్గొన్నాడు. ఇలా ఆయన రైతు, కార్మిక ఉద్యమాల నుండి అనుభవాలు నేర్చుకున్నాడు. 1921లో తాను ధరించే వస్త్రాలను వదిలి సాధారణ రైతులాగా మారి జీవితాంతం అదే ఆచరించాడు. ఆహార నియమాలు మార్చుకున్నాడు. సామాన్య ప్రజల జీవితాలతో తన జీవితాన్ని, జీవన సరళిని మమేకం చేసి జాతీయ నాయకుడిగా గాంధీ ఎదిగాడు. వస్త్రాలంకరణ కోసం కోట్లు ఖర్చు చేస్తున్న నేటి దేశ పాలకులకు, మహాత్ముడికి పోలికెక్కడిది.

గాంధీ పేరు మారుమూల గ్రామాలలో కూడా ప్రచారం పొందడం ఆశ్చర్యంగా వుంది. 'ఎవరతడు, ఏం చేస్తాడనేది ఎవరికీ తెలియదు. కానీ అతడొక మహాత్ముడు. సాధువు. ఒక పండితుడు అని ప్రజలు భావిస్తున్నారని' 1921లో అలహాబాద్ జిల్లాలోని రైతు ఉద్యమంపై విచారణ చేసిన బ్రిటీష్ అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. ప్రజలను చైతన్యం చేయడంలో పత్రికల ప్రాధాన్యతను గుర్తించి నవ జీవన్, యంగ్ ఇండియా అనే పత్రికలను స్థాపించాడు.

ఆయన నిర్వహించిన ఐదు ప్రధానమైన ప్రజా ఉద్యమాల్లో మూడు పౌర హక్కులకు సంబంధించినవే. 1922 జనవరిలో 'యంగ్ ఇండియా' పత్రికలో 'వాక్ స్వాతంత్ర్యం, స్వేచ్ఛగా సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు మనకుండాలి. మన ప్రాణాలను పణంగా పెట్టయినా ఈ ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలి' అని రాశాడు. గాంధీ ఏ హక్కుల కోసం తన జీవిత కాలం పోరాడాడో వాటికే నేడు ప్రమాదం ఏర్పడింది. స్వాతంత్ర్యం అంటే పరిపూర్ణమైన వ్యక్తి వికాసానికి అవకాశం వుండడమేన న్నారు. కుల వివక్ష, హిందూ ముస్లిం ఘర్షణ ఇలాంటి వికాసానికి తీవ్ర ఆటంకాలని చెప్పాడు. మొదట్లో రాజ కుటుంబీకులను, జమీందార్లను ఆయన బలపరచారు. అయితే కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన భూ పోరాటాల ప్రభావంతో ఆయన వైఖరిలో మార్పు వచ్చి 1937 నాటికి 'తాము సాగు చేసుకుంటున్న భూములు రైతులవే అంటే గ్రామాల్లో రైతులు పన్నులు చెల్లించడం మానేస్తారు. ఆ తరువాత చర్యగా ఆ భూములను స్వాధీనపరచుకుంటారు' అని ఆయన మాట్లాడాడు.

ఉద్యమ అవసరాలకు ప్రజల నుండి విరాళాలు సేకరించడాన్ని ఉద్యమంలో భాగంగా మార్చింది గాంధీనే. జలియన్ వాలా బాగ్ స్మారక చిహ్నం కోసం ప్రజల నుండి విరాళాలు సేకరించాలని ఆయన భావించాడు. ఇందుకు బొంబాయి కార్మికులు, పౌరులు పెద్ద ఎత్తున స్పందించారు. ప్రజల నుండి విరాళాలను సేకరించడాన్ని నిరంతరం కొనసాగించాడు. ఎన్నికల బాండ్ల మీద, కార్పొరేట్ కంపెనీల విరాళాల మీద ఆధారపడి రాజకీయాలు నడుపుతున్న నేటి పాలకులకు గాంధీజీ రాజకీయాలకు పోలికెక్కడిది? నీతి అనేది రాజకీయాల్లో అంతర్భాగంగా వుండాలని ఆయన దృఢంగా భావించాడు. నీతి లేని పాలకులు ప్రజల విశ్వాసాన్ని పొందలేరన్నారు. నేడు పాలక రాజకీయాల్లో తీవ్రంగా లోపించిందే నీతి.

## గాంధీ - మతం

'నిజమైన మతం, నిజమైన నైతికత ఒక దానితో ఒకటి విడదీయరాని విధంగా ముడిపడి వున్నాయి. నేలలో నాటిన

**(మిగతా 7వ పేజీలో..)**

# హిందుత్వ తొలి బాధితుడు మహాత్మా గాంధీ



- రవి జోషి


**'గెలిచినప్పటికీ అతను శత్రువు నుంచి క్షేమంగా లేడు.**
**ఆ శత్రువు విజయం వైపు సాగిపోతూనే ఉన్నాడు.'**

- వాల్టర్ బెంజమిన్
(ద థీసిస్ ఆన్ ది ఫిలాసఫీ ఆఫ్ హిస్టరీ)

మహాత్మాగాంధీ హత్య జరిగిన చాలా ఏళ్ళ తరువాత హంతకుడు నాథూరాం గాడ్సే ఇబ్బందికర వ్యక్తిత్వం ఈ రోజు మన ముందుకొచ్చింది. నాథూరాం గాడ్సేతో ఉన్న సంబంధాలు ఇబ్బందికరమైనప్పటికీ, అతని ఆలోచనకు మూలమైన వి.డి. సావర్కార్‌ను తమ పార్టీ గురువుగా, తాత్వికుడిగా బీజేపీ బహిరంగంగానే అంగీకరిస్తోంది. ఇదే రోజున, 1948 జనవరి 30వ తేదీన గాంధీజీని నాథూరాం గాడ్సే హత్య చేశాడు. 'పాకిస్థాన్‌కు మహాత్మా గాంధీ సహాయం చేస్తూనే ఉన్నాడని 1948 జనవరి మొదటి వారంలోనే నాకు అర్థమైపోయింది. అందుకునే ఆయన్ని చంపాలనుకున్నాను. పాకిస్థాన్‌తో వ్యవహరించడానికి నాకు వేరే మార్గం లేదు' అని నాథూరాం గాడ్సేని విచారించడానికి ముందు, ఇంటరాగేషన్ సమయంలో ఆయన చెప్పిన మాటలివి.

'గాంధీజీ హత్యకు చేసిన కుట్రలో సావర్కార్, నారాయణ ఆప్టే లకు చెందిన ఆనవాళ్ళను అతను ఆత్రంగా తొలగించాడు. పాకిస్థాన్‌కు 55 కోట్ల రూపాయల పరిహారాన్ని చెల్లించాలని కోరుతూ జనవరి 13వ తేదీన గాంధీజీ నిరవధిక నిరాహార దీక్షకు పూనుకోవాలని భావించిన తరువాత ఆయనను చంపాలని నిర్ణయించాడు. అందుకోసం తన అకౌంటును మార్చేశాడు.' అని **దీరేంద్ర కే ఝా 'గాంధీ అసాసిన్ : ద మేకింక్ ఆఫ్ నాథూరాం గాడ్సే'** అన్న తన పుస్తకంలో రాశాడు.

గాంధీ హత్య జరిగిన 77 సంవత్సరాల తరువాత, హంతకుడు నాథూరాం గాడ్సే వ్యక్తిత్వాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించడానికి కానీ, తిరస్కరించడానికి కానీ మోడీ ప్రభుత్వానికి, బీజేపీ నాయకులకు, రాష్ట్రీయ స్వయం సేవక సంఘానికి మనస్కరించడం లేదు. ఇతర దేశాధినేతలు భారతదేశాన్ని సందర్శించినప్పుడు – ఢిల్లీలో 2023లో జరిగిన జీ 20 సమావేశాలకు – ప్రధాని నరేంద్రమోడీ రాజ్‌ఘాట్‌లో గాంధీ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్నప్పుడు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు యథావిధిగా గాంధీ హంతకుడు నాథూరాం గాడ్సే పట్ల తమకున్న గౌరవ భావనను వ్యక్తం చేశారు.



మహాత్మాగాంధీ



నాథూరాం గాడ్సే

గాడ్సేతో వారికి సమస్య ఎక్కడ వచ్చిందంటే, ఆయన గురువు, తమ పార్టీ నాయకుడు, తమ పార్టీ తాత్వికుడు, తమ హిందుత్వ సిద్ధాంతానికి మూలకర్త వి.డి సావర్కార్‌ను బహిరంగంగా అంగీకరిస్తుంటారు. గాడ్సేతో అన్నిరకాల సంబంధాలున్నప్పటికీ, గాంధీజీ హత్య కేసులో న్యాయస్థానం శిక్ష విధించడం వల్ల గాడ్సేని సొంతం చేసుకోవడానికి ఇబ్బందిపడుతున్నారు.

గాడ్సే కోర్టులో చేసిన ప్రకటనలో, తాను రాసిన 'మే ఐ ప్లీజ్ యువర్ ఆనర్ సేస్' అన్న పుస్తకంలో ఇలా ప్రకటించారు. 'జాతి పితగా గాంధీజీ మోస్తున్న బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యారని నేను బలంగా నమ్ముతున్నాను. పాకిస్థాన్ జాతిపితగా తనను తాను రుజువు చేసుకున్నారు. నా దేశం, నా మాతృభూమిని సజీవ జంతువులపైన జరిపే ప్రయోగశాలగా తయారు చేసినందుకు, ఈ మాతృభూమికి పుట్టిన బాధ్యతగల బిడ్డగా నాకర్తవ్యాన్ని నిర్వర్తించడానికి జాతిపితగా పిలుస్తున్న వ్యక్తిని అంతమొందించాలని నేను భావించాను.'

దేశ విభజన జరిగినప్పుడు 1947 నాటి దేశ పరిస్థితిలో, పది లక్షల మంది హిందువులు, సిక్కులు, ముస్లింలు దారుణంగా హత్యకు గురయ్యారు. అరవై లక్షల మంది తమ నివాసాలను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. తమ వ్యక్తిగత విషాదాలతో పగ తీర్చుకోవడానికి ప్రజలను ఉన్మాద పరిస్థితుల్లోకి నెట్టేశారు. ఢిల్లీలో దెబ్బ తిన్న అనేక మంది శరణార్థుల్లో గాడ్సే లేరు. బాగా స్థిర పడిన కుటుంబం నుంచి వచ్చిన గాడ్సే తన రాజకీయ చర్యలతో ప్రజల్లో గుర్తింపు పొందాలనుకున్నాడు. గాడ్సే గురువు సావర్కార్ అతనికి అనేక దశల్లో శిక్షణ ఇచ్చి గాంధీజీని హత్య చేయడానికి తయారు చేశాడు.

హైదరాబాద్‌లో నిజాం రజాకార్‌లకు వ్యతిరేకంగా పోరాడడానికి శిక్షణ పొందే తొలి బృందం కోసం హిందూ మహాసభలో చేరాలని సలహా ఇచ్చిన సావర్కార్‌ను గాడ్సే 1938లో రత్నగిరిలో కలిశాడు. గాడ్సే హైదరాబాదులోకి ప్రవేశించగానే అతన్ని అరెస్టు చేసి, ఏడాది శిక్ష విధించి జైలుకు పంపారు. ఫలితంగా హిందుత్వం కోసం పనిచేయాలనే సంకల్పం అతనిలో అప్పుడే బలపడింది. ఈ శిక్షణ పొందిన యువకులపైన సావర్కార్‌కు ఒక విశ్వాసం కలిగి, పూనేలోని హిందూ మహాసభ భక్తుల్లో ఒక చిన్న రహస్య స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేయాలని గాడ్సేకి చెప్పాడు. హిందూ మహాసభ అనుమతించకపోయినప్పటికీ, రహస్య కార్యక్రమాలు చేపట్టడానికి తనకు విధేయులైన వారి చేత సావర్కార్ ప్రమాణం చేయించాడు. తమ హక్కులను, మతాన్ని దురాక్రమణ చేసే వారి నుంచి కాపాడడానికి, ప్రతి హిందూ సంస్థకూ సాయం చేయడానికి 'సావర్కారిజాన్ని' ప్రచారం చేయడం ఈ గ్రూపు ప్రధాన కర్తవ్యం. సావర్కార్‌కు, డాక్టర్ డి.ఎస్.పర్చూరుకు సహాయం చేయడానికి గ్వాలియర్‌లో హిందూ రాష్ట్ర సేన నుంచి పూనాలో హిందూ రాష్ట్ర దళ్‌ను గాడ్సే ఏర్పాటుచేశాడు. డాక్టర్ డి.ఎస్.పర్చూరు తన వద్ద ఎప్పుడూ చంపడానికి ఉపయోగించే 9 ఎం.ఎం. ఆటోమేటిక్ బెరెట్టా తుపాకీని ఉంచుకునే వాడు. గాడ్సే, సావర్కార్ మధ్య ఉన్న గురుశిష్యుల సంబంధాన్ని ఇవ్వన్నీ తెలియచేస్తాయి. కానీ, గురువును అంగీకరిస్తూ, శిష్యుణ్ణి అంగీకరించకపోవడం వారికి సాధ్యం కావడం లేదు.

గాడ్సే, సావర్కార్ రెండు సభల్లో కలిసిన విషయం చాలా మందికి తెలియదు. లండన్‌లో అక్టోబర్ 1906లోను, 1909లో జరిగిన సభల్లో ఇద్దరూ కలిసి మాట్లాడారు. నిలంజన్ ముఖోపాధ్యాయ **'ద ఆర్ఎస్ఎస్ : ఐకాన్స్ ఆఫ్ ది ఇండియన్ రైట్' అన్న తన పుస్తకం**లో ఇలా రాశారు. 'ఈ సభతో గాంధీ చాలా కలత చెందారు. రెండవసారి జరిగిన సభ గురించి గోపాల కృష్ణ గోఖలేకు రాసిన లేఖలో గాంధీజీ తన విచారాన్ని వ్యక్తం చేస్తూ, ముఖ్యంగా బ్రిటిష్ వారిని తరిమేయాలనే హింసను రాజకీయ ఆయుధంగా వాడాలన్న సావర్కార్ దృష్టికోణాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు.'

సావర్కార్ గురించిన దృక్పథాన్ని మరింతగా తెలుసుకోవడానికి **'హిందుత్వ అండ్ వైలెన్స్ : వి.డి. సావర్కార్ అండ్ పొలిటిక్స్ ఆఫ్ హిస్టరీ రైట్స్'** అన్న పుస్తకంలో వినాయక్ చతుర్వేది ఇలా రాశారు. 'లండన్‌లో 1909లో జరిగిన బహిరంగ సభలో గాంధీ, సావర్కార్ ఇద్దరూ హింస కేంద్రీకరించడాన్ని వ్యతిరేకించారు. ఒకరికొకరితో కాకుండా ఇరువురూ భిన్నమైన తమ తమ ఆలోచనలతో వాదనలను వినిపించినట్టు మాట్లాడారు. స్వరాజ్యం, నాగరికత, హిందుత్వం, హింస వంటి వాటిపైన తమ దృక్పథాన్ని ప్రతిబింబించేలా రాజకీయ పదజాలాన్ని వాడలేదు. భగవద్గీత, రామాయణం వంటి వాటి పైన సావర్కార్, గాంధీ ఒకరి వ్యాఖ్యానాలపైన మరొకరు ఆసక్తి చూపించలేదు. తమ తమ ఆలోచనల ఆధిక్యానికి జరిగిన యుద్ధం హింసాత్మకంగా ముగిసింది.'

ఎవరు హింసాత్మక ముగింపు కోసం ఎవరు కలిశారో మనకు తెలుసు. చంపడానికి ఎవరు కుట్ర పన్నారో తెలుసు. నాకు ఆవేదన కలిగించే ఒక విషయం ఏమిటంటే, వివేకానందుడికి భక్తుణ్ణని ఎప్పుడూ చెప్పుకునే ప్రధాని నరేంద్రమోదీ, హింస వైపు మొగ్గు చూపి, క్రైస్తవం, ఇస్లాం మతాల పట్ల అసహనాన్ని ప్రదర్శించే, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైన నాజీ నియంతృత్వాన్ని ఆరాధించే సావర్కార్ పట్ల ఎలా పూజ్య భావాన్ని కలిగి ఉంటారు ? అసలు స్వభావాలు వ్యక్తిత్వంగా ప్రతిబింబించిన మోదీ అట్ట బొమ్మ ఫ్యాషన్ గా వివేకానందుడు కనిపిస్తాడు. ❑

**అనువాదం : రాఘవ (వైర్ సౌజన్యంతో)**

# వలసవాదం, మతతత్వంపై పోరాడిన గాంధీజీ

**(5వ పేజీ తరువాయి)**

విత్తనానికి నీరు ఎంత అవసరమో మతానికి నైతికత అంత అవసరం' అని చెప్పి 'అసత్యం, క్రూరత్వం, విద్వేషం, అపుకోలేని ఉద్రేకం వున్నవాడు నైతికత కోల్పోయిన వాడవుతాడు. అలాంటి వాడికి మతం గురించి మాట్లాడే హక్కు లేదు. అత్యున్నత నైతికత ఏమిటంటే మానవాళి మేలు కోసం నిరంతరం కృషి చేయడమే' అన్నాడు.

దేవాలయాల్లోకి హరిజనుల ప్రవేశంపై 'నేను చేస్తున్న పనులతో హిందూత్వం దెబ్బ తిన్నా పట్టించుకోను. నేను ఈ (అ)ధర్మాన్ని సంస్కరించాలనుకుంటున్నాను' అన్నాడు. సత్యమే దేవుడని ఆయన చెప్పాడు. నేడు సనాతన ధర్మం ఆచరించడమంటే కుల వ్యవస్థను ఆమోదించడమే అన్నాడు. 'నేనే గనుక నియంతనైతే మతం–రాజ్యం వేరుగా వుంచుతాను. మతతత్వం దేశ వ్యతిరేకమే కాదు, అది హిందూ మతతత్వమైతే హిందూ వ్యతిరేకం, అది ముస్లిం మతతత్వమైతే ముస్లిం వ్యతిరేకం' అని చాటి చెప్పాడు. మతతత్వం, సామ్రాజ్యవాదం వేరు కాదని ఈ రెండూ ప్రజలకు శత్రువులని ఆయన దేశమంతటా బోధించాడు. నాడు మహాత్ముడిని హత్య చేసిన వారి వారసులే నేడు దేశాన్ని పాలిస్తున్నారు. ఒకవైపు సామ్రాజ్యవాద కార్పొరేట్ ఆర్థిక విధానాలు, మరోవైపు మతతత్వ విద్వేషాలు అమలు చేస్తున్నారు. ఈ రెండు ప్రమాదాలకు వ్యతిరేకంగా పోరాడడం నేటి దేశభక్తుల కర్తవ్యం. ❑

# అంబేద్కర్, హిందూ మితవాదం, భారత జాతీయ కాంగ్రెస్

- రామ్ పునియానీ



ఇటీవలే పార్లమెంటులో జరిగిన (డిసెంబర్ 2024) చర్చల్లో హోం శాఖ మంత్రి అమిత్ షా ఒక వైపు బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానిస్తూ, మరోవైపు భారత జాతీయ కాంగ్రెస్ అంబేద్కర్‌తో చాలా ఘోరంగా ప్రవర్తించిదని చెప్పే ప్రయత్నం చేస్తూ ప్రసంగం చేశాడు. 'అంబేద్కర్ పేరును ఉచ్చరించడం ఒక ఫ్యాషన్ అయిపోయిందన్న' అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ, తన పదవికి రాజీనామా చేసి, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ప్రజలు కార్యక్రమాలు చేపట్టారు.

ఈ ప్రతి చర్యలు షా రాజకీయ ప్రతిష్టను ఖచ్చితంగా తగ్గిస్తాయి. అంతేకాక తన పార్టీ అంబేద్కర్‌కు ఎలా న్యాయం చేస్తూ వచ్చిందో చెపుతూ తన పార్టీని స్వయంగా అభినందించాడు. దానిలో భాగమే విగ్రహాల నిర్మాణం తొలి అడుగు అని అన్నాడు. దీన్ని అంబేద్కర్ ప్రశంసించి ఉండేవాడా ? బాబాసాహెబ్ పుట్టిన రోజును 'సామాజిక సామరస్య దినోత్సవంగా' జరుపుకోవడం మొదలుపెట్టడాన్ని అమిత్ షా గొప్పతనంగా చెప్పుకున్నాడు. కానీ బాబాసాహెబ్ కన్న కలలకు ఇది పూర్తిగా విరుద్ధమైనది. ఆయన కుల నిర్మూలన గురించి మాట్లాడినాడు. కుల రహిత సమాజంపై అంబేద్కర్ దార్శనికతను, ఆయన కలల్ని తిరస్కరించే విధంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను లేదా ఆర్ఎస్ఎస్ – బీజేపీలు సామాజిక సామరస్య దినోత్సవాన్ని ప్రారంభించడం ద్వారా తమ ఎజెండాను ముందుకు తీసుకొనిపోతున్నాయి. వివిధ కులాల మధ్య సామరస్యతతో కుల వ్యవస్థను శాశ్వతంగా కొనసాగించడాన్ని సామాజిక సామరస్య దినం సూచిస్తుంది. లోతైన తాత్వికస్థాయిలో బీజేపీ కూడా, హిందూ సమాజం ప్రపంచ ఆది యుగం నుండి, బ్రాహ్మణులు నోటి నుండి, క్షత్రియులు భుజాల నుండి, వైశ్యులు తొడల నుండి, శూద్రులు పాదాల నుండి సృష్టించబడ్డారని ప్రకటించే దీనదయాళ్ ఉపాధ్యాయ యొక్క 'సమగ్ర మానవ వాదాన్ని' సమర్థిస్తుంది. వారి భావజాలం ప్రకారం ఈ విభజన, సమాజానికి స్థిరత్వాన్ని ఇస్తుంది. ఒకవేళ ఆర్ఎస్ఎస్ – బీజేపీలు నిజంగా అంబేద్కర్‌కు న్యాయం చేసి ఉండి ఉంటే, వారు దళితులు, బీసీలు, షెడ్యూల్డ్ తెగల వారికి రిజర్వేషన్లను నీరుగార్చే విధంగా సమాజంలో ఆర్థికంగా బలహీనపడిన వర్గాలకు రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టి ఉండేవారు కాదు. దళితులకు వ్యతిరేకంగా దుర్మార్గాలు, దౌర్జన్యాలను తగ్గించి, ఆ విధంగా మహిళలపై హింస కూడా తగ్గించే విధంగా వారు భరోసా ఇచ్చి ఉండేవారు.

కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను విస్మరించింది, ఆయనకు న్యాయం చేయలేదనే అమిత్ షా వాదనను లోతుగానే పరిశీలించాల్సిన అవసరం ఉంది. సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషికి హిందూ జాతీయవాద శక్తులు సహకారాన్ని అందించలేదు. సహాయం చెయ్యలేదు. జాతీయ నాయకత్వం అంటరానితనం, కుల సమస్యను ముఖ్యంగా 1930 దశాబ్దాల నుంచి చాలా తీవ్రంగా తీసుకుంది. 1932 నుండి గాంధీ అంటరానితనం, కుల వ్యవస్థల నిర్మూలన



సమస్యను తీసుకొని రెండేండ్లపాటు ఆ సమస్యపై చాలా తీవ్రంగా కేంద్రీకరించి పనిచేశాడు. కులాంతర వివాహం చేసుకోని ఏ పెళ్లి జంటకు ఆశీర్వాదం ఇవ్వకూడదని నిర్ణయం తీసుకున్నాడు. సబర్మతీ ఆశ్రమంలో ఒక దళిత కుటుంబానికి ఆశ్రయం కల్పించాడు. ఆ కారణంగా ఆశ్రమానికి దాతలు నిధులు ఇవ్వకుండా నిలుపుదల చేశారు. దళిత కుటుంబానికి ఆశ్రయం ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలతో ఆశ్రమం మూత పడింది. ఆయన లోక్‌సభకు ఎన్నిక కావడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించినప్పటికీ, ఆ ఎన్నికల రణరంగంలో బాబా సాహెబ్‌ను వ్యతిరేకించిన వారిలో హిందూ మహాసభ కూడా భాగస్వామిగా ఉంది. ఆ తర్వాత ఆయన రాజ్యసభకు నియమితులయ్యారు. ఆ తరువాత మధ్యంతర ప్రభుత్వంలో అంబేద్కర్ భాగస్వామి కావాలని పట్టుపట్టింది కూడా గాంధీజీనే. అదే విధంగా గాంధీజీ సలహా మేరకు భారత రాజ్యాంగ రచనా కమిటీకి అంబేద్కర్‌ను అధ్యక్షుడిని చేశారు. అంబేద్కర్ ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని, ఆర్టికల్ 370ను వ్యతిరేకించాడనీ, ఆ కారణంగానే ఆయన కేబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశాడని అమిత్ షా ప్రచారం కూడా చేశాడు.

ప్రజాస్వామిక నిబంధనల ప్రకారం పని చేసిన మంత్రివర్గంలో ఆయన ఉన్నాడు. కాశ్మీర్ విషయంలో, ఆయన జోనల్ ప్రజల అభిప్రాయాలను కోరుకున్నాడు. స్థానిక జాతుల వైవిధ్యాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో కాశ్మీర్ లోయ, జమ్మూ, లడాఖ్‌లు వేరువేరుగా ఉండాలని కోరుకున్నారు. ఈ కారణాలతోనే అంబేద్కర్ మంత్రి పదవికి రాజీనామా చేశాడనే అమిత్ షా అభిప్రాయాలు పూర్తిగా తప్పు. అంబేద్కర్ మంత్రి పదవికి రాజీనామా చేయడానికి అసలు కారణం పార్లమెంటులో హిందూ కోడ్ బిల్లు అసలు రూపంలో ఆమోదం పొందడంలో వైఫల్యం చెందడమే. హిందూ కోడ్ బిల్లు ముసాయిదాను తయారుచేయాలని అంబేద్కర్‌ను జవహర్‌లాల్ నెహ్రూనే కోరాడు. ఆ ముసాయిదాను తయారు చేసే క్రమంలోనే అంబేద్కర్ మహిళల సమానత్వాన్ని ముందుకు తెచ్చి పెట్టాడు. ఈ బిల్లు నేపథ్యం ఏమంటే, వివిధ మతాలకు చెందిన వారి వ్యక్తిగత చట్టాలకు దిశా నిర్దేశం చేసే వివిధ కోడ్‌లు ఉన్నాయి. వివాహం, విడాకులు, వారసత్వం, పిల్లల సంరక్షణల విషయంలో వ్యక్తిగత చట్టాలు వర్తిస్తాయి. హిందూ కోడ్ బిల్లు బహిర్గతం కావడంతో దానికి వ్యతిరేకంగా గావు కేకలు మొదలయ్యాయి. ఇది, సనాతన ధర్మాన్ని నాశనం చేసే ప్రయత్నమని ఆర్ఎస్ఎస్, దాని పరివారం ప్రచారం చేశాయి. పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించి, డిసెంబర్ 12, 1949న ఆర్ఎస్ఎస్ అనుచరులు అంబేద్కర్, నెహ్రూల దిష్టి బొమ్మలను దహనం చేశారు. పెద్ద సంఖ్యలో బహిరంగ సభలు నిర్వహించి, హిందూ కోడ్ బిల్లు, అంబేద్కర్‌లకు వ్యతిరేకంగా ఒక సామాజిక వాతావరణాన్ని సృష్టించారు. కాంగ్రెస్‌లో అంతరంగికంగా చాలా మంది హిందూ కోడ్ బిల్లును వ్యతిరేకించిన వారు కూడా ఉన్నారు. ఆ విధంగా హిందూ కోడ్ బిల్లు ఆమోదం పొందలేదు. ఆ కారణంగా తీవ్ర మనోవేదనకు గురైన అంబేద్కర్ రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆయన రాజీనామాను కాంగ్రెస్ పార్టీకి ఆపాదిస్తూ ఆయన్ను అవమానించడం, విస్మరించడం అంటే వాస్తవాన్ని వక్రీకరించడమే. అయితే, భారత రాజకీయాల్లో అంబేద్కర్, ఆర్ఎస్ఎస్ పరివారం భావజాలం పరస్పర వ్యతిరేక ధ్రువాలుగా ఉన్నాయి. గడిచిన మూడు దశాబ్దాలకు మించిన కాలం నుంచి ఆర్ఎస్ఎస్ – బీజేపీలు ఎన్నికల కారణాలతో దళితులు, ఆది వాసీలను గెలవడానికి ప్రయత్నం చేస్తున్నారు. వారి మద్దతును సాధించడం కోసం వారు కొన్ని చర్యలు చేపట్టారు. కుల బానిసత్వం నుండి వారిని విముక్తి చేయడంలో రాజ్యాంగం పాత్రను చూస్తున్నారు కాబట్టి దళితుల్లో అధికులు రాజ్యాంగానికి అనుబంధంగా ఉన్నారు.

2024 సాధారణ ఎన్నికల్లో దళితులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడానికి ఉన్న కారణాలలో ఇదొక ప్రధాన కారణం. అంబేద్కర్ అందించిన మరొక పెద్ద సహకారం, భారత రాజ్యాంగ రూపకల్పన. దీన్ని కూడా బీజేపీ మాత సంస్థ ఆరెస్సెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. 'భారత కొత్త రాజ్యాంగం గురించిన దారుణమైన విషయం ఏమంటే, దానిలో ఎలాంటి భారతీయత లేదు. దానిలో ప్రాచీన భారతీయ రాజ్యాంగ చట్టాలు, సంస్థలు, పేర్లు, పదాల ఊసే లేదు' అని ఆర్ఎస్ఎస్ అనుబంధ పత్రిక ఆర్గనైజర్‌లో నవంబర్ 30, 1949న ప్రచురితమైన వ్యాసంలో పేర్కొంది. అదే విధంగా హిందూత్వ రాజకీయాల భావజాలానికి పితామహుడు అయిన సావర్కర్ కూడా, భారత రాజ్యాంగం లో 'భారతీయత అనేది లేదు' అని పేర్కొన్నాడు. అంబేద్కర్ అందించిన రెండు ప్రధాన సేవల్ని వ్యతిరేకించడంలో బలమైన స్థానాలను కలిగి ఉన్న అమిత్ షా, అంబేద్కర్‌కు తగిన గౌరవాన్ని ఇచ్చింది బీజేపీ మాత్రమే అని చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నాడు. వారి చర్యలన్నీ ప్రతీకాత్మకమైనవి, అవి వాస్తవమైనవి కాదు. పాకిస్థాన్ ఏర్పాటు 'మనకొక విషాదం', అది స్థూల విషాదానికి, ముఖ్యంగా దళితుల బానిసత్వానికి మార్గాన్ని తెరిచే హిందూ మత రాజ్యానికి మార్గాన్ని సుగమం చేస్తుందని అంబేద్కర్ తన సవరించిన రచన 'థాట్స్ ఆన్ పాకిస్థాన్'లో పేర్కొంటాడు. అమిత్ షా ప్రధాన ఎజెండా హిందూమత రాజ్యస్థాపన, అంటే బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రధాన విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, సామాజిక న్యాయం లాంటి లక్ష్యాలకు పూర్తిగా వ్యతిరేకమైన ఎజెండా. ❑

**(అనువాదం : బోడపట్ల రవీందర్)**

# ఓట్ల మాయా బజార్లో మన స్వతంత్రం గణతంత్రం



- మాడభూషి శ్రీధర్

జనవరి 25వ తేదీ కన్నా ముందు అంటే గణతంత్రానికి ముందు రోజు 75 ఏళ్ల కిందట మన భారత ఎన్నికల కమిషన్ ఏర్పడింది. రాజ్యాంగం వచ్చిన తరువాత కీలకమైన ఘట్టం ఎన్నికల కమిషన్. ఎన్నికలు లేకపోతే ప్రజాస్వామ్యం లేదు, భారత రాజ్యాంగం లేదు. ఇంతెందుకు మన స్వాతంత్ర్యానికి అర్థం ఉండదు. 75, 76 సంవత్సరాల కిందట మనకు రాజ్యాంగం ఎంత ప్రధానమైన అంశం ఏమిటో తెలుసా? మన ఓటు హక్కు. ఇది జాతీయ ఓటర్ల రోజు. అద్భుతమైన రోజు. ఎన్నికల యంత్రాంగం స్వతంత్రత లేకపోతే మనది స్వతంత్రమైన దేశం కాదనుకోవలసిందే. ఏ కారణంగానైనా పరిపాలకులు, అధికారుల యంత్రాంగం తప్పించుకుంటే అది ప్రజాస్వామ్య ప్రక్రియతో అన్యాయమైన జోక్యం చేసుకోవడమనీ అది ప్రాథమిక హక్కును భంగపరచడమే అని బీఆర్ అంబేడ్కర్ స్పష్టంగా చెప్పారు. జూన్ 1949న భారత రాజ్యాంగ నిర్ణాయక సభ Constituent Assemblyలో ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా అంబేడ్కర్ ప్రకటించారు.

### మన స్వాతంత్ర్యం గొప్పతనం

మొత్తం భారతదేశంలో కేవలం ఒక రెండు శాతం లేదా రెండున్నర శాతం ప్రజలకు ఓటు హక్కు ఉందంటే మన బానిస పాలన లక్షణం ఏమిటో తేలిపోతుంది. కొందరు జమీందారులు, సంస్థానాధీశులైన వారికి, వారికన్నా కొంచెం తక్కువ వారైన భయంకరమైన భూస్వాములు, విపరీత సంపన్నులు మరికొందరు మాత్రమే ఓటు హక్కు ఉండేది. ఈ విషయం అర్థం చేసుకుంటే మన స్వాతంత్ర్య గొప్పతనం ఏమిటో అర్థమవుతుంది. ఇంగ్లీషు హిందీ, తెలుగు వంటి అన్ని భాషల్లో అందరికీ బాగా తెలిసింది ఓటు. ప్రతి రాజ్యాంగ నిర్ణాయక సభ ప్రతినిధి ఒకే ఒక అంశంపైన ఏకాభిప్రాయం ఉన్నది వయోజనుడైన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు. ఇది సామాన్యమైన హక్కు కాదు. చాలా చాలా ప్రాణాలకు ప్రాణమైన హక్కు. ఓటు లేకపోతే మన స్వతంత్రానికే అర్థం లేదు. మనకు స్వతంత్రం ఉందనేది అనుమానమే కాని కచ్చితంగా స్వరాజ్యం ఉందని ఒప్పుకుంటారు. మనకు సురాజ్యం మాత్రం లేదనే విమర్శలు ఉన్నాయి. కాని అందరికీ సమానంగా ఉన్నది ఓటు అని అర్థమైంది. సమానత గొప్పతనం ఎక్కడ ఉందంటే, బలహీనుల వారికి ఓటు ఇవ్వకూడదన్నా, మహిళలకు ఇవ్వలేమన్నా, చదువుకున్న వారికే ఇస్తామన్నా సమానత ఉండదు.




1950లో ప్రపంచంలో చాలా దేశాల్లో సమాన ఓటింగ్ లేదు. కనుక ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకున్న అనేకానేక ప్రభుత్వాలకు సమాన ఓటు లేదు. చాలా చాలా సంవత్సరాల తరువాత మన ప్రపంచానికి అందరికీ ఒకటే ఓటు అనే అద్భుత సంస్కరణ ప్రతి వ్యక్తికీ హక్కు. ఓటింగ్ హక్కుపైన ఒకటే పరిమితి ఉంది. అదే 21 సంవత్సరాల వయసు ఉండడం. ఆ తరువాత 18 ఏళ్ల వయసుంటే చాలు ఖచ్చితంగా ఓటు హక్కు ఇవ్వాల్సిందే. ఓటు అమ్ముకుంటున్నారో కొంటున్నారో, ఓటు వేస్తున్నారో లేదో, ఆ ఓటు పక్కనే ఉండి నిద్రపోయినా అవసరం లేదు. కాని హక్కు మాత్రం ఉంది. మనం వాడుకుంటున్నందు వల్లనే ఇవ్వాళకు రక్తపాశం లేకుండానే అధికారం మారిపోతూ ఉన్నది. ఇది నిశ్శబ్ద విప్లవం. ఓ అర్ధరాత్రి ఫలితాలు తెలిసినపుడు అధికారం మార్పిడి జరుగుతున్నది. ఎంత గొప్ప విషయం!

మన దేశంలో ఎందరు ఓటు హక్కు ఎంత మందికి ఉందో తెలుసా ? 99.1 కోట్ల మందికి ఓటు అధికారం ఉంది. వీరిలో 18 నుంచి 29 వయసు వున్న 21.7 కోట్ల యువశక్తి కాస్త మెదడు వాడుకుంటే చాలు ప్రభుత్వం మారిపోతుంది. మనం దాదాపు 70 శాతం మంది ఓట్లు వాడుకున్నందుకు ప్రభుత్వాలు పడిపోయాయి. నియంతలు ఇంటికి పోవలసి వచ్చింది. (కొత్త నియంతలు వస్తూ ఉంటే అయిదేళ్లకు ఎదురుచూసి ఓడించి పడేయాల్సిందే) అదీ ఈ ఓటు మాయ. ఓటింగ్ వంటిది మరోటి లేదు. ఖచ్చితంగా నేను ఓటేస్తాను అనే నినాదంతో Nothing Like Voting, I Vote for Sure ఈ ఎన్నికల కమిషన్ 75వ వార్షిక ఉత్సవం జరుగుతున్నది. 2011 నుంచి జాతీయ ఓటింగ్

దినోత్సవం నిర్వహిస్తున్నారు. కొత్త యువతీ యువకులు ఉ(దేకంగా) ఉత్సాహంగా ఓటింగ్‌కు పాల్గొనడానికి సిద్ధంగా ఉంటే మన ప్రజాస్వామ్యం చైతన్యంగా ఉందనుకుంటాం. ఎలోక్టర్ ఫోటో ఐడెంటిటీ కార్డు (EPIC) కీలకమైన గుర్తింపు ఇది.

### మన ఘన గణతంత్ర ఇది

రాజ్యాంగం ఏర్పడిన తరువాత 1952లో తొలి ఎన్నికల సంగ్రామం జరిగింది. అదొక గొప్ప పండుగ అని పెద్దలు అనే వారు. కొన్ని దశాబ్దాల కింద ఓటు పోలింగ్ బూత్ కు రాకపోతే ఆ వ్యక్తి చనిపోయేవారనుకునేది. ఇంత కష్టం చేసి ఓటేయడం ఎందుకు అని ఎవరైనా అంటే నేను బతికే ఉండాలనే గుర్తింపు అంటే ఓటు వేయడానికి నిదర్శనమని అనేవారు. ఓటు హక్కులు వేయించడానికి ఏర్పాట్లు చేసేది మన ప్రభుత్వ వ్యక్తులే. అధికారులు, ఉద్యోగులు, నాలుగోస్థాయి ఉద్యోగులు, ఉపాధ్యా యులు ఓటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇది చాలా కష్టమైన పని. వాళ్లంతా కొన్ని నెలలపాటు కష్టపడితే, హాయిగా ఆడుతూ పాడుతూ ఓటు వేసుకోవచ్చు. ఎంత సుఖమో కదా. ఈ కార్యక్రమం నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ అనుభవం ఉన్న సీనియర్ దక్షులైన యోగ్యులైన అధికారులను ముగ్గురిని ఎంచుకుని పనిచేసే వారు దాన్ని ఎన్నికల కమిషన్ అంటారు.

### మరిచిపోలేని శేషన్

ఇది వరకు శేషన్ ఒక్కరే ఎన్నికల కమిషన్ నిర్వహణ బాధ్యతలను అద్భుతంగా నడిపారు. ఆ తర్వాత ముగ్గురు కమిషనర్లను నియమించారు. వారిలో ఒకరు ప్రధాన కమిషన్ అధికారిగా ఉన్నారు. ఈ కమిషన్ ముగ్గురితో స్వేచ్ఛగా ఎన్నికలను జరిపించడం చిన్న విషయం కాదు. అందుకు స్వేచ్ఛగా ఎన్నికలలో పోలింగ్ జరిపించేందుకు కమిషనర్లు స్వచ్ఛంగా ఉండాలి. అంటే నీతివంతులై ఉండాలని విడిగా చెప్పనవసరం లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజ్యాంగ బద్ధంగా కావలసిన అధికారం(సీఈసీ) ఇచ్చారు. ప్రధానమంత్రి నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ సిఫారసు మేరకు రాష్ట్రపతి ఒక ఎన్నికల కమిషనర్‌ను నియమిస్తారు. వారిలో సీనియర్ కమిషనర్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తారు. ఈ అధికారం భారత రాజ్యాంగం ఆర్టికల్ 324 నుండి సంక్రమించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు ప్రత్యేక అధికారాలు లేవు. ఆ ముగ్గురిలో మెజారిటీ అభిప్రాయం ద్వారా నిర్ణయం సాగుతుంది. ఈ మధ్య 2023లో సవరణ చట్టం చేసారు. ప్రధానితో లోకసభ ప్రతిపక్ష నాయకుడు, ఎంపికైన మరొక మంత్రి ఉంటారు. అంటే అధికారంలో ఉన్న ఇద్దరు అనుకుంటూ ప్రతిపక్ష నాయకుడు ఒప్పుకునే అవకాశాలు తక్కువ. 65 ఏళ్ల వయసులో పదవీ నిరమణ చేయాలి. లోకసభ, రాజ్యసభ మూడింట రెండు వంతుల మెజారిటీతో పాల్గొన్నపుడు అభిశంసన ప్రక్రియ ద్వారా సీఈసీని పదవి నుండి తొలగించవచ్చు. ఆ పరిస్థితి ఎప్పుడూ రాలేదు.

### నిరసన వెనుక అనుమానాలు

ముగ్గురిలో ఇద్దరి మెజారిటీ ఉంటే కొన్ని నిర్ణయాలు తీసుకోవచ్చు. కాని ఒకరి నిరసన ఉంటే అది తీవ్రమైన అంశంగా పరిగణించాలి. ప్రధాని నాయకత్వంలో రాష్ట్రపతి నియమించినప్పటికీ ముగురూ నీతివంతంగా ఉంటూ, ప్రభుత్వ ఒత్తిళ్లు ప్రతిఘటిస్తూ పోరాడడం అవసరం. ఇక ముగ్గురూ ప్రభుత్వానికి పక్షపాతంగా ఉంటే స్వేచ్ఛగా ఎన్నికలు పోలింగ్ జరగడం ఉండదని చెప్పవలసిందే. ఈ మధ్య అరుణ్ గోయల్ గారితో మిగిలిన ఇద్దరికి అభిప్రాయభేదాలు రావడం ఆయన రాజీనామా చేశారు. 2027 డిసెంబర్ వరకు కమిషనర్‌గా గడువు ఉన్నప్పటికీ గోయల్ 2024 మార్చి 9న రాజీనామా చేయడం వల్ల అనుమానాలు వచ్చాయి. మోడల్ ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ)లో ఏ మాత్రం గందరగోళం ఉన్నా అనుమానాలు పెరుగుతాయి. గత ఎన్నికలలో, ఇటీవల జరిగిన ఎన్నికలు ముఖ్యంగా మహారాష్ట్ర ఎన్నికలలో తీవ్రమైన అనుమా నాలు కనిపించాయి. ఇప్పటికీ అనేక వివాదాలు వస్తున్నాయి. అన్నింటికన్నా ముఖ్యం ఏమంటే మతాన్ని ఎన్నికలలో విరివిరిగా దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు ఉంటే ఎన్నికలు స్వేచ్ఛగా జరిగినట్టు చెప్పడం సాధ్యం కాదు. ఎన్నికల్లో విపరీతమైన దబ్బు వెదజల్లడం, ఓటర్లను బెదిరించడం, కండ బలం వాడడం వల్ల మంచి ఎన్నికలు సాగవు. ముఖ్యంగా విపరీతంగా వచ్చే ఫేక్ న్యూస్‌ను ఉపయోగించడం వల్ల ఇప్పుడు ఎన్నికలు సాఫీగా జరగడం లేదు.

అక్రమాలు జరగడానికి ప్రభుత్వాలే పాల్పడానికి తయారైతే ప్రజాస్వామ్యం మీద నమ్మకం తగ్గిపోతుంది. ఎన్నికల మంత్రాం గం సరే, పోలింగ్ యంత్రాలు ఇవిఎం సంగతేమిటి? ఎన్నికలు మాయాబజార్‌గా నిర్వహిస్తే రాజ్యాంగం ఉందన్నట్టా లేనట్టా?

### సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా వినరా?

నిజానికి ఈ సారి ఎన్నికలు కేవలం ఎన్నికల బాండ్లు చాలా అనుమానాలకు దారి తీశాయి. ముఖ్యంగా సుప్రీంకోర్టు కూడా ఎన్నికల బాండ్లు స్కీం చెల్లదని నిర్ణయించింది. అయితే ఆ పేరు మీద వేలు, లక్షల కోట్లు నిధులు వాడుకుంటే ఎన్నికలు సరిగానే జరుగుతున్నాయంటామా ? ఓటర్లకు అభ్యర్థుల గురించి తెలుసుకునే హక్కు ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన తరువాత ప్రతి నేరగాడు, ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థీ తన నేరాల చిట్టాలు, స్థిర చరాస్తులు నోట్ల కట్టలు కట్టలుగా, చదువుకొన్న (కొనని) పట్టాల వివరాలతో ఇచ్చిన ప్రమాణ పత్రాలు అట్లా పడి ఉన్నాయి. ఓటర్లకూ పట్టవు, రాజకీయ పార్టీలకూ పట్టవు కదా. మొగుడు మోసం చేస్తే విడాకుల కేసు వినడానికి ముప్ఫయ్

ఏళ్లు వాయిదా వేస్తే దేశానికి ఏమీ నష్టం లేదుట. ఆమె రెండో పెళ్లి సంగతి దేశానికేం పట్టింది. కాని 43 శాతం ప్రజా ప్రతినిధుల మీద ఉన్న తీవ్ర నేరాలను త్వరగా విచారణ జరపకపోతే మన దేశ రాజ్యాంగ సంవిధాన సుపరిపాలన వ్యవస్థ కుప్పగూలిపోతుంది కదా. లోకసభలో రెండు వందలపైగా అనే కానేక శాసనసభల్లో వేలాది మంది ప్రజా ప్రతినిదుల్లోని సగం మంది నేరగాళ్లే అని రుజువైపోయి జైళ్లకు వెళ్లిపోతే ఈ దేశం ఏమైపోతుంది? ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ మనకు ఉపయోగపడింది కేవలం సుప్రీంకోర్టు వల్లనే, సుప్రీంకోర్టు అద్భుతమైన తీర్పు వల్లనే. ఈ వివరాలు అధికార పార్టీ బాండ్ల ద్వారా దాదాపు 70 కోట్ల 7 వేల కోట్ల రూపాయలు ఆదాయం సంపాదించారు. కోట్లకు కోట్లు రూపాయలను బాండ్ల ద్వారా 'సంపాదించారు'. వీటిని మనం విరాళాలు అంటున్నాం. 22 వేల రెండు వేల పదిహేడు ఎలక్టోరల్ బాండ్స్ కొనుక్కున్నారు అని సుప్రీంకోర్టుకి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారికంగా భారతీయ ఎన్నికల కమిషన్ వివరించండని ఆదేశించింది. ఎలక్టోరల్ బాండ్స్ ప్రవేశపెట్టడానికి ఆ నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017 జనవరి 28న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అభిప్రాయం కోరుతూ లేఖ రాశాడు. జనవరి 30న రాసిన జవాబులో ఈ పద్ధతి చాలా అక్రమాలకు దారి తీసే అవకాశం ఉందనీ, పారదర్శకంగా ఉండవలసిన ఎన్నికల విరాళాలను గోప్యంగా మారుస్తుందని, దీనివల్ల బలవంతపు విరాళాలు వసూలు చేసే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ అభిప్రాయపడింది. ఎటువంటి చర్చా జరగకుండానే, లోకసభలో ఉన్న మెజారిటీ వాళ్లు ఆలోచించకుండా ఎంపీలు ఎలక్టోరల్ బాండ్స్‌ను చట్టం వలె దేశంలోకి దొడ్డిదారిన ప్రవేశించింది. అందుకు తగినట్టుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాన్ని సవరించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయిపోయి 2018 జనవరి 2న ఎలక్టోరల్ బాండ్ పథకం ప్రారంభించారు.

31 మార్చి 2017న, ఫైనాన్స్ యాక్ట్, 2017 ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 (RoPA), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934, ఆదాయపు పన్ను చట్టం, 1961, కంపెనీల చట్టం, 2013లను సవరించింది. ఆర్థిక చట్టం, 2017లోని సెక్షన్ 11, ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 13ని సవరించింది, ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వచ్చిన విరాళాల వివరాలను రాజకీయ పార్టీలు ఉంచుకోకుండా మినహాయించింది.

## ఎలక్టోరల్ బాండ్లను వ్యతిరేకించిన ఎన్నికల సంఘం

25 మార్చి 2019న, ప్రతివాదులలో ఒకరైన ఎన్నికల సంఘం (ECI) ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. పొలిటికల్ ఫైనాన్స్‌లో పారదర్శకత లక్ష్యానికి ఈ పథకం విరుద్ధమని అఫిడవిట్ పేర్కొంది. 26 మే 2017న ECI కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖను పంపింది. 'రాజకీయ ఆర్థిక/నిధుల పారదర్శకతపై పరిణామాలు /ప్రభావానికి' వ్యతిరేకంగా ఈసీ హెచ్చరించింది. విరాళాలకు సంబంధించిన వివరాలను పంచుకోవడం నుండి రాజకీయ పార్టీలను మినహాయించడం, విదేశీ నిధుల సమాచారాన్ని చీకటిలో ఉంచుతుందని వారు సమర్పించారు. ఈ అఫిడవిట్‌లో, 'భారతదేశంలోని రాజకీయ పార్టీల విదేశీ నిధులను తనిఖీ చేయలేదు, ఇది భారతీయ విధానాలను విదేశీ కంపెనీలచే తీవ్రంగా ప్రభావితం చేస్తుంది' అని పేర్కొంది.

12 ఏప్రిల్ 2019 నుండి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలను ECIకి సమర్పించాలని SBIని ఆదేశించింది. అయితే ఈ సమాచారం ద్వారా బైటపడిన, బైటపడుతున్న కుంభకోణాలు దజన్ల సంఖ్యలో ఉంటాయి. మొత్తం మీద 2019 ఏప్రిల్ 12 నుంచి 2024 ఫిబ్రవరి 15 వరకూ గడిచిన ఐదేళ్లలో దాదాపు 1300 కార్పొరేట్ సంస్థలు, 20 రాజకీయ పార్టీలకు, రూ.12,145 కోట్ల విరాళాలు అందజేశాయి. 2018 జనవరి నుంచి 2019 ఏప్రిల్ 11 వరకు రూ.623 కోట్ల బాండ్ల అమ్మకాలు జరిగాయి. అంటే మొత్తం మీద ఈ పథకం కింద రూ.12,769 కోట్ల విరాళాలు రాజకీయ పార్టీలకు అందాయి. అందులో అత్యధిక భాగం రూ.6986.5 కోట్లు భారతీయ జనతా పార్టీకే దక్కాయి. మొదటి స్థానంలో 54.7 శాతంతో భారతీయ జనతా పార్టీ ఉంటే, రెండో స్థానంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌కు 10.9 శాతం (రూ.1,397 కోట్లు), మూడో స్థానంలో కాంగ్రెస్‌కు 10.4 శాతం (రూ.1,334 కోట్లు), నాలుగో స్థానంలో భారత రాష్ట్ర సమితికి 10.3 శాతం (రూ. 1,322 కోట్లు) దక్కాయి.

## సుప్రీంకోర్టు కొట్టివేసిన తరువాత బాండ్ల సంగతేమిటి?

చివరకు 15 ఫిబ్రవరి 2024న, కేంద్రం కళాత్మకంగా నిర్మించిన 2018 ఎలక్టోరల్ బాండ్స్ (EB) పథకాన్ని కోర్టు ఏకగ్రీవంగా కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ)లో పొందుపరిచిన ఓటర్ల సమాచార హక్కును ఈ పథకం ఉల్లంఘించిందని బెంచ్ పేర్కొంది. ఎలక్టోరల్ బాండ్ల విక్రయాన్ని తక్షణమే నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది.

రాజ్యాంగం, పౌరుల హక్కులు, పౌరసత్వం, ఏదైనా బతికి ఉండాలంటే, ఒక కీలకమైన హక్కు వాక్ స్వాతంత్ర్యం, భావస్వేచ్ఛ. ప్రశ్నించకుండా, ఈ స్వేచ్ఛ ఉండదు. ఓట్లు కూడా స్వేచ్ఛలో ముఖ్యమైన భాగమే. ఖచ్చితంగా అడగకుండా హక్కును రక్షించుకోవలసిన అవసరం. మరి ఆ తరువాత 'సేకరణ అనబడే విరాళాల' డబ్బుతో వచ్చిన ఎన్నికలలో గెలిచిన పార్టీలను చట్టప్రకారమైనదే అవుతుందా? ఆ డబ్బు మళ్లీ వాపస్ ఇస్తారా? ప్రశ్నించండి, ప్రజాస్వామ్యాన్ని బతికించండి. ❑


# అత్యంత ధనిక పార్టీ బీజేపీనే

**భా**రతదేశంలో అత్యంత ధనిక పార్టీగా బీజేపీ మరోసారి అవతరించింది. కేంద్రంలోని అధికార కమలం పార్టీ వార్షిక ఆదాయం రోజు రోజుకూ పెరిగిపోతోంది. 2024 మార్చి 31 నాటికి బీజేపీ వద్ద రూ.7,113.80 కోట్ల నిధులున్నట్లు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తాజాగా విడుదల చేసిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రెండో స్థానంలో కాంగ్రెస్ వద్ద రూ.857 కోట్లు ఉన్నట్లు పేర్కొంది.

2023-24లో లోక్‌సభ ఎన్నికలు ప్రకటించిన సమయంలో బీజేపీ రూ.1,754 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తం 2022-23లో ఖర్చు చేసిన రూ.1,092 కోట్లు కంటే 60 శాతం అధికం. కాంగ్రెస్ పార్టీ 2023-24లో రూ.619.67 కోట్లు, 2022-23లో రూ.192.56 కోట్లు ఖర్చు చేసింది.

ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీ అత్యధిక ఆదాయం ఎన్నికల బాండ్ల ద్వారానూ బీజేపీకే అత్యధిక ఆదాయం లభించింది. 2022-23లో రూ.2,360.8 కోట్లుగా ఉన్న ఆ పార్టీ ఆదాయం మరుసటి సంవత్సరానికి ఏకంగా 83 శాతం పెరిగి రూ.4,340.5 కోట్లకు చేరింది. ఇందులో రూ.1,685.6 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చినవేనని ఎన్నికల కమిషన్‌కు బీజేపీ సమర్పించిన తాజా వార్షిక ఆడిట్ నివేదిక చెబుతోంది. ఏ ఇతర పార్టీ కూడా బాండ్ల రూపంలో ఇంత భారీగా వార్షిక ఆదాయం పొందలేదు. ఇదే కాలంలో కాంగ్రెస్ ఆదాయం రూ.452.4 కోట్ల నుండి రూ.1,225 కోట్లకు, అంటే 170 శాతం పెరిగింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఎన్నికల బాండ్ల రూపంలో తన ఆదాయాన్ని 384 శాతం మేర పెంచుకుంది. 2022-23లో కాంగ్రెస్‌కు ఎన్నికల బాండ్ల ద్వారా రూ.171 కోట్ల ఆదాయం లభిస్తే, 2023-24లో రూ.828.4 కోట్లు వచ్చింది. బాండ్లకు సంబంధించినంత వరకూ బిజెపి తర్వాత కాంగ్రెస్‌కే ఎక్కువ ఆదాయం లభించింది. 2023-24లో బాండ్ల రూపంలో బిఆర్ఎస్‌కు రూ.685.5 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.612.4 కోట్ల ఆదాయం సమకూరింది.

ఖర్చుల విషయానికి వస్తే గత ఆర్థిక సంవత్సరంలో బీజేపీ రూ.2,211.7 కోట్లు ఖర్చు చేసింది. 2022-23లో పెట్టిన ఖర్చుతో పోలిస్తే ఇది 62 శాతం అధికం. ఇందులో ఎన్నికలు, సాధారణ ప్రచారంపై ఆ పార్టీ రూ.1,754 కోట్లు ఖర్చు చేసింది.




గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ వార్షిక వ్యయం రూ.1,025.20 కోట్లు. రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయాత్ర కోసం ఆ పార్టీ రూ.49.6 కోట్లు ఖర్చు చేసింది. తొలి విడత భారత్ జోడోయాత్రకు రూ.71.8 కోట్లు ఖర్చయ్యాయి.

2023-24 ఆడిట్ నివేదికలో బీజేపీ ప్రకటించిన స్వచ్ఛంద విరాళాలు రూ.3,967 కోట్లు. ఇందులో ఎన్నికల బాండ్ల ద్వారా రూ.1,685.6 కోట్లు, ఆజీవాన్ సహయోగ్ నిధి ద్వారా రూ.236.3 కోట్లు, ఇతర విరాళాల ద్వారా రూ.2,042.7 కోట్లు సమకూరాయి. ఆ పార్టీకి వ్యక్తిగత దాతలు రూ.240 కోట్లు, కార్పొరేట్లు రూ.1,890 కోట్లు, సంస్థలు-సంక్షేమ సంఘాలు రూ.101.2 కోట్లు, ఇతరులు రూ.50 కోట్లు అందజేశారు.

గత సంవత్సరం మార్చి 31 నాటికి బీజేపీ చేతిలో రూ.109.2 కోట్లు, బ్యాంకుల్లో రూ.1,627.2 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో 5,377.3 కోట్లు ఉన్నాయి. ❑

# ఎన్నికల ప్రక్రియపై అర్థవంతమైన చర్చ జరగాలి



- పరకాల ప్రభాకర్

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సమగ్రతల గురించిన చర్చను మరింత అర్థవంతంగా నడపాల్సిన అవసరం ఉంది. ఈ చర్చలో ఎన్నికలాధారిత ప్రజాస్వామిక వ్యవస్థ పాటించాల్సిన విలువల ప్రాధాన్యత ముందు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల సమస్య చాలా చిన్నదే. ఎన్నికల క్రమంలో ప్రజల భాగస్వామ్యం కేవలం ఓటు వేయటానికి మాత్రమే పరిమితమైనది కాదు. తాము ఎవరికి ఓటే వేయాలనుకున్నామో ఆ ఓటు వారికి జమ అయ్యిందా లేదా, జమ పడిన ఓటు లెక్కకు వచ్చిందా లేదా అన్నది తనిఖీ చేసుకునేందుకు అవకాశం ఉండటం కీలకమైన సూత్రం. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వేగంగా, తగిన సామర్థ్యంతో పని చేస్తున్నాయా ? లేదా ? అన్న దానికంటే పైన చెప్పిన విధంగా ఓటర్ల మనోభావాలకు అనుగుణంగా వారు తమ ఓటు హక్కును వినియోగించుకోగలుగుతున్నారా ? లేదా ? వినియోగించుకున్న ఓటుకు విలువ దక్కుతుందా లేదా అన్న అంశానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గురించిన సాంకేతికత, భద్రతలకే పరిమితం అవుతోంది. ఎన్నికల ప్రజాస్వామ్యంలో మౌలిక సూత్రాల గురించిన చర్చకు దారితీయటం లేదు. ఈ చర్చ పెడుతున్నామంటే ఈవీఎంలలో జరుగుతున్న లోపాలు, మోసాలను పట్టించుకోవటం లేదని కాదు. అదే సమయంలో ఎన్నికల కమిషన్ చర్యలను సమర్థించే వారు, లేదా సాంకేతికతల గురించి చర్చోపచర్చలు చేసేవారు ముందుకు తెస్తున్న వాదలను అర్థవంతంగా చర్చకు పెట్టాలి. ఈవీఎంల పట్ల ఓటర్లల్లోనూ, రాజకీయ పార్టీల్లోనూ ఉన్న అనుమానాలు, ఆందోళనలను కొట్టిపారేసే సాంప్రదాయానికి స్వస్తి చెప్పాలి. ఈవీఎంలను ప్రశ్నించటం ఒక్కటే ప్రజా స్వామ్యంలో అసమ్మతికి ఆఖరి సాధనం కాదని స్పష్టం చేయాలి.

ఎన్నికల క్రమం సమగ్రతల గురించిన అనుమానాలు తొలగక పోవడానికి ప్రధాన కారణం కేంద్ర ఎన్నికల పనితీరులో ఉన్న గందరగోళం. పారదర్శకతా రాహిత్యం. ఇందులో న్యాయవ్యవస్థ ప్రత్యేకించి సుప్రీంకోర్టుకు కూడా కొంత బాధ్యత ఉంటుంది. ఎన్నికల ప్రక్రియ గురించి న్యాయస్థానం ముందుకు వచ్చిన పలు వ్యాజ్యాలను విచారించేటప్పుడు కేవలం ఎన్నికల సంఘం ఇచ్చిన వాంగ్మూలాలను యథాతథంగా ఆమోదించి హడావుడిగా తీర్పులు ఇవ్వటం ఎన్నికల పారదర్శకత, సమగ్రతలపై సందేహాలు కొనసాగటానికి మరో కారణంగా ఉంది.

ఈ ప్రయత్నంలో న్యాయవ్యవస్థ స్వతంత్ర మేధావులు, పౌర మేధావుల అభిప్రాయలను పరిగణించటానికి వారు లేవనెత్తిన ప్రశ్నలను సావధానంగా ఆలకించటానికి సిద్ధం కావటం లేదు. 2019 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం వ్యవహరిస్తున్న అనుమానాస్పద తీరు, సందేహాస్పదమైన పద్ధతుల్లో రూపొందిస్తున్న విధి విధానాలు గమనిస్తే స్వతంత్రంగా నిస్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కైనందు వల్లనే ఈ గందరగోళం ఏర్పడుతుందా అన్న సందేహానికి తావిస్తోంది.

తాజాగా 2024 డిసెంబరు 20న కేంద్ర ప్రభుత్వం కండక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్‌లో 93(2) (అ) నిబంధనను సవరిస్తూ ఓ గెజిట్ ప్రకటన జారీచేసింది. ఇప్పటి వరకూ ఉన్న గందర గోళాన్ని ఈ సవరణ మరింత తీవ్రం చేసింది. ఎన్నికల క్రమానికి సంబంధించిన కొన్ని వివరాలను, రికార్డులను పిటిషనర్‌కు అందుబాటులో ఉంచాలని పంజాబ్ హర్యానా హైకోర్టు తీర్పునిచ్చింది. ప్రస్తుతం ఉన్న ఎన్నికల నిర్వహణ నిబంధనలకు లోబడే ఈ తీర్పు ఉన్నది. కానీ ఉన్నట్లుండి ఈ వివాదంలోకి కేంద్ర ప్రభుత్వం తలదూర్చింది. తనకున్న విచక్షణాధికారాలను ఉపయోగించి కేంద్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదించి రూల్ 93(2) (అ)ను సవరిస్తున్నట్లు గెజిట్ జారీచేసింది. అంటే ఇకపై ఎన్నికల క్రమానికి సంబంధించిన ఎటువంటి రికార్డులు, పత్రాలు, వివరాలు పౌరులకు ఇవ్వాల్సిన అవసరం లేదన్నది ఈ తాజా సవరణ సారాంశం. కేంద్ర ప్రభుత్వం హడావుడిగా జారీ చేసిన ఈ సవరణను గమనిస్తే ఈవీఎంల సాంకేతిక సామర్థ్యం, నిష్పాక్షికత, భద్రతల గురించి ప్రజల్లోనూ, విశ్లేషకుల్లోనూ, ఈ రంగంలో ప్రవేశం ఉన్న మేధావులు, రాజకీయ పార్టీల్లోనూ గూడుకట్టుకున్న అనుమానాలు, సందేహాల్లో ఎంతో కొంత వాస్తవం లేకపోలేదన్న అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వమే కల్పిస్తోంది. ఈ వ్యవహారం అనుమానాలకు తావిచ్చేదే కానీ సందేహ నివృత్తి చేసేది కాదు. కేంద్రంలో పాలక పార్టీ, ఎన్నికల సంఘం ప్రజల నుండి దాస్తున్న సంగతులు వాస్తవాలేమన్నా ఉన్నాయా? ఎన్నికల నిర్వహణ క్రమానికి సంబంధించిన రికార్డులు ప్రజా పరిశీలనకు పెట్టడానికి భయపడుతున్నారా? కాదనే ఆశిద్దాం. ఒకవేళ దాయటానికి ఏమీ లేదనే అనుకున్నప్పుడు ఇంత హడావుడిగా ఈ సవరణలు చేయాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్న ముందుకొస్తుంది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తే అసలు ఈ సందేహాలకే తావుండేది

కాదు కదా. ఎన్నికల నిర్వహణ క్రమానికి సంబంధించిన విషయాల్లో కేంద్ర ప్రభుత్వం పారదర్శకతతో వ్యవహరించటం లేదన్న విషయాన్ని అర్థం చేసుకోవడానికి మరో ఉదాహరణను కూడా చేద్దాం. 2019లో కేంద్ర ప్రభుత్వం ఏ సవరణ తెచ్చింది. ఆ సవరణ ప్రకారం కేంద్ర సమాచార కమిషనర్లు తమ జీతభత్యాల కోసం అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే పదవుల్లో ఉన్నంత కాలం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు ఇస్తేనే ప్రభుత్వం నుండి జీత భత్యాలు అందుతాయన్నమాట. ఇటువంటి సవరణ మొత్తంగా కేంద్ర సమాచార కమిషన్ స్వయంప్రతిపత్తికే గొడ్డలి పెట్టు. అప్పట్లో ఆ సవరణ తీసుకొచ్చిన సందర్భం కూడా ముఖ్యమైనదే. గమనించదగ్గదే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో వీవీ పాట్‌ల లెక్కింపుకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘంపై పలు ఆరోపణలు వచ్చాయి. ఆ సందర్భంలో 2019 సవరణ వచ్చింది. ది క్వింట్ వార్తా సంస్థ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరిన ప్రశ్నల వెలుగులో ఈ గందరగోళం ప్రపంచ దృష్టికి వచ్చింది. '2019 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లవారీ సమాచారం కేంద్ర ఎన్నికల సంఘం వద్ద లేదు. ఈ సమాచారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల వద్ద ఉండొచ్చు. అందువల్ల ఆయా రాష్ట్ర ఎన్నికల కమిషనర్లకు సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకోవడం ద్వారా మీరు ఆశించిన సమాచారాన్ని పొందవచ్చు. (మీకు కావలిసిన సమాచారాన్ని సేకరించటానికి) ఎంతో మంది సమాచార అధికారుల భాగస్వామ్యం అవసరం అయినందున ఈ దరఖాస్తును నేరుగా వారికి బదిలీ చేయలేము' అన్నది క్వింట్ వార్తా సంస్థ అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఎన్నికల సంఘ సమాచార అధికారి ఇచ్చిన సమాధానం.

కానీ 'అన్ని రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు వివి పాట్ సమాచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి అందచేయాలంటూ' స్వయంగా ఎన్నికల సంఘం జారీ చేసిన సర్క్యులర్‌కు పైన ఆర్టీఐ దరఖాస్తు కింద ఇచ్చిన సమాధానానికి మధ్య పొంతన లేదు. రాష్ట్రాల వారీ, లోక్‌సభ నియోజకవర్గాల వారీగా కూడా ఇవ్వడానికి ఎన్నికల సంఘం సిద్ధం కాలేదు. అందువలన రెండో దఫా పోలింగ్‌లో ఉన్న లోపాలను, వ్యత్యాసాలను పరిశీలించటం అసాధ్యమైంది. ఈ దశకు సంబంధించిన తుది అంచనాలే ఉన్నాయి. తప్ప ప్రాథమిక అంచనాల వివరాలు లేవు. దాంతో పోలికే చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒకటి తర్వాత మరోటి సమస్యలు సందేహాలు పోగుపడుతూనే ఉన్నాయి.

కేంద్ర ఎన్నికల సంఘం ఆరు దశల పోలింగ్ వివరాలను 2024 మే 28న విడుదల చేసింది. ఏడో దఫా పోలింగ్‌కు సంబంధించిన వివరాలు జూన్ ఆరో తేదీకి గానీ వెలుగు చూడలేదు. ఈ లోగా మొత్తం ఎన్నికల క్రమం పూర్తయ్యింది. ఫలితాల ప్రకటన కూడా వెలువడింది. ఇన్ని రోజుల ఆలస్యంగా వెల్లడించినా 542 నియోజకవర్గాలకు 538 నియోజకవర్గాల్లో ఈవీఎంలలో పోలైన ఓట్లకూ, లెక్కించిన ఓట్లకూ మధ్య పొంతన కుదర్చలేకపోయింది ఎన్నికల సంఘం. సూరత్‌లో పోలింగే జరగలేదు. గతంలో ఓ కేసు సందర్భంగా ఫారం 17 సీలో ఉన్న వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న నిబంధనలేవీ లేవని ఎన్నికల సంఘం వాదించింది. ప్రతి పోలింగ్ బూత్‌లో పోలైన ఓట్ల తుది వివరాలు ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రాజకీయ పార్టీల వద్ద ఉంటాయని భావించబడిరది. అది నిజమే అయి ఉండొచ్చు. కానీ ఈ వివరాలు ఎన్నికల సంఘం వద్ద క్రోడీకరించబడతాయి. అటువంటి క్రోడీకరించబడ్డ వివరాలను ప్రజలతో పంచుకోవడానికి ఎన్నికల సంఘం సిద్ధం కాకపోవటమే ఆశ్చర్యానికీ, ఆందోళనకూ కారణం అవుతోంది.

అటు రాజకీయ పార్టీతో సంబంధం లేని పౌరుడు కానీ, అభ్యర్థి కాని ఈ వివరాలు తెలుసుకోవాలంటే అప్పుడు పరిస్థితి ఏమిటి? అటువంటి సాధారణ స్వతంత్ర పౌరులకు తెలుసుకునే అధికారం హక్కు లేదా ? ప్రజలకు వార్తలు వాస్తవాలు తెలియచేయాల్సిన మీడియాకు ఇటువంటి సమాచారం తెలుకునే హక్కు లేదా ? మన ఎన్నికలు కేవలం ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలకూ సంబంధించిన వ్యవహారమేనా? మొత్తం ఎన్నికల క్రమంలో ప్రధాన పాత్రధారి ఎవరు? ఎవరికోసం ఈ ఎన్నికలు ? ఈ ఎన్నికల్లో ప్రధాన పాత్రధారి సాధారణ పౌరుడు కాదా? ఈ దేశంలో ఏ రాజ్యాంగ వ్యవస్థ అయినా అంతిమంగా జవాబుదారీగా ఉండాల్సింది ప్రజలకే కదా? ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగానూ, పారదర్శకంగానూ వ్యవహరించాల్సిన పని లేదా? 17 సి ఫారంలో ఉన్న వివరాలు వెల్లడించేందుకు

ఎన్నికల సంఘం ఎందుకు జంకుతోంది? ఎన్ని ఓట్లు పోలయ్యాయి, ఎన్ని ఓట్లు లెక్కకు వచ్చాయి అన్నది ప్రజలకు తెలియాల్సిన అవసరం లేదా ? సమాచార కమిషనర్లను గుప్పెట్లో పెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఆరాటపడుతోంది? 'ఎన్నికల సంఘంతో సంప్రదించి' కేంద్ర ప్రభుత్వం హడావుడిగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలు సవరించేందుకు తాపత్రపడటంలో మతలబు ఏమిటి? ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రజాస్వామిక ప్రమాణాలు పాటించే వ్యవస్థలను కలిగి ఉండటం పౌరుల హక్కు. ఎన్నిల క్రమం పారదర్శకత, సమగ్రతల పరిరక్షణలో ఈ ప్రాథమికత అనివార్యమైన అవసరం. తిరుగులేని విషయం. దీనికి భిన్నంగా జరిగే ఏ చర్య అయినా పారదర్శకమైన ఎన్నికల క్రమానికి తూట్లు పొడుస్తుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది. ❑ **(అనువాదం : కొండూరి వీరయ్య)**

# 75 ఏళ్ల భారత రాజ్యాంగం - సవాళ్లు



- కె.ఎస్.లక్ష్మణరావు

**75** ఏళ్ల క్రితం అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం కాల పరీక్షకు తట్టుకుని నిలబడింది. దేశంలో విభిన్నమైన విశ్వాసాలను, కులాలను, సంస్కృతులను, భాషలను, అల వాట్లను, భావజాలాలను, ఆహారపు అలవాట్లను ప్రతిబింబించే భిన్నత్వానికి, బహుళత్వానికి భారత రాజ్యాంగం ఆధారమైంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఆర్థిక, సామాజిక న్యాయం, సమాఖ్య విధానం, లౌకిక విధానం, పౌర స్వేచ్ఛలు మొదలైన వాటికి రాజ్యాంగం కల్పించింది. 'భారత దేశ ప్రజలమైన మేము' అనే పీఠికలోని మొదటి వాక్యంతో ప్రజల సార్వభౌమాధికారాన్ని తెలిపింది. చరిత్రలో తరతరాలుగా అణచివేతకు గురైన ప్రజలకు రాజ్యాంగ రక్షణలు కల్పించింది. రాజ్యాంగంలో ఒకటవ నిబంధన ద్వారా భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా వర్ణించి రాష్ట్రాలకు హక్కులు, అధికారాలను కల్పించింది. అయితే ప్రస్తుతం రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలపై దాడి జరుగుతున్నది. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం ఆమోదించిన రోజున చెప్పినట్లుగా 'రాజ్యాంగం ఎంత మంచిదైనప్పటికి, అమలు చేసేవారు చెడ్డవారైతే అది తప్పకుండా చెడుగా మారుతుంది' అనే వాక్యాలు ప్రస్తుత పరిస్థితులకు వర్తిస్తాయి. 75 ఏళ్ల రాజ్యాంగ గణతంత్ర దినోత్సవ సందర్భంగా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవలసిన అవసరం ఏర్పడింది.

### కనుమరుగవుతున్న సంక్షేమ రాజ్య భావన

భారత రాజ్యాంగం సంక్షేమ స్థాపనను లక్ష్యంగా ప్రకటించింది. రాజ్యాంగం నాల్గవ భాగంలో ఆదేశిక సూత్రాల ద్వారా సంక్షేమ రాజ్యాన్ని ఏర్పరచాలని ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రజలందరి ఆర్థిక, సామాజిక జీవన ప్రమాణాలను పెంచాలని, సంపద కేంద్రీకరణ కారాదని నిర్దేశించింది. కార్మికులు, మహిళలు మొదలగు వారి శ్రమకు తగిన ఫలితం లభించాలని చెప్పింది. రాజ్యాంగం 21వ నిబంధనలో జీవించే హక్కును సుప్రీం కోర్టు తన తీర్పుల ద్వారా విస్తృతపరిచి ప్రజల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని ఆదేశించింది. కాని 1991లో ఆర్థిక సంస్కరణలు, నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన తరువాత ప్రభుత్వాలు తమ బాధ్యతల నుండి తప్పుకుంటూ కార్పొరేట్, ప్రైవేట్ రంగాల ప్రాధాన్యతను పెంచాయి. విద్య, ఆరోగ్యం మొదలైన ప్రధాన రంగాలలో పెద్ద ఎత్తున ప్రైవేటీకరణ జరిగాయి. కార్పొరేట్ కంపెనీలు ప్రధానంగా లాభ దృష్టితోనే ఉంటూ, ప్రతిదాన్ని మార్కెట్ మాయాజాలంతో ఆస్తులను పెంచుకుంటున్నాయి. గౌతమ్ అదాని, అంబానీ తదితర గుత్త పెట్టుబడిదారుల ఆస్తుల పెరుగుదల ప్రభుత్వాల కార్పొరేట్ విధానాలకు నిదర్శనం. ప్రస్తుతం నరేంద్ర మోదీ ప్రకటించిన 'వికసిత్ భారత్', రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించిన 'స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047' కార్పొరేట్ విధానాలను పెంచటానికే దోహదపడతాయి. రాజ్యాంగ ఆశయమైన 'సంక్షేమ రాజ్యం' ఆచరణలో పలుచబడిపోయింది.

### బలహీన పడుతున్న ప్రజాస్వామ్యం

భారత రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టింది. లోక్‌సభ, శాసనసభలకు ఐదేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతూ, సాధారణ ప్రజలు పోటీ చేసే అవకాశం కల్పించింది. 1950 నుంచి 1980 వరకు జరిగిన ఎన్నికలలో మేధావులు, రాజకీయ నిబద్ధత కలిగినవారు, వివిధ సంఘాల నాయకులు చట్టసభలకు ఎన్నికై నిజాయితీగా పనిచేశారు. మన రాష్ట్రంలో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, వావిలాల గోపాలకృష్ణ, గౌతు లచ్చన్న వంటి నిబద్ధత కలిగిన నాయకులు శాసనసభకు ఎన్నికయ్యారు. కాని 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తరువాత రాజకీయాలు కార్పొరేటీకరణ చెందాయి. మూడు దశాబ్దాలుగా రాజకీయ రంగంలో కార్పొరేట్ రాజకీయవేత్తలు పెత్తనం చేస్తున్నారు. వ్యాపారం-రాజకీయాలు కలిసి ప్రయాణం చేస్తున్నాయి. లోక్‌సభకు పోటీ చేయాలంటే రూ.100 కోట్లు, శాసనసభకు పోటీ చేయాలంటే రూ.30 కోట్లు ఖర్చు చేయాలని కొన్ని రాజకీయ పార్టీలు నిర్దేశిస్తున్నాయి. అటువంటి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి. సాధారణ పౌరులు, సామాజిక కార్యకర్తలు పోటీ చేసే అవకాశం లేకపోయింది. విద్యావంతులు, నీతిమంతులు, ప్రావీణ్యత, అర్హత గలవారు చట్టసభల్లో రోజురోజుకు తగ్గిపోతున్నారు. ప్రవేశపెట్టిన బిల్లులు ఎటువంటి చర్చ లేకుండానే ఆమోదం పొందుతున్నాయి. రాజకీయ పార్టీలు విడుదల చేసే ఎన్నికల ప్రణాళికలకు విలువ లేకుండా పోయింది. ఈ పరిస్థితులలో క్రమక్రమంగా ప్రజలకు ప్రజాస్వామ్యంపై నమ్మకం సడలుతున్నది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలు బలహీనపడటానికి దారితీస్తున్నాయి.

### పౌరహక్కుల అణచివేత

రాజ్యాంగం 3వ భాగంలో పౌరులకు 12 నుంచి 35 వరకు

గల నిబంధనలు ప్రాథమిక హక్కులు, పౌరహక్కులు కల్పించాయి. వాటికి న్యాయస్థానాల ద్వారా రక్షణ కల్పించింది. 19(1) ఆర్టికల్ ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు 'భావ ప్రకటనా స్వేచ్ఛ' పునాది అని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రజలు స్వతంత్రంగా పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలు కలిగి ఉండటానికి అవకాశం కల్పించింది.

కాని గత దశాబ్ద కాలంలో పౌరహక్కులు, భావప్రకటనా స్వేచ్ఛలు అణచివేతకు గురవుతున్నాయి. భిన్నమైన అభిప్రాయాలు కలిగిన కళాకారులను, సాహితీవేత్తలను, సామాజిక కార్యకర్తలను, విద్యార్థులను రాజద్రోహం ఆరోపణలపైన, 'ఉపా చట్టం ద్వారా నేర పూరిత కేసులను పెట్టి సంవత్సరాలు తరబడి జైళ్లలో నిర్భందిస్తున్నారు. కల్బుర్గి, గౌరీ లంకేష్, గోవింద్ పన్సారే, మొదలైనవారు హత్యకు గురయ్యారు. భిన్నాభిప్రాయాలు కలిగిన ప్రసార మాధ్యమాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. న్యూస్ క్లిక్ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్థను అరెస్టు చేసి అనేక నెలలపాటు జైలులో ఉంచారు. ప్రొఫెసర్ సాయిబాబాను చిత్ర హింసలకు గురిచేశారు.

వీటితోపాటు రాజ్యాంగ వ్యవస్థలను నియంత్రణ చేస్తున్నారు. ఎన్నికల కమిషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వంటి సంస్థలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ కనుసన్నలలో పనిచేస్తున్నాయి. సీబీఐ, ఈడీ వంటి సంస్థలపై పూర్తి రాజకీయ కక్ష సాధింపు కోసం వినియోగిస్తున్నాయి. న్యాయవ్యవస్థ ఎన్నో ఒత్తిళ్లతో పనిచేస్తున్నది. కొలీజియం ద్వారా చేస్తున్న నియామకాలలో పారదర్శకత లేదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులను ప్రభావితం చేసే ప్రక్రియ కొనసాగుతున్నది. న్యాయ వ్యవస్థ స్వతంత్రత కూడా ప్రశ్నార్థకంగా మారింది.

### ఫెడరలిజంపై దాడి

భారత రాజ్యాంగం ఫెడరలిజం ఆధారంగా పనిచేస్తున్నది. కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా ఫెడరలిజం రాజ్యాంగ మౌలిక లక్షణంగా పేర్కొంది. రాజ్యాంగం ఏడవ భాగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలుగా అధికార విభజన జరిగింది. గత దశాబ్ద కాలంలో భారత ఫెడరల్ విధానాన్ని దెబ్బ తీయటానికి రాష్ట్రాల హక్కులు, అధికారాలపై అనేక దాడులు జరుగుతున్నాయి. ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన "జమిలి ఎన్నికలు" బిల్లులు ఫెడరల్ వ్యవస్థపై దాడిలో భాగమే. గతంలో కేంద్రం చేసిన వ్యవసాయ చట్టాలు, జి.ఎస్.టి. చట్టాలు, నూతన జాతీయ విద్యా విధానం-2020 మొదలైనవన్నీ ఫెడరలిజానికి పూర్తి విరుద్ధం. జీఎస్టీ వల్ల రాష్ట్రాలు దాదాపు రూ.3 లక్షల కోట్లు నష్టపోయాయి. కేరళ, తమిళనాడు మొదలగు రాష్ట్రాలలో గవర్నర్లు పనిచేస్తున్న తీరు ఫెడరల్ సూత్రాలకు విరుద్ధం. ఇటీవల యూజీసీ ముసాయిదాలో వైస్-ఛాన్సలర్ల నియమాలపై చేసిన ప్రతిపాదనలు విద్యారంగంపై కేంద్రం ఆధిపత్యం పెంచటానికే. ప్రాంతీయ పార్టీలను తన దారిలోకి తెచ్చుకోటానికే. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు సమాఖ్య విధాన స్ఫూర్తిని దెబ్బ తీస్తున్నాయి. భారత రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన విధంగా భారతదేశం ఫెడరల్ రాజ్యంగా కొనసాగాలంటే పౌరసమాజం నుండి కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

### ప్రమాదంలో లౌకిక విధానం

భిన్న మతాల సమాహారమైన భారతదేశం లౌకిక రాజ్యంగా కొనసాగాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. కేశవానంద భారతి, ఎస్.ఆర్. బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులలో సుప్రీంకోర్టు స్పష్టంగా లౌకిక విధానం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని చెప్పింది. ఇటీవల సుప్రీంకోర్టు 'లౌకిక, సామ్యవాద' భావనలు రాజ్యాంగ పీఠికలో ఉండటం సరైనదేనని తీర్పులో స్పష్టంగా చెప్పింది.

'లౌకిక విధానం అంటే ప్రజలు మత స్వేచ్ఛ కలిగి ఉండాలి. ప్రభుత్వం తన స్వంత మతాన్ని కలిగి ఉండకూడదు. ప్రభుత్వ విధానాలు ఒక మతపు ఆలోచనలతో ప్రభావితం కారాదు' అని లౌకిక విధానం తెలుపుతున్నది. కాని గత దశాబ్ద కాలంగా దేశంలో మతతత్వ ధోరణులు విపరీతంగా పెరిగాయి. మైనారిటీలు, దళితులపైన ముఖ్యంగా గోరక్షక దళాల పేరుతో దాడులు జరుగుతున్నాయి. పౌరసత్వ సవరణ చట్టం, జమ్ము కాశ్మీర్‌కు గల 370వ ఆర్టికల్ రద్దు చేయటం, ప్రార్థనా స్థలంలో చేస్తున్న కార్యకలాపాలు మొదలగు వాటి ద్వారా ప్రజల మధ్య మత విభజన చేయటానికి ప్రయత్నాలు జరిగాయి. ఏమి తినాలి, ఏమి కట్టుకోవాలి, ఏమి మాట్లాడాలి, ఏ విధంగా ప్రవర్తించాలి, ఎవరిని ప్రేమించాలి, ఎవరిని వివాహం చేసుకోవాలి, ఎంతమంది పిల్లలను కనాలి లాంటి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అన్నింటిని శాసిస్తూ, బహుళత్వంతో కూడిన మన సంస్కృతిని నాశనం చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ పరిణామాలన్నీ భారతదేశ లౌకిక విధానాన్ని, బహుళత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. 75 ఏళ్ల భారత రాజ్యాంగ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుకోవటానికి, సంక్షేమాన్ని, ప్రాథమిక హక్కులు, ఫెడరలిజం, లౌకిక విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వతంత్ర న్యాయ వ్యవస్థలను కాపాడుకోవటానికి ప్రతినపూనవలసిన అవసరమున్నది. ఈ సవాళ్లను అధిగమించి రాజ్యాంగ లక్ష్యాలను సాధించటానికి కృషి జరగాలి. ❑

# మహా కుంభమేళాలో హిందూ రాష్ట్ర రాజ్యాంగం

- సంజయ్ పాండే

**'హిందూ రాష్ట్ర రాజ్యాంగం' కింద సనాతన ధర్మ అనుయాయులకు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంటుంది. 'రాజ్యాంగం' 'హిందూ' న్యాయ వ్యవస్థను అమలు చేయడానికి వీలు కల్పిస్తుంది.**

'అఖండ హిందూ రాష్ట్రం' యొక్క 'రాజ్యాంగం' 'సిద్ధంగా' ఉంది. ఫిబ్రవరి 3న ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో 'బసంత్ పంచమి' సందర్భంగా ప్రజలకు నివేదన చేయబడుతుంది. ప్రతి పౌరుడికి సైనిక సేవను తప్పనిసరి చేస్తూ 'ఏకసభ్య' శాసనసభను 'రాజ్యాంగం' అందిస్తుంది. వ్యవసాయ ఆదాయాన్ని 'రాజ్యాంగం'లో పూర్తిగా పన్ను నుండి మినహాయించారు. సనాతన ధర్మ అనుచరులకు మాత్రమే 'హిందూ రాష్ట్ర' యొక్క 'రాజ్యాంగం' కింద ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉంటుంది మరియు భారత ఉపఖండంలోని మతాల అనుచరులు-జైన మతం, సిక్కు మతం, బౌద్ధమతం-మాత్రమే ఎన్నికలలో ఓటు వేయడానికి అనుమతి ఉంటుంది. 'ధర్మ సంసద్'(పార్లమెంట్) సభ్యులకు నియోజకవర్గ భత్యం, సాధారణ భద్రత మరియు వాహనం మాత్రమే లభిస్తాయి. 'ధర్మ సంసద్ అభ్యర్థులు వేద గురుకుల (పాఠశాల) విద్యార్థి అయి ఉండాలి' అని 'రాజ్యాంగం'ను రూపొందించిన కమిటీతో సంబంధం ఉన్న సాధువులలో ఒకరు అన్నారు. 'హిందూ రాష్ట్ర' యొక్క 'రాజ్యాంగం'లో వెనకకు పిలిచే హక్కు' కూడా ఉంది. దీనికోసం ధర్మ సంసద్ నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తుంది. నియోజకవర్గం నుండి కనీసం 50 వేల మంది సంతకం చేసిన ప్రతిపాదనను వారి ప్రతినిధిని తిరిగి పిలిపించడం కోసం పంపితే 'రాజ్యాంగం' 'హిందూ' న్యాయ వ్యవస్థను అమలు చేయడానికి వీలు కల్పిస్తుంది. 'ప్రతి ఒక్కరికీ త్వరిత న్యాయం హామీ ఇవ్వబడుతుంది. శిక్ష వ్యక్తిని సంస్కరించే లక్ష్యంతో ఉంటుంది. తప్పుడు ఆరోపణలు చేసే వారికి శిక్ష విధించబడుతుంది' అని ఆ సాధువు అన్నారు. దేశంలో ప్రాచీన వేద గురుకుల విద్యా విధానాన్ని అనుసరిస్తారు మరియు అన్ని ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను గురుకులాలుగా మారుస్తారు. 'రాష్ట్ర ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న అన్ని మదర్సాలు (ఇస్లామిక్ పాఠశాలలు) మూసివేయబడతాయి' అని ఆయన జోడించారు. 'రాజ్యాంగం' ఏకపత్నీ వ్రతత్వాన్ని అమలుచేస్తుంది. కుల వ్యవస్థను రద్దు చేస్తుంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. 'హిందూ రాష్ట్రం' ఏర్పాటుకు సహాయం చేయాలని ప్రపంచంలోని ఇతర దేశాలకు సాధువులు విజ్ఞప్తి చేస్తారని శాంభవి పీఠాధీశ్వర్ ఆనంద్ స్వరూప్ అన్నారు. 'క్రైస్తవులు, ముస్లింలు మరియు యూదుల దేశాలు ఉన్నాయి. కానీ హిందువుల దేశం లేదు' అని ఆయన అన్నారు. ఈ 'రాజ్యాంగం' మరే ఇతర మతానికి వ్యతిరేకం కాదని, అన్ని మతాల ప్రజలు దేశంలో స్వేచ్ఛగా జీవించగలరని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులచే 'హిందూ రాష్ట్ర' యొక్క 'రాజ్యాంగం' రూపొందించబడిందని అన్నారు. 501 పేజీల 'రాజ్యాంగం' నాలుగు పీఠాల శంకరాచార్యుల ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపబడుతుంది. 'రామ రాజ్యం, మను స్మృతి మరియు చాణక్యుడి అర్థశాస్త్రం' నుండి స్వీకరించబడిన సూత్రాలపై 'రాజ్యాంగం' ఆధారపడి ఉంటుంది. ❑





# శ్రమజీవుల 'ప్రజా రిపబ్లిక్' ఉద్యమం



- డి.వి.వి.ఎస్.వర్మ

1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దేశం రిపబ్లిక్‌గా అవతరించింది. నాటి నుండి ప్రభుత్వ పరంగా రిపబ్లిక్ దినోత్సవాలు జరుగుతున్నాయి. అవి ప్రభుత్వ శాఖలు, సంస్థలకే పరిమితమై, ప్రజల భాగస్వామ్యం లేకుండా సాగిపోతున్నాయి. రాజ్యాంగం మనందరిదీ. మనకు మనమే సమర్పించుకున్న రాజ్యాంగం. ఈ రాజ్యాంగానికి మనమే యజమానులం. దేశంలో అత్యధిక సంఖ్యాకులు శ్రమజీవులు. పరిశ్రమలలో కార్మికులుగా, అసంఘటిత రంగ శ్రామికులుగా, వృత్తి సంఘాల సభ్యులుగా, వ్యవసాయకూలీలుగా, కౌలు రైతులుగా, స్వయంగా సాగు చేస్తున్న రైతులుగా పలు రంగాల్లో వున్నారు. అలాగే వివిధ రంగాల్లో సమాజానికి సేవలు అందిస్తున్న వారు వున్నారు. దేశ సంపద ఉత్పత్తిలో ఈ శ్రమజీవులే కీలకపాత్ర పోషిస్తున్నారు. దేశంలో అన్ని రంగాలకు శిరోధార్యంగా వున్న రాజ్యాంగ కార్యకలాపాల్లో ప్రజల భాగస్వామ్యం వుండితీరాలి. అలాంటి భాగస్వామ్యాన్ని మనకు మనమే కల్పించుకోవాలి. ప్రజా రిపబ్లిక్ దినోత్సవం మనకోసం మనమే నిర్వహించు కోవాలి.

ఆర్థిక రంగంలో సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న సకల రంగాల శ్రమజీవులు రాజకీయ రంగంలో కేవలం ఓటర్లు గానే మిగిలి పోకూడదు.రాజ్యాంగం మీద రాజకీయంగా జరుగుతున్న దాడిని రాజకీయంగా ప్రతిఘటించడానికి సిద్ధపడాలి. కేంద్రంలో అధికారంలో వున్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి, దానిని మార్చడానికి అడుగులు వేస్తున్నది. మోదీ ఎలాంటి దాపరికం లేకుండా తనకు తాను హిందూ జాతీయ వాదినని ప్రకటించుకున్నారు. మెజారిటీ జాతీయవాదానికి వీలుగా పౌరసత్వ చట్టాలను తెచ్చారు. మత విద్వేష రాజకీయాలు చేస్తున్నారు.

బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ బహిరంగం గానే రాజ్యాంగాన్ని సవాలు చేస్తున్నది. హిందూ రాష్ట్ర నినాదం త్వరలోనే సాకారం కానున్నదని ప్రకటించింది. భారత రాజ్యాంగం పట్ల ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ఆమోదించినప్పుడే వారు వ్యతిరేకించారు. ఇది అతుకుల బొంత రాజ్యాంగం అన్నారు. దీనిలో జాతీయత లేదన్నారు. అంతటితో సరిపెట్టుకోలేదు. ప్రపంచ ప్రశంసలు పొందిన మనుధర్మ శాస్త్రమే దేశానికి తగిన రాజ్యాంగం అని ప్రకటించారు. ఇప్పుడు జరుగుతున్నది



రాజ్యాంగానికి, ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదానికి మధ్య సంఘర్షణ. రాజ్యాంగాన్ని మట్టు పెట్టాలనే ఈ సంఘర్షణలో శ్రమజీవులు పాత్రధారులు కావాలి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దేశాన్ని మత రాజ్యంగా మారుస్తుంది. మత రాజ్యాలలో రాజ్యాంగాలు వుండవు. మత గ్రంధాలే రాజ్యాంగం పాత్ర నిర్వహిస్తాయి. హిందూ రాష్ట్రంలో మనుధర్మ శాస్త్రం రాజ్యాంగం అవుతుంది.

శ్రమజీవులు పని విభజన అర్హతను బట్టి కాకుండా కులాలను బట్టి నిర్ణయమౌతుంది. హిందూ రాష్ట్రంలో శ్రమజీవులు శాశ్వతంగా కట్టు బానిసలౌతారు. కుల విభజన శ్రమజీవుల ఐక్యతకు భంగం కలిగిస్తుంది. మత రాజ్యాలలో ప్రజాస్వామ్యం వుండదు. పౌర హక్కులు వాటికి చట్టబద్ధత వుండదు. శిక్షలు తప్పును బట్టి కాకుండా కులాల ఆధారంగా వుంటాయి. మత రాజ్యాలలో ఓటు హక్కు, ఎన్నికలు వుండవు. నియంతలే వుంటారు. ప్రస్తుతం ఓటు హక్కు వున్నందునే వివిధ పథకాలు పేరుతో రాజకీయం శ్రమజీవులను పట్టించుకోక తప్పడం లేదు. ప్రభుత్వాలను మార్చే శక్తి మన ఓటులో వుంది. మత రాజ్యాల లో వివక్ష వుంటుంది. మైనారిటీ మతస్థులు సమాన హక్కుల లేని రెండవ తరగతి పౌరులౌతారు. మహిళలు, దళితులు, బహుజనుల పట్ల వివక్ష కొనసాగుతుంది.

అందువల్ల శ్రమజీవులు సమైక్యంగా రాజ్యాంగ రక్షణకు పూనుకోవాలి. హిందూ రాష్ట్ర నినాదాన్ని రాజకీయంగా ఎదుర్కొనాలి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దాడి నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ఎంత అవసరమో రాజ్యాంగ ఫలాలను దక్కించుకోడానికి తగిన విధంగా దానిని అమలు చేయించడానికి ఉద్యమించడమూ అంతే అవసరం. ఈ ఉద్యమానికి కూడా ప్రజా రిపబ్లిక్ దినోత్సవం వేదిక కావాలి.

రాజ్యాంగం పీఠిక ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలని ప్రకటించింది. కాని సామాజిక రంగంలో కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష, మైనారిటీల పట్ల వివక్ష నేటికీ కొనసాగుతున్నది. అమానుషమైన దాడులు, అత్యాచారాలు, హత్యాకాండ సాగిపోతున్నది. వివక్ష వున్నచోట సమానత్వం వుండదు. ప్రజాస్వామ్య విలువలు వుండవు. సమాన అవకాశాలు వుండవు. శ్రమజీవులు వివక్షకు తావులేని ప్రజా రిపబ్లికన్ను సాధించుకోవాలి. రాజ్యాంగం అందరికీ ఆర్థిక న్యాయం జరగాలని ప్రకటించింది. దీనికి సమాజంలో అంతరాలు తగ్గాలి. అందరికీ అవకాశాలు లభించాలి. కాని గత 10 సంవత్సరాలలో అంతరాలు విపరీతంగా పెరిగాయి.

ఒక శాతం మంది కార్పొరేట్లు, బిలియనీర్ల దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. 10 శాతం మంది దగ్గర 78 శాతం దేశ సంపద గుట్ట పడింది. ఈ కార్పొరేట్లకే కేంద్ర ప్రభుత్వం 20 లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు, రుణమాఫీలు ఇచ్చింది. 60 శాతంగా వున్న సామాన్యులు, పేదల దగ్గర కేవలం 5 శాతం సంపద మాత్రమే వుంది. అత్యధిక ఆర్థిక అంతరాలున్న దేశాల్లో మన దేశం అగ్రస్థానం లో వుంది . దేశ ప్రజలకు ఆర్థిక న్యాయం అన్నది అర్థరహితంగా మారింది. సకల తరగతుల శ్రామికులు కేవలం నెల జీతగాళ్ళు, రోజు వారీ కూలీలు మాత్రమే కాదు. వీరే సరుకులను, సంపదను, సేవలను సృష్టిస్తున్నారు. ఈ సంపదలో తగిన వాటా వారికి దక్కడం లేదు.

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దేశ సంపద, సహజ వనరులు ప్రజలందరికీ చెందాలి. దీనికి విరుద్ధంగా మోదీ ప్రభుత్వం అడవులను, గనులను, సముద్ర తీరాలను తన కార్పొరేట్ మిత్రులకు ధారాదత్తం చేసింది.వాటినుండి కోట్లాది సంపదను ప్రయివేటు వ్యక్తులు సొంతం చేసుకుంటున్నారు.

మరో ఆదేశిక సూత్రం ప్రకారం సంపద కొద్ది మంది దగ్గర పోగుపడకూడదు. కాని పోగుపడింది. దానిని వికేంద్రీకరించాలి. ఈ సంపదలలో తగిన వాటా శ్రమజీవులకు దక్కాలి. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. కార్పొరేట్ పన్ను పెంచడం, వారసత్వ పన్ను, సంపద పన్ను విధించడం ద్వారా దాదాపు 20 లక్షల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ అదనపు నిధులతో జాతీయ సంక్షేమ నిధిని ఏర్పాటు చెయ్యాలి. ఈ సొమ్ముతో శ్రమ జీవులందరికీ హక్కుగా నివాసం, ఆహార భద్రత, విద్య-వైద్య సదుపాయాలు, కనీస మౌలిక ఆదాయం కల్పించాలి. ఈ నిధుల నుండి రైతుల పంటలకు లాభసాటి ధరలు, నిరుద్యోగానికి శాశ్వత పరిష్కా రాలు సాధించాలి. ఆదేశిక సూత్రాలలో కార్మికులకు పరిశ్రమల యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించాలని సూచిస్తే దానికి విరుద్ధంగా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్ లను ఈ ప్రభుత్వం తెచ్చింది.

కార్మికులకు హేతుబద్ధమైన పని గంటలు వుండాలని ఆదేశిక సూత్రాలు ఘోషిస్తుంటే ఈ ప్రభుత్వం 12-16 గంటల పని దినానికి జెండా ఊపింది. ఈ తరహా రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన ప్రతి చర్యను శ్రమజీవులు ప్రతిఘటించాలి. ప్రజా రిపబ్లిక్ అన్నది శ్రమజీవుల రాజకీయ నినాదం. బీజేపీ, ఆర్‌ఎస్ ఎస్‌ల రాజకీయాలను, భావజాలాలను ఓడించడం ఒక లక్ష్యం. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపద పునఃపంపిణీ ద్వారా శ్రమజీవులందరికీ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనాన్ని సాధించడం మరో లక్ష్యం.

దోపిడీ, వివక్షలు లేని సమాజాన్ని సాకారం చేసుకునే అంతిమ లక్ష్యానికి సాగిపోవాలి. పలు రంగాలలో చీలిపోయిన శ్రమజీవులు, వివక్ష తరగతుల సమూహాలు ఒక్కటైతే అది ప్రజా ఉద్యమం అవుతుంది, ఉప్పెనగా మారుతుంది. అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది. ❑

# తెలుగు రాష్ట్రాలలో కుర్చీలాట



- సురవరం సుధాకరరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో మూడు పార్టీల కూటమిలో ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడుతున్నట్లు కనపడుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో బయటకు కనపడని అసంతృప్తి ముఖ్యంగా టీడీపీలో ఒక అంతర్లీన భయం కనపడుతోంది. అసాధారణమైన మెజారిటి సంపాదించిన కూటమిలో ఇంత త్వరగా ఈ సమస్యలు రావటం విచిత్రంగా ఉంది. జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్, బీజేపీ దత్త కుమారుడిగా చెలామణి అవుతున్నాడు. పత్రికా ప్రకటనలు, ఉపన్యాసాలు 'సనాతన ధర్మం' తరపున ఘాటైన దాడులు, ఉప ముఖ్యమంత్రిగా ప్రచార ఆర్భాటంతో కూడిన విధాన ప్రకటనలు, పార్టీ బలోపేతం చేసుకునేందుకు రిక్రూట్‌మెంటు కార్యక్రమాలు, టీడీపీ శాసనసభ్యులకు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. టీడీపీలో స్థానం దక్కని వారు జనసేన వైపు చూస్తున్నారు. బీజేపీ తన పార్టీని బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. తమతో జతగట్టిన ప్రాంతీయ పార్టీలను మింగెయ్యటం బీజేపీ వారికి అలవాటే. పంజాబ్‌లో అకాలీదళ్, హర్యానాలో దేవీలాల్ కుటుంబ పార్టీలు, తమిళనాడులో ఆల్ ఇండియా అన్నాడిఎంకె అలా విధ్వంసం అవుతున్న ప్రాంతీయ పార్టీలే. మహారాష్ట్రలో శివసేనను, నేషనలిస్ట్ కాంగ్రెసులను చీల్చి, చీలిన శివసేనకు తాత్కాలికంగా ముఖ్యమంత్రి పదవి ఇచ్చి, ఇప్పుడు మళ్లీ తామే అధికారంలోకి వచ్చారు. పుదుచ్చేరిలో రంగసామి కాంగ్రెసును నామమాత్రం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబును దాదాపు రెండు నెలలు జైలులో పెట్టి, టీడీపీ నాయకులను ఇబ్బందులు పెట్టడంతో, చంద్రబాబు దిక్కు తోచక పవన్‌కల్యాణ్ ఒత్తిడి మీద బీజేపీ నాయకత్వాన ఉన్న ఎన్.డి.ఎలో చేరాడు. చంద్రబాబు, నితీశ్‌కుమార్‌లా రాజకీయ అవకాశవాది. కాని ఆయన బీజేపీని నమ్మడు. బీజేపీ ఆయనను నమ్మదు. బీజేపీలో చేరడం అంటే కొండ చిలువ నోట్లో తలపెట్టడమేనని ఆయనకు తెలుసు.

బూర్జువా రాజకీయాలలో ఆత్మహత్యలు తప్ప హత్యలుండవని సామెత వుంది. జగన్ స్వయంకృతాపరాధంతోనే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏర్పడి అధికారాన్ని కైవసం చేసుకుంది. నలభై శాతం ఓట్లు వచ్చిన పార్టీ పదకొండు సీట్లే గెలిచినందున ప్రస్తుతం ప్రకటనలకే పరిమితం. ఈ నేపథ్యంలో 'లోకేశ్'ను ఉప ముఖ్యమంత్రిగా చేయాలని టీడీపీ మంత్రులు, ఎంఎల్ఎల ప్రకటనతో జనసేన–టీడీపీ రాజకీయ చదరంగం ప్రారంభమైంది. పవన్‌కల్యాణ్ తదుపరి ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్నాడన్న భయంతోనే టీడీపీ నాయకులు లోకేశ్‌ను ఉపముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్‌కు సమ ఉజ్జీగా నిలపెడదామని వారి ప్రయత్నం. ఇది జనసేనకు ఆగ్రహం కలిగిస్తున్నది. పవన్‌కల్యాణ్‌కు ఇంకా రాజకీయ పరిపక్వత వచ్చినట్లు లేదు. ఆయన సినిమా గ్లామర్ నిదానంగా తగ్గుతుంది. వీరాభిమానులు మిగులుతారు. కుల సమీకరణ ఆయనకు ప్రమాదకరం. ఇతర కులాల వ్యతిరేకత ముంచుతుంది. సందట్లో సదేమియాగా బీజేపీ జనసేనను కలిపేసుకొని, చంద్రబాబుకు చెక్ పెట్టవచ్చు. ఈలోగా వామపక్షాలు పెరిగిన విద్యుత్‌చార్జీల మీద పోరాటం ప్రారంభించడం మంచి పరిణామం. శాసనసభలో సీట్లు లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటాలు వామపక్షాల విశ్వసనీయతను నిలబెడుతాయి.

తెలంగాణ : తెలంగాణలో మూడు ప్రధాన రాజకీయ పార్టీల మధ్య యుద్ధం జరుగుతున్నది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు రాజకీయ పోరాటం చేస్తున్నా బీఆర్ఎస్ నుంచి మరికొన్ని ఫిరాయింపుల మీద ప్రధాన కేంద్రీకరణ పెట్టింది. ఫిరాయించిన పది మంది శాసనసభ్యులకు చట్టబద్ధత కల్పించాలంటే మరికొన్ని ఫిరాయింపులు అవసరం. బీజేపీ బీఆర్ఎస్‌ను రాష్ట్రంలో బలహీనపరిస్తే, తాము ప్రధాన ప్రతిపక్షంగా, తర్వాత అధికార పార్టీగా మారవచ్చని ఆ పార్టీపైనే విమర్శలు, దాడులు ఎక్కుపెడుతోంది. బీఆర్ఎస్ రెండు పార్టీల దాడిని తట్టుకుంటూ ఆత్మరక్షణలో పడింది. అడపా దడపా బీజేపీ మీద విమర్శలు పెడుతున్నా కాంగ్రెస్ మీదే ప్రధాన పోరాటం చేస్తున్నది.

పార్లమెంటు ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయి ఒక్క సీటు పొందలేకపోయినా కాంగ్రెస్ ఎన్నికల వాగ్ధానాలు నిలబెట్టుకోలేదని ఎదురుదాడి చేస్తోంది. రైతు భరోసా రెండు లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శలే కాక రైతుల ధర్నాలు, ఆందోళనలు సాగిస్తున్నది. కె.సి.ఆర్ ఇప్పటికీ నిశ్శబ్దాన్ని పాటిస్తూ కె.టి.ఆర్, హరీశ్‌రావులను రంగంలోకి వదిలిపెట్టాడు. కె.సి.ఆర్ నిశ్శబ్దత దిక్కుతోచక ఉన్నాడా, లేక వ్యూహాత్మక నిశ్శబ్దం పాటిస్తున్నాడా అర్థంకాక బీఆర్ఎస్ శ్రేణులు గందరగోళంలో ఉన్నా, ఇద్దరు రెండవ స్థాయి నాయకులు, కెటిఆర్, హరీశ్‌రావు ఎదురుదాడితో తమ శాసనసభ్యులను,

**(మిగతా 22వ పేజీలో)**

# జన దృక్పథంతో రాసిన చరిత్ర



- ఆర్వీ రామారావ్



ఇర్ఫాన్ హబీబ్

ఇర్ఫాన్ హబీబ్ దేశంలోని అగ్రశ్రేణి చరిత్రకారుల్లో ఒకరు. ఆయన అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో చాలా కాలం అధ్యాపకుడిగా ఉన్నారు. దాదాపు 30 ఏళ్ల కాలంలో ఆయన దేశంలోనూ, విదేశాల్లోనూ వివిధ సమావేశాల్లో సమర్పించిన పత్రాలను సంకలితం చేసి 'ఎ స్పేస్ ఇన్ ఇండియన్ హిస్టరీ: టువర్డ్స్ ఎ మార్క్సిస్ట్ పెర్సెప్షన్'. మార్క్సిస్టు దృక్పథాన్ని అనుసరించి చరిత్రను శోధించిన కొద్దిమందిలో ఇర్ఫాన్ హబీజ్ ప్రసిద్ధులు. భారతదేశ చరిత్రను మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించడమే ఆయన పనిగా పెట్టుకున్నాడు. మరో రకంగా చెప్పాలంటే ప్రజల దృష్టితో చరిత్రను చూడడానికి, దాన్ని నమోదు చేయడానికి ఆయన దశాబ్దాలుగా కృషి చేస్తూనే ఉన్నారు. ఆయన గ్రంథాన్ని చదవడానికి, వాస్తవాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి ఉన్న వారికి ఆయన ఏ దృష్టితో చరిత్రను చూశారన్నది ప్రధానం కాదు. కాకూడదు. ఆయన వింగడింపు సవ్యంగా ఉందా ? లేదా ? తర్కబద్ధంగా ఉందా ? లేదా ? అన్న అంశం మీదే పాఠకుల ఆసక్తి ఉండాలి. చరిత్ర అంటే బ్రిటిష్ వారు మన మీద రుద్దినది మాత్రమే. కాదు. రాజులు, రాణులు వారి ప్రేమ పురాణాలు మాత్రమే చరిత్ర కాదు. రాజులు పరిపాలిస్తారన్న మాట నిజమే కానీ అసలైన చరిత్ర నిర్మాతలు జనమే. ఆ నిర్మాణ క్రమాన్ని వివరించడానికి ఇర్ఫాన్ హబీజ్ నిరంతరం పాటు పడుతున్నారు.

చరిత్ర గమనంలో భౌతిక పరిస్థితులను, వర్గాలను, భావనలను వర్గ పోరాటాలను అర్థం చేసుకుంటే తప్ప ఒక జాతి చరిత్ర నిజస్వరూపం అంతుపట్టదు. కార్ల్ మార్క్స్ చేసిన పని ఇదే. తాను మార్క్సిస్టు దృక్కోణంతో చరిత్రను అధ్యయనం చేయడానికి ప్రయత్నించానే తప్ప ఆ పని మార్క్స్ చేసినంత పకడ్బందీగా చేసే తాహతు తనకు లేదని ఇర్ఫీన్ హబీజ్ చెప్పడం ఆయన వినయానికి నిదర్శనం.

చరిత్ర రచనలో అనేక ధోరణులున్నాయి. చరిత్రకారులు ధరించే కళ్లజోళ్లను బట్టి వారు చెప్పే చరిత్ర ఆధారపడి ఉంటుంది. ఈ గ్రంథం ఆయన దశాబ్దాల కింద రాసిన వ్యాసాల సంకలనం. చరిత్రను పరిశీలించేటప్పుడు చరిత్రకారుడి మదిలో ఎలాంటి ప్రశ్నలు తలెత్తుతాయి, వాటికి వచ్చే సమాధానాలు ఎలాంటివి అన్న అంశాన్ని బట్టి చరిత్ర రచన ఆధారపడి ఉంటుంది. ఇంతకు ముందు ఇర్ఫాన్ హబీబ్ 'అగ్రేరియన్ సిస్టం ఆఫ్ మొగల్ ఇండియా' 'అన్ అట్లాస్ ఆఫ్ ది మొగల్ ఎంపైర్," 'ఫ్రీ హిస్టరీ' లాంటి గ్రంథాలు అందించారు. చరిత్ర రచనకు కావాల్సిన పాండిత్యం ఆయనకు ఉంది. ఆయన నిబద్ధతగల చరిత్రకారుడు, సోషలిస్ట్ ఇండియా అవతరించాలన్నది ఆయన కల. చరిత్ర రచనా క్రమంలో ఆయన లేవనెత్తే ప్రశ్నలు మనలను అబ్బురపరుస్తాయి. భారత చరిత్ర నిర్మాణంలో రైతులు. నిర్వర్తించిన పాత్రను తవ్వి తీయడానికి ఆయన చేసిన ప్రయత్నం ప్రశ్నార్హమైంది. వర్గ పోరాటాల రీతులను ఆయన వెతికి పట్టుకున్నారు. మొగల్ పరిపాలనలో ఆర్థికాభివృద్ధి దశ ఏమిటో వివరించడానికి ఆయన ప్రయత్నించారు.

ఈ గ్రంథంలో ఉన్న అన్ని వ్యాసాలూ ఆయన లోతులకెళ్లి చరిత్ర ఆనవాళ్లను అన్వేషించి చరిత్ర సౌధాన్ని నిర్మించిన తీరు ఆశ్చర్యం కల్గిస్తుంది. మార్క్స్ మన దేశాన్ని చూసిన తీరును కూడా ఇర్ఫాన్ హబీబ్ ఎత్తి చూపారు. పీపుల్స్ హిస్టరీ ఆఫ్ ఇండియా సంపుటాలకు ఆయన సంపాదకుల్లో ఒకరిగా ఉన్నారు. 93 ఏళ్ల ఇర్ఫాన్ హబీబ్ నిరంతర అన్వేషి ఈ వయసులో కూడా ఆయన అధ్యయనం ఆపలేదు. చరిత్రను వక్రీకరిస్తున్న దశలో అసలు మన చరిత్రలో దాగిన కోణాలను అన్వేషించడానికి రొమిలా థాపర్, ఇర్ఫాన్ హబీబ్ లాంటి వారు చేసిన కృషి నిరుపమానమైంది.

# కృత్రిమ మేధస్సు - ఒక మార్క్సిస్టు విశ్లేషణ



- మర్ల విజయకుమార్

ఈనాడు ఎఐ ఒక క్రేజ్ అయిపోయింది. స్కూల్ పిల్లలకి కూడా ఎఐ గురించి పాఠాలు చెప్పే ట్రెండ్ మొదలయింది. అసలు ఈ ఎఐ అంటే ఏమిటి అనే దానికి ఎవరికి తోచిన నిర్వచనం వారు ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎఐ మానవులను త్రోసిరాజని ఈ ప్రపంచాన్ని ఏలుతుందని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వ విద్యాలయ సైంటిస్ట్ కుర్జ్వీల్ ప్రతిపాదించాడు. కంప్యూటర్ల గణన శక్తి ఉరుకులు పరుగుల మీద పెరుగుతూ, సైన్స్‌లోనే కాక, అన్ని మానవ కార్యకలాపాలలో స్వయం నిర్ణయాలు తీసుకుని మనకు సాధ్యం కాని గడ్డు సమస్యల్ని లిప్త పాటులో ఛేదించి మానవ మేధస్సును అది అతి త్వరలో అధిగమించబోతోందనీ, రాబోయే సమీప భవిష్యత్తులో ఎఐ తనను తాను పునర్ సృష్టించుకోగల సామర్థ్యాన్ని పొంది ఊహించనలవి గాని విజ్ఞాన సంపదను కైవసం చేసుకుంటుందని, ఇక అప్పుడు మానవులతో పనిలేదని ఎఐ నిర్ణయించుకుంటే, ఇక అది మానవజాతిని నిర్మూలించినా ఆశ్చర్యపడనవసరం లేదని రే కుర్జ్వీల్ ప్రతిపాదించాడు. ఇందుకు ఆయన ఇచ్చిన పరిష్కారం ఏమిటంటే, మానవులు తమ మేధస్సును ఎఐలోకి కాపీ చేసుకుని భౌతికమైన ఉనికి లేకుండా డిజిటల్ రూపంలో అమరులు కావచ్చునని ఆయన చెపుతున్నాడు.

మనం ఇంకా కృత్రిమ మేధస్సు అభివృద్ధి శైశవ దశలోనే ఉన్నాం. పైగా ఈ కృత్రిమ మేధస్సు అనేది ఒక్కసారిగా ఆకాశం నుండి ఊడిపడలేదు. దీని వెనుక 70 ఏళ్ల కంప్యూటర్ టెక్నాలజీ అభివృద్ధిని ఆధారం చేసుకుని నేటి ఈ దశకు చేరుకున్నాము. ఇంకా చెప్పాలంటే మూడు వందల సంవత్సరాల పారిశ్రామిక విప్లవం ఈనాటి కంప్యూటర్ టెక్నాలజీకి పునాదిని వేసింది. యూరప్‌లో 17వ శతాబ్దంలో రూపుదిద్దుకున్న పారిశ్రామిక విప్లవాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు. తొలి దశలో ఆవిరి యంత్రాల వాడకంతో పరిశ్రమలు నడిపేవారు. ఈ తొలి దశ పూర్తి అయ్యే నాటికి అంటే 19వ శతాబ్దపు చివరి నాటికి ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో రైలు మార్గాల నిర్మాణం జరిగింది. సప్తసముద్రాలను దాటగలిగిన ఆవిరి సర్వసాధారణం అయ్యాయి. వేల సంఖ్యలో కార్మికులను వినియోగించి ప్రపంచ మార్కెట్లకు సరుకులు తయారు చేసి రవాణా చేయగల ఆర్థిక వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఈ దశ చివరిలో మోటారు వాహనాలు వాడుకలోకి వచ్చాయి. పదుల లక్షల జనాభాతో మహానగరాలు వెలిశాయి. అంతకుముందు చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ప్రపంచం రూపురేఖలు మారిపోయాయి.

20వ శతాబ్దం ఆరంభం అయ్యే నాటికి విద్యుత్ శక్తి యంత్రాలకు, ఇతర నాగరిక అవసరాలకు కీలకమయ్యింది. ముఖ్యంగా నగరాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. విద్యుత్ ఉత్పత్తి యంత్రాల వాడకంతో పరిశ్రమలు పూర్తిగా మారిపోయాయి. వేలాది మంది కార్మికులతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లకు సరుకులు ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగాయి. ఇది పారిశ్రామిక విప్లవం రెండవ దశ. బ్రహ్మాండమైన ఫేక్టరీలలో వస్తూత్పత్తికి సహాయకారిగా అనేక ఇతర ముఖ్య కార్యకలాపాలు రూపుదిద్దుకున్నాయి. ఉదాహరణకు ఏటా లక్షల కార్లను ఉత్పత్తి చేసే ఖార్ఖానాలలో ఉత్పత్తి చేసే కార్మికులకంటే స్టోర్ కీపర్లు, సరుకుల రవాణా కార్మికులు, అక్కౌంటెంట్లు, సూపర్‌వైజర్లు, పరిపాలనా సిబ్బంది పెరిగిపోయారు. దానితో ఉత్పత్తి ఖర్చులు పెరిగి లాభాలపైన ఒత్తిడి పెరిగింది. తూర్పు ఆసియా దేశాలయిన జపాన్, కొరియా దేశాలు వినూత్న పద్ధతులలో పోటీ బరిలోకి వచ్చి తక్కువ ధరలతో నాణ్యమైన ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, తదితర వస్తువులతో ప్రపంచ మార్కెట్లను ముంచెత్తుతోంటే పశ్చిమ దేశాల పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో పడిపోయాయి. పులి మీద పుట్రలాగా 70వ దశకంలో చమురు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. పోటీని తట్టుకొని నిలబడగలగటం కంపెనీలకి కష్టమైంది. లాభాలను నిలబెట్టుకోవాలంటే ఆటోమేటిక్ యంత్రాలను ప్రవేశపెట్టి, కార్మికులను తగ్గించి తద్వారా పోటీని తట్టుకోవచ్చునని అర్థమైంది. దీనితో ఉత్పత్తి ప్రక్రియలో మరొక విప్లవాత్మక మార్పు ప్రారంభం అయింది. సాధారణ ఉత్పత్తి యంత్రాలైన లేతులు, టర్నింగ్ మెషిన్స్ తదితరాల స్థానంలో కంప్యూటర్ చలిత డిజిటల్ యంత్రాలు (సి.ఎన్.సి యంత్రాలు) వాడుకలోకి వచ్చాయి. కంప్యూటర్ల అభివృద్ధితో ఇది సాధ్యపడింది. ఒక్కొక్క సి.ఎన్.సి మెషిన్ 30 సాధారణ యంత్రాల పనిని అదే టైములో చేయ గలదు. పైగా ఇప్పుడు నలుగురు కార్మికులు చాలు. దానితో ఉత్పత్తి ఖర్చులు తగ్గిపోయి, లాభాలలో కొంత ఊరట లభించింది. అంతటితో ఆగక, ఫ్యాక్టరీ పని విధానాన్ని సమూలంగా మార్చివేయటానికి పనిని మొత్తం కంప్యూటర్ మోడల్ చేసి పనిని ముడు విధాలుగా విభజించారు. మొదట కీలకమైన ఉత్పత్తి. అది ఫ్యాక్టరీ పరిధిలోనే జరుగుతుంది.

రెండవది ఎక్కువ శ్రమ, ఖర్చుతో కూడిన పని, ఈ పనిని ఫ్యాక్టరీలో కాకుండా బయట చిన్న కాంట్రాక్టర్లకు ఔట్‌సోర్సింగ్ చేసి ఖర్చులు తగ్గించుకోవటం.

మూడవది మొత్తం ఇంజనీరింగ్ ప్రక్రియను సమూలంగా మార్చివేసి విడిభాగాల వాడుకను తగ్గించుకోవటం. ఇదేకాక మొత్తం ఉత్పత్తి ప్రక్రియను కంప్యూటర్ మోడల్ చేయటంతో పనిని సమర్థవంతంగానూ, తక్కువ ఖర్చుతోనూ ఎక్కువ ఆటోమేటిక్ యంత్రాలతో పూర్తి చేయటానికి వీలుపడింది. ఇది పారిశ్రామిక విప్లవంలో ముడవదశ. ఈ దశలో ఔట్‌సోర్సింగ్ ఖండాంతరంగా వ్యాపించి ప్రపంచీకరణకు దారితీసింది. కంప్యూటర్స్, కమ్యూనికేషన్లలో వస్తున్న విప్లవాత్మకమైన అభివృద్ధి ఈ ఆటోమేషన్ ప్రక్రియకు వెన్నెముక అయింది.

పారిశ్రామిక విప్లవం మూడవ దశ ఇప్పుడు నడుస్తున్నది. పరిశ్రమల్లో, వ్యాపారాలలో, వస్తువుల వితరణలో, రవాణా రంగంలో ఆటోమేషన్ విరివిగా ఉపయోగించబడుతున్నది. దీని పర్యవసానంగా కార్మికుల సంఖ్య దారుణంగా పడిపోతున్నది. మనుష్యుల స్థానంలో రోబోలు వచ్చి చేరుతున్నాయి. మొత్తం ఉత్పత్తి ప్రక్రియ, వితరణ కంప్యూటర్ మోడలింగ్‌తో నియంత్రించబడుతున్నది. ఉదాహరణకు అమెజాన్ వంటి అంతర్జాతీయ వితరణ వ్యాపార దిగ్గజం కోట్లాది వివిధ సరుకులను తమ గొడౌన్లలో ఒక పద్ధతి ప్రకారం నిల్వచేసి, ఎప్పటికప్పుడు అవసరాన్ని బట్టి బయటకు తీయటం ఏ మానవ మాత్రునికి సాధ్యం కాని పని. ఈ స్టోర్స్ కార్యకలాపాలన్నీ ఆటోమేటిక్ రోబోట్లతోనే నిర్వహించటం సాధ్యమవుతుంది. రోబోట్లు, ఇతర ఆటోమేటిక్ యంత్రాలమధ్యన అనుసంధానం మానవులు చేయటం అసాధ్యమయ్యే దశకు మనం ఇప్పుడు చేరుకున్నాము. పైగా ఆటోమేటిక్ యంత్రాల పనివేగం మనుష్యుల కన్నా అనేక వేల రెట్లు ఎక్కువ కావటంతో యంత్రాల మధ్యన అనుసంధానం, వాటి నియంత్రణను కూడా స్వయం నిర్ణాయక రోబోట్లు నిర్వహించవలసిన పరిస్థితి నేడు మనకు ఎదురయింది. మనుష్యుల ప్రమేయం లేకుండా మొత్తం ఆర్థిక ప్రక్రియ నడపగలిగే స్థాయిని పారిశ్రామిక విప్లవం నాలుగవ దశగా పిలుస్తారు. ఇందుకు కృత్రిమ మేధస్సు ప్రధాన భూమిక నిర్వహిస్తోంది. అయితే మనం పారిశ్రామిక విప్లవ నాలుగవ దశలో ప్రవేశించే ఈ రోజున కృత్రిమ మేధస్సు గురించి అనేక ఊహాగానాలు, అతిశయోక్తులు ప్రచారంలో ఉన్నాయి. మనుష్యులను త్రోసిరాజని కృత్రిమ మేధస్సే ప్రపంచాన్ని శాశిస్తుందనేది ఒక బలమైన వాదన. ఈ వాదన పూర్వాపరాలు మనం ఇప్పుడు చర్చిద్దాము.

'శాస్త్ర విజ్ఞాన రంగాలలో అనేక రకాల ప్రతిపాదనలు చేయబడుతుంటాయి. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసినది ఏమిటంటే, శాస్త్రజ్ఞులు కూడా తమ కాలంలోని రాజకీయ దృక్పథానికి అతీతులు కారు. రే కుర్జ్‌వీల్ ఫక్తు పెట్టుబడిదారీ భావాలు కలవాడు. అతనికి మానవ సమాజ పరిణామం గురించిన అవగాహన ఏ కోశానా ఉన్నట్లు కనిపించదు. అసలు మానవుల ప్రమేయం లేకుండా, పెట్టుబడిదారులు వస్తువుల ఉత్పత్తిచేసి, అపార లాభాలను గడించవచ్చునని అనేకమంది మేధావుల వలెనే ఆయన కూడా వాదించాడు. కాని జనాభాలో అధికశాతంగా ఉన్న శ్రామికులు అనవసరమైతే, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందనే సాధారణ సత్యాన్ని వారు విస్మరించారు. ఇదే పద్ధతిలో పెట్టుబడిదారులు పరిశ్రమలను, పంపిణీ వ్యవస్థనూ యాంత్రీకరణ చేసుకుంటూ పోయి, అంతిమంగా మహా వినాశనానికి కారకులవుతారు. మరొక పక్కన లాభాల వేటలో పర్యావరణాన్ని నాశనం చేసి, పెను సంక్షోభాలకు తెర తీసి, అపార జననష్టానికి కారకులవుతారు. దాని పర్యవసానమే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలటం, పర్యావరణ వినాశనం. అయితే రే కుర్జ్‌వీల్ ఊహించినట్లుగా యంత్ర మేధస్సు బాగా అభివృద్ధి అవుతున్నది. కృత్రిమ మేధస్సు అనే పదం వాడుకలో ఉన్నా: దానిని యంత్ర మేధస్సుగానే వ్యవహరించాలి. మేధస్సులో కృత్రిమమైనది ఏదీలేదు. మానవ మేధస్సు అయినా, యాంత్రిక మేధస్సు అయినా, అది సమాజం పరిధిలో, మానవ సంబంధాల కారణంగా ఉత్పత్తి అయినదే. మానవ సమాజం, మానవ సంబంధాలు లేనిదే, మేధస్సు అనేది ఉండదు.

మానవుడు సమాజంలోని మానవ సంబంధాల సంకలనం అని మార్క్స్ ఎప్పుడో చెప్పారు. సరిగ్గా ఈ విషయంపై అవగాహన లేకనే, ఈ బూర్జువా మేధావులు ఇటువంటి అర్థం పర్థం లేని ప్రతిపాదనలను ముందుకు తెస్తున్నారు. మనిషి యొక్క జ్ఞాపకాలన్నీ సామాజిక సంబంధాల ద్వారా ఏర్పడినవే. రాబిన్ సన్ క్రూసో కథలో వలే, ఒక దీవిపై ఒంటరిగా జీవించే మానవునికి మేధస్సుతోనూ, జ్ఞాపకాలతోనూ పనిలేదు. అతనికి, జంతువులకీ ఏ విధమైన తేడా ఉండదు. ఒక మనిషి యొక్క మేధస్సును కంప్యూటర్‌లోకి కాపీ చేయాలంటే, అతని జ్ఞాపకాలన్నిటినీ కాపీ చేయాల్సి ఉన్నది. పైగా తన జీవిత కాలంలో అప్పటి వరకూ అతనికి ఉన్న సామాజిక సంబంధాలన్నిటినీ కూడా కాపీ చేయవలసి ఉంది. అంటే, అతనితోపాటుగా, అతను తన జీవిత కాలంలో ఎంత మందితో ఏదో ఒక విధమైన సంపర్కాన్ని కలిగి ఉన్నా, అవన్ని కూడా కాపీ చేయాలి. ఎందుకంటే మన జ్ఞాపకాలన్నీ సామాజిక పరంగా ఏర్పడినవే. తోటి వారితో సంబంధం లేని జ్ఞాపకాలు ఉండవు. ఉదాహరణకు, మనకు బాల్యంలోని జ్ఞాపకాలు, మన అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లతోను ముడిపడి ఉంటాయి. నేను చిన్ననాటి ఒక జ్ఞాపకాన్ని గుర్తు చేసుకోగానే, నా చెల్లెలు ఆ

సందర్భంలోనే మరొక జ్ఞాపకాన్ని గుర్తు చేస్తుంది. ఈ విధంగా జ్ఞాపకాల వెల్లువ ఏర్పడుతుంది. ఆ కారణం చేత, జ్ఞాపకాలనేవి ఏ ఒకరికీ వ్యక్తిగత విషయం కాదు. పైగా తన జీవిత కాలంలో అతను చదవటం, వినటం, చూడటం ద్వారానూ, ప్రసార మాధ్యమాల ద్వారా ఎంత సమాచారాన్ని గ్రహించాడో, అంత సమాచారాన్నీ కాపీ చేయవలసి ఉంది. ఈ విధంగా మొత్తం మానవ జాతి మేధస్సులను కాపీ చేయాలంటే, ఈ మహా విశ్వం గురించిన మొత్తం సమాచారాన్ని కాపీ చెయ్యాలి. బెకెన్ స్టీన్ అనే శాస్త్రవేత్త చెప్పినట్లు, ఈ మొత్తం విశ్వం యొక్క సమాచారం క్రోడీకరించాలంటే, ఈ మొత్తం విశ్వంలో ఉన్న శక్తి అంతా ఖర్చు అవుతుంది. అందుచేత, ఇది సాధ్యం అయ్యే పని కాదు.

అలాగే యంత్ర మేధస్సు ఏ స్థాయికి ఎదిగినా, అది మానవ మేధస్సుకు సరితూగలేదు. మానవుడు అతి సహజంగా చేయగలిగిన కార్యకారణ సంబంధాన్ని, అతి తక్కువ వ్యవధిలో ఎప్పుడో జరిగిన వివిధ ఘటనలను గుర్తుచేసుకుని, వాటిని వర్తమాన సమాచారంతో అనుసంధానం చెయ్యగలగటం అనే ప్రక్రియ ఒక్క మానవ మేధస్సుకే సాధ్యం. అది ఎన్నటికీ యంత్ర మేధస్సుకు సాధ్యపడదు.

తార్కిక ఆలోచనలు, అవతలి వారి వాదనను గ్రహించి, తన మనసులో అప్పటికే ఏర్పడిన దృక్కోణం నుండి పరిశీలించి, సమాధానం ఇవ్వటం ఒక్క మానవులకే సాధ్యమయ్యే లక్షణం. ఆ కారణం చేత, మానవునికి వ్యతిరేకంగా, మానవుని అధీనంలో లేని యాంత్రిక మేధస్సు తనంత తానుగా మనలేదు. ఉదాహరణకు, ఒక ఆరు నెలల పసి పాప కళ్ళలోని మెరుపును ఏ యాంత్రిక మేధస్సూ పునర్ సృష్టించలేదు. ఆ కళ్ళలోని మెరుపు మానవులకే సొంతం. పైగా అది సమాజంలోని మానవ సంబంధాలలో నుండి ఉత్పత్తి అయినది. అట్లానే ఒక పసి పాపను చూసినప్పుడు, ఆమెను ఎత్తుకున్నప్పుడు, ప్రతీ మానవునిలో అనేక హావభావాలు కలుగుతాయి. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క విధంగా స్పందిస్తాడు.

ఉదాహరణకు ఒక వయసు మళ్ళిన వ్యక్తికి, ఆ పసి పాపను చూడగానే తన బిడ్డల చిన్నప్పటి జ్ఞాపకాలు మనసులో మెదలుతాయి. వయసులో ఉన్న స్త్రీకి ఆ పాపపట్ల మాతృ వాత్సల్యం పొంగుతుంది. ఈ విధంగా పసిబిడ్డను చూడగానే మానవులలో కలిగే సున్నితమైన, అందమైన భావాలవెల్లువ ఏ యాంత్రిక మేధస్సుకూ అందనిది, అతీతమైనది కూడా. ❑

# తెలుగు రాష్ట్రాలలో కుర్చీలాట

**(21వ పేజీ తరువాయి)**

క్యాడర్‌ను నిలబెట్టుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు తప్పుడు డిజైన్‌లపైన, రేసింగ్ కార్ల విషయంలో జరిగిన అవినీతి సమస్యలపైన విచారణలు, కేసులు పెట్టడం ద్వారా బీఆర్ఎస్‌ను భయభ్రాంతులకు లోను చేయడానికి కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. కేటీఆర్ అరెస్టయితే బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. కాళేశ్వరం కేసు హరీశ్‌రావు మెడకు చుట్టుకోవచ్చు. కేటీఆర్ విమర్శలు ఉక్రోషంతో చేస్తున్నట్లు కనపడితే, హరీశ్ విమర్శలు కొంత మేరకు రాజకీయంగా వుంటున్నట్టు కనపడుతోంది. శాసనసభ్యుల్లో కౌశిక్‌రెడ్డి దూకుడుగా వున్నాడు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వినోద్‌కుమార్ తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ఎంఎల్ఏలు మరికొంత మంది ఫిరాయింపులకు సిద్ధంగా వున్నా, స్థానికంగా వారి చేతిలో ఓడిపోయిన కాంగ్రెసు నేతలు, కార్యకర్తలు అభ్యంతరం పెడుతున్నారు. మరిన్ని ఫిరాయింపులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బలం చేకూరుస్తుంది. కాంగ్రెసులో ఇప్పటికే చేరిన దానం నాగేందర్, మహిపాల్‌రెడ్డి రెండు గుఱ్ఱాల మీద స్వారీ చేస్తున్నట్లు కనపడుతోంది. మహిపాల్‌రెడ్డి కార్యాలయం మీద ఒరిజినల్ కాంగ్రెసు వారు దాడి చేయడంతో కొత్తగా చేరే వారు ఆందోళనతో వుంటారు.

**విదేశీ పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రుల వేట**

స్విట్జర్లాండులోని దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశీ పెట్టుబడుల కోసం, యావచ్ఛక్తితో ప్రయత్నం చేశారు. తెలంగాణకు లక్షా దబ్బయి ఎనిమిది వేల కోట్ల పెట్టుబడి వస్తే, ఏపీకి ఏమీ రాలేదంటున్నారు. అమెరికా, యూరోప్‌లో పారిశ్రామిక కార్మికులు, నిపుణత్వం ఉన్న కార్మికుల వేతనాలు ఎక్కువ. ట్రక్కు డ్రైవర్ల వేతనాలు డాక్టర్ల వేతనాల కంటే ఎక్కువ. మన దేశంలో వేతనాలు చాలా చవుక. ఉచితంగా వందల కోట్ల విలువైన భూములిచ్చి, విద్యుత్ సప్లయి చేసి, రోడ్లు వేసి, నీరిచ్చి, చవక లేబర్ ఇస్తే వారు పెట్టుబడులు పెట్టి, పదింతలు లాభం సంపాదించుకొని పోతున్నారు. కేంద్రం కక్ష వైఖరి వల్ల రాష్ట్రాలకు పెట్టుబడి లేక విదేశీ పెట్టుబడులకు వెళ్లమంటున్నారు. హైదరాబాదులో ఉన్న కార్పొరేట్ హాస్పటల్స్ మెజారిటీ విదేశీయుల చేతుల్లో ఉన్నాయి. ఆక్స్‌ఫామ్ అంచనా ప్రకారం అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి గంటకు మూడు కోట్ల డాలర్లు విదేశాలకు పోతున్నాయి. ఈ అంశం పునరాలోచించాలి. ❑

# భవిష్యత్తరాల కోసం కలత చెందిన దార్శనికులు



- డాక్టర్ దేవరాజు మహారాజు

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌గా ప్రసిద్ధుడయిన భీం రావ్ రాంజీ అంబేద్కర్, మన భారత రాజ్యాంగ రూపశిల్పి. తొలి కేంద్ర న్యాయ శాఖ మంత్రి, ఆర్థిక వేత్త, సంఘ సంస్కర్త. ముఖ్యంగా అంటరానితనం, కుల నిర్మూలన కోసం సంఘర్షించిన రాజకీయవేత్త. దేశంలో నవయాన బౌద్ధానికి దారులు వేసిన ఆధునిక నవబౌద్ధుడు. కాలం గడుస్తున్న కొద్దీ ప్రజలు అంబేద్కర్‌ని బాగా అర్థం చేసు కుంటున్నారు. దళితులు బహుజనులు మాత్రమే కాదు, అన్ని వర్గాల వారు, అన్ని మతాల వారూ అంబేద్కర్ చూపిన మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

## అంబేద్కర్ కన్నీళ్లు

అయితే 1956 మార్చి 18న ఆగ్రా నగరంలో ఒక సంఘటన జరిగింది. అక్కడ ఆ రోజు డా.బి.ఆర్. అంబేద్కర్ (1891 ఏప్రిల్ 14 - 1956 డిసెంబర్ 6) తన అనుచరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గుర్తై, ఉన్న ఫళాన కంట తడిపెట్టారు. 'ఏమిటీ? ఏమైందని?' అని అనుచరులు కంగారు పడి అడిగినప్పుడు ఆయన కొన్ని విషయాలు చెప్పారు. అవి ఇలా ఉన్నాయి. తన జాతి వాసుల్ని తను ఎలా చూడాలనుకున్నారు ? వాళ్లు ఎలా తయారయ్యారు ? అన్న విషయం బేరీజు వేసి చూపారు. తనవాళ్లను ఉద్దేశించి ఇలా అన్నారు.

'నేనేమో మిమ్మల్ని రాజులను చేయాలనుకున్నాను. మీరేమో లాభసాటి నౌకర్లలా మిగిలిపోవాలని అనుకుంటున్నారు. నేనేమో మిమ్మల్ని రత్నాలుగా చూడాలనుకున్నాను. మీరేమో మట్టి పెళ్లలుగా మిగిలిపోవాలని అనుకుంటున్నారు. నేనేమో మీరు సంఘటిత శక్తిగా ఎదగాలనుకున్నాను. మీరేమో ఎవరికి వారు వ్యక్తులుగా ఎదగాలని అనుకుంటున్నారు. నేనేమో రాజ్యాంగమనే ఆయుధంతో గౌతమబుద్ధుడు, జ్యోతీరావుపూలే మొదలు పెట్టిన యుద్ధం గెలవాలని అనుకున్నాను. మీరేమో రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తూ నిద్రపోవాలని అనుకుంటున్నారు. నేనేమో పూర్వీకుల చరిత్ర చదివి, ఆచరించి, పీడిత తాడిత మూల వాసుల తరఫున మీరంతా నిలబడాలని అనుకున్నాను. మీరేమో మన పూర్వీకుల చరిత్రే చదవకూడదని అనుకుంటున్నారు. నేనేమో వచ్చిన స్వాతంత్ర్యం నుంచి వేరే ఇంకో స్వతంత్రం కోరుకోవడం లేదు. వెట్టిచాకిరి, బానిసత్వం, కులం, మతం, దోపిడీ, దౌర్జన్యం - సంకెళ్ల నుంచి మిమ్మల్ని విముక్తుల్ని చేయాలని అనుకున్నాను. మీరేమో ముందు చూపు లేకుండా, రాబోయే పెనుముప్పును చూసుకోకుండా కండ్లు మూసుకుని కాలక్షేపం చేయాలని అనుకుంటున్నారు. స్పృహ లేని ఉద్యోగాల కోసం, స్ఫూర్తి లేని రాజకీయ నాయకుల కోసం, సంఘటితం కాని సంస్కర్తల కోసమేనా నా ఈ కన్నీళ్లు ? మీరంతా నా అనుచరులు గనుక, నా జాతి వాసుల కోసం, నా దేశ ప్రజల కోసం నేను పడుతున్న ఆవేదనను మీరు సరిగా అర్థం చేసుకుంటారని భావిస్తాను. నా కన్నీళ్లు వృథా పోవనీ, వాటి విలువను మీరు వారికి తెలియజెబుతూ ఉంటారని ఆశిస్తాను !' అని అన్నారు అంబేద్కర్. భవిష్యత్తరాల అభ్యున్నతి కోసం డా. బి.ఆర్. అంబేద్కర్ పడిన ఆవేదన వృథా కాకూడదు. మనం మనముందు తరాల్ని చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం - ఒక బాధ్యతగా స్వీకరించాలి!

## అబ్రహాం లింకన్ లేఖ

నేటి బాల బాలికలే రేపటి పౌరులు గనక, వారి విద్యాభ్యాసం ఎలా జరగాలి? వారు ఉన్నతమైన ఆశయాలతో ఎలా పెరగాలి? - అన్న విషయం అబ్రహం లింకన్ (12 ఫిబ్రవరి 1809-15 ఏప్రిల్ 1865) ఒక ఉత్తరంలో నమోదు చేశారు. అమెరికాకు పదహారవ అధ్యక్షుడయిన లింకన్, తన చిన్న కుమారుడైన ట్లాడ్ లింకన్‌కు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడికి ఒక లేఖ రాశారు. అందులో అనేక విషయాలున్నాయి. ఇది కేవలం తన కుమారుడి కోసం రాసిందే అయినా, ఆయన దృష్టిలో ప్రపంచ యువత ఎలా ఎదగాలి - అన్న విషయం చర్చించారు. ఆ ఉత్తరం ఇలా సాగుతుంది - ప్రతి ఉపాధ్యాయుడూ ఈ ఉత్తరం తనకు వచ్చినట్టుగానే భావించుకోవాలి !

### గౌరవనీయ ఉపాధ్యాయుడా !

ఈ భూమి మీది మనుషులందరూ న్యాయమైన వాళ్లు కాదు, నిజమైన వాళ్లూ కాదు. ఈ విషయాలు మా అబ్బాయి కచ్చితంగా తెలుసుకోవాలి ! మీరు మా వాడికి ఇవి నేర్పించాలి! ప్రతి ఉత్తముడికి ఒక నీచుడున్నాడు. ప్రతి స్వార్థ రాజకీయ నాయకుడికీ అంకిత భావంతో పని చేసే ఒక నాయకుడున్నాడు. ప్రతి శత్రువుకీ మనకు ఒక మిత్రుడున్నాడు. లేని దాని గురించి దిగులు పడే గుణాన్ని మా వాడిలోంచి పారద్రోలండి. వీలయితే నిశ్శబ్దంగా నవ్వుకోగల రహస్యాన్ని వాడి గుప్పిట్లో పెట్టండి. తనకు కొన్ని విషయాలు చిన్నతనంలోనే తెలియాలి. అల్లరి చిల్లర కబుర్లు ఆసక్తి కలిగిస్తాయి. కానీ, వాడికి పుస్తకాల మత్తు,

మహత్తు ఏమిటన్నది అర్థం చేయించండి! అలాగే ఆకాశంలోని పక్షులు, తేనెటీగలు, పచ్చటి కొండల అనంత రహస్యాలను అన్వేషించడానికి వీలయినంత ఎక్కువ సమయం కేటాయించాలని చెప్పండి.

మోసం చేయడంకంటే, ఫెయిల్ కావడమే గౌరవప్రదమైన అంశమని, పాఠశాలలో పిల్లలకు మీరు తప్పక బోధించాలి. ఇతరులు తప్పు పడుతున్నారని కాకుండా తన ఆలోచనలపై తనకు ధృఢమైనా విశ్వాసం ఉంచుకోవడం మంచిదని చెప్పండి. మర్యాదస్తులతో మర్యాదగా, మొండివాళ్లతో మొండిగా మసలు కోవాలన్నది నేర్పించండి! వీలయితే మా అబ్బాయికి ఈ జ్ఞానాన్ని పంచండి - అందరూ వెళుతున్నారు కాబట్టి, మనమూ ఆ దారిలోనే పరిగెత్తుదామన్న గొర్రెదాటు పద్ధతిని అనుసరించకుండా - నిగ్రహించుకునేట్లు చేయండి ! ఎవరేది చెప్పినా, వినగలిగే ఓపికను మా కుర్రవాడిలో పెంపొందించండి.

అయితే, సత్యాసత్యాల నిగ్గు తేల్చుకుని, అసలైన దాన్ని మాత్రమే స్వీకరించాలన్నది - నేర్పించండి !

మీకు సాధ్యమైతే ఈ కింది మెళకువలు కూడా నేర్పించండి.

దుఃఖంలో నవ్వాలని, కన్నీళ్లు వస్తే సిగ్గు పడాల్సింది ఏమీ లేదని, ప్రతి దానికీ రంధ్రాన్వేషణ చేసే వాడిని పరిహసించాలని - అలాగే ప్రతి చిన్న పనినీ పొగిడేవాడి గూర్చి జాగ్రత్తగా మసలుకోవాలన్నది బోధించండి!

తన కండను, మెదడును అత్యంత ఎక్కువ ధర చెల్లించే వాడికి అవసరమైతే అమ్ముకోవచ్చు. కానీ, తన మనసుకు, అంతరాత్మకూ ఎప్పుడూ ఎక్కడా, ఎన్నడూ వెల నిర్ణయించ కూడదనీ, ఆ పరిస్థితి అసలు తెచ్చుకొనే తెచ్చుకోగూడదనీ బాగా అర్థమయేట్టు చెప్పండి!' పనికి మాలిన అరుపులకు చెవి ఒగ్గు గూడదని, తను సత్యమని బలీయంగా నమ్మిన దాని కోసం ఎదురొడ్డి పోరాడాలనీ చెప్పండి!

మా అబ్బాయితో కాస్త సున్నితంగానే వ్యవహరించండి. కానీ, మరీ ముద్దు చేయకండి. ఎందుకంటే ఉక్కు ధృఢత్వం తెలిసేది అగ్ని పరీక్షకు గురైనప్పుడే కదా? ధైర్యంగా ఉండగలిగే సహనం తనకు కావాలి! అయితే, అవసరమైనప్పుడు తన అసహనాన్ని ప్రదర్శించే ధైర్యం కూడా తనకు ఉండాలి! ఎల్లవేళలా తన మీద తనకు అంచంచలమైన విశ్వాసం ఉండేలా తీర్చిదిద్దండి. అప్పుడే ఆ వయసు పిల్లలకు మానవ జాతి మీద ఎనలేని విశ్వాసం ఏర్పడుతుంది. ఇవన్నీ చిన్న కోరికలేమీ కావు - చాలా పెద్ద కోరికలే. కానీ, ప్రయత్నించి చూడండి. ముద్దులొలికే నా బంగారు తండ్రికోసం - ఇందులో మీరు ఏమేమి చేయగలరో ప్రయత్నించి చూడండి. మీ ప్రయత్నం సఫలమైతే, ఆ ఫలితం నా కుమారుడొక్కడికే కాదు - మొత్తం కొన్నితరాలకు అందించిన వారవుతారు. దయచేసి ఆలోచించండి- అబ్రహం లింకన్ బీ ఫాదర్ ఆఫ్ ట్యాడ్ లింకన్ (పేరెంట్)

**నెహ్రూ లేఖలు**

19 అక్టోబర్ 1952 షిల్లాంగ్-మేఘాలయలో జరిగిన పెద్ద బహిరంగసభలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఉపన్యాసం ఈ విధంగా సాగింది. దేశమంటే ఏమిటీ? అంకితభావంతో పనిచేసే దేశ నాయకులు చేయాల్సింది ఏమిటి ? అన్నది ఆయన చెప్పకనే చెప్పారు. 'దేశమంటే కొన్ని పర్వతాలు, కొన్ని నదులు, మైదానాలు, పొలాలూ మాత్రమే కాదు. పెద్దవీ చిన్నవీ అయిన నగరాలు, పట్టణాలు గ్రామాలు మాత్రమే కాదు. దేశమంటే ఇవన్నీ ఉంటాయి కానీ, దేశమంటే ఇవి మాత్రమే కాదు. దేశమంటే, దేశంలో నివసిస్తున్న ప్రజలు- అందువల్ల, నా భారతదేశంలో ఉన్న ప్రజలను నేను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. గతంలో ఉన్న ప్రజలను, ప్రస్తుతం ఉన్న ప్రజలను వారి జీవితాలను చాలా లోతుగా అధ్యయనం చేస్తూ వచ్చాను. దేశమంతా విస్తృతంగా పర్యటిస్తూ వచ్చాను. ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణపు అంచు కన్యాకుమారి దాకా - అలాగే పశ్చిమాన ఉన్న మన సరిహద్దుల నుండి ఇటు తూర్పున ఉన్న సముద్రతీరం దాకా లక్షలాది ప్రజలను కలిశాను. వారి కండ్లలోకి సూటిగా చూస్తూ వారి మనోభావాల్ని పసిగట్టాను. వారి ఆశలేమిటి ? ఆకాంక్షలేమిటీ ? తెలుసుకున్నాను. వారు చెప్పేదేమిటో విన్నాను. వారు చెప్పలేకపోయిందేమిటో కూడా అంచనా వేసుకున్నాను. మొత్తానికి మొత్తంగా, నా దేశ ప్రజల్ని కొంతలో కొంత అర్థం చేసుకోవడం ప్రారంభించాను. ఇది నాకు సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చే విషయం!' ఆనాటి పండిట్ నెహ్రూ ఉపన్యాసం పూర్తిపాఠం-జవహర్‌లాల్ నెహ్రూ - సెలెక్టెడ్ వర్క్స్-సెకెండ్ సీరిస్ - వాల్యూమ్ - 20బీ పేజి. నెం.3లో ఉంది.

'జవహర్‌లాల్ నెహ్రూ పట్ల పార్టీలో ఆరాధనా భావం పెరిగిపోతూ ఉంది. దీన్ని అరికట్టకపోతే ఆయన మరో సీజర్‌లా తయారయ్యే అవకాశం ఉంది - ఇది పార్టీ మనుగడకు ఎంత మాత్రం సరైంది కాదు' చాణక్య. నెహ్రూ అంటే గిట్టని వారెవరో ఇలా రాస్తున్నారని అందరూ అనుకునేవారు. ఇంతకూ ఎవరా చాణక్య - అని కొందరు ఆరా తీసేవారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే - చాణక్య ఎవరో కాదు. పండిట్ నెహ్రూయే! అది ఆయన కలం పేరు. ఆ రోజుల్లో కలకత్తా నుండి వెలువడే ఒక పత్రికలో పండిట్ నెహ్రూయే స్వయంగా 'చాణక్య' అనే పేరుతో విరివిగా రాస్తుండే వారు. ఈ కాలంలో అలాంటి నిజాయితీపరుల్ని చూడగలమా? ఆయన దార్శనికతను అర్థం చేసుకోలేని వారు మాత్రమే, ఆయనను తక్కువ చేసి మాట్లాడగలరు. వివేకవంతుడికి, మూర్ఖుడికీ పోలికలు ఉండవు కదా! ❑

# చరిత్రను ఆయుధంగా మారుస్తున్న హిందుత్వ

- ఆదిత్య ముఖర్జీ, మృదుల ముఖర్జీ

**మతోన్మాదాన్ని ఆయుధంగా వాడడానికి చరిత్రను తిరగరాసే, చరిత్ర బోధన, అధ్యయన పద్ధతులను మార్చే లక్ష్యాలతోనే ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల మార్పులు జరుగుతున్నాయంటున్నారు ఆదిత్య ముఖర్జీ, మృదులా ముఖర్జీ.**

కొవిడ్-19 కల్పించిన అంతరాయాల వల్ల విద్యా కార్యక్రమం దెబ్బ తిన్న విద్యార్థుల మీద చదువు భారం తగ్గించే అవసరం కొద్దీ తాము చేపట్టిన 'హేతుబద్ధీకరణ' కార్యక్రమంలో భాగంగానే తమ పాఠ్య పుస్తకాలలో ఇటీవల కొన్ని తొలగింపులు చేయవలసి వచ్చిందని ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ వివరించారు. ఇంతకన్న సత్యదూరమైన విషయం ఉండదు. చరిత్ర, సమాజ శాస్త్రం, రాజనీతి శాస్త్ర పాఠ్య పుస్తకాలలో తొలగించిన అంశాలను, అధికార పార్టీ సభ్యులు ఈ నేపథ్యంలో చేసిన రాజకీయ ప్రకటనలను, హిందూ మతోన్మాదులు చరిత్రను వక్రీకరించడానికి చేస్తున్న ప్రయత్నాల సుదీర్ఘ చరిత్రను విశ్లేషిస్తే, ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ మాటలు ఎంత సత్యదూరమో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రస్తుత ప్రయత్నం మతోన్మాదులు చారిత్రకంగా ప్రదర్శిస్తున్న కపటత్వపు ధోరణిలోనే ఉంది. తాము సాహసికంగా చేసిన పనులకు బాధ్యత వహించి, ప్రవాసం, జైలు నిర్బంధం, మరణశిక్ష వంటి పర్యవసానాలను కూడ ధైర్యంగా ఎదుర్కొన్న భగత్‌సింగ్, గాంధీ, తిలక్ వంటి అసంఖ్యాక యోధులకు భిన్నంగా, గాంధీ హత్యకు ఏ సంస్థా బాధ్యురాలు కాదని చెబుతారు. (ఆ హత్యకు బాధ్యులెవరో రాసిన భాగాలను ఎన్‌సీఈఆర్‌టీ పాఠాల నుంచి తొలగించారు).

బాబ్రీ మసీదును ధ్వంసం చేయడం అనే 'నేరపూరితమైన చర్య'కు ఎవరూ బాధ్యులు కారని సుప్రీంకోర్టు అన్నట్టుగా, గుజరాత్ మారణకాండకు ఎవరూ బాధ్యులు కారని చెబుతారు. (అందుకు సంబంధించిన భాగాలన్నిటినీ ఎన్‌సీఈఆర్‌టీ పాఠం నుంచి తొలగించారు).

## చరిత్ర వక్రీకరణల చారిత్రక విహంగావ లోకనం

మతోన్మాద కార్యక్రమం సాగించాలంటే మతోన్మాద భావజాల వ్యాప్తి కేంద్రస్థానంలో ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ తొలిరోజుల్లోనే గుర్తించింది. ఆ మతోన్మాద భావజాలానికి పునాదిగా చరిత్ర పట్ల ఒక ప్రత్యేక తరహా కథనం ఉంటుంది. అందువల్లనే మహాత్మా గాంధీ హత్య తర్వాత వారి మీద విధించిన నిషేధాన్ని వారు




కేవలం సాంస్కృతిక సంస్థగా మాత్రమే పనిచేస్తారనే, రాజకీయాలకు దూరంగా ఉంటారనే వాగ్దానం మీద ఆధారపడి ఎత్తివేసినప్పుడు, వారు ఇక మతోన్మాద భావజాలపు ప్రచారం అనే కర్తవ్యానికి మాత్రమే పూర్తిగా బద్ధులై ఉండాలని నిర్ణయించుకున్నారు.

1950ల తొలి రోజుల నుంచీ, వారు స్థాపించిన పాఠశాలల ద్వారా (మొట్టమొదటి సరస్వతీ శిశు మందిర్‌ను ఆర్‌ఎస్‌ఎస్ అధినేత ఎంఎస్ గోల్వాల్కర్ ప్రారంభించాడని గుర్తుంచుకోవాలి) పాఠ్య పుస్తకాల ద్వారా, వక్రీకరించిన, పూర్తిగా ఊహాపోహలతో కల్పించిన చరిత్ర కథనాన్ని ప్రచారం చేయడం ప్రారంభించారు. ఈ కథనం ఇతర మత సమూహాల ప్రజలను రాక్షసులుగా చూపుతుంది. ఉదాహరణకు, ఆర్‌ఎస్‌ఎస్ పాఠశాలల పాఠ్య పుస్తకాలు, ఆరో తరగతిలో ఉన్న తొమ్మిది సంవత్సరాల లేలేత మనసులకు ఇస్లాం గురించి ఏమి బోధిస్తాయో చూడండి:

'వాళ్లు వెళ్లిన చోటికల్లా చేతిలో కరవాలం పట్టుకుని వెళ్లారు. ఎదురైన ప్రతి దేశాన్నీ ధ్వంసం చేశారు. ప్రార్థనాలయాలనూ విశ్వ విద్యాలయాలనూ నేలమట్టం చేశారు. గ్రంథాలయాలను తగులబెట్టారు. మత గ్రంథాలను పాడు చేశారు. తల్లులనూ అక్కా చెల్లెళ్లనూ అవమానించారు. దయ, న్యాయం అనేవి వారికి తెలియవు.' 'ఢిల్లీలోని కుతుబ్‌మినార్ వాస్తవంగా సముద్రగుప్త చక్రవర్తి నిర్మించాడు. దాని అసలు పేరు విష్ణు స్తంభం. ఈ సుల్తాన్ (కుతుబుద్దీన్ ఐబక్) వాస్తవంగా దానిలోని కొన్ని భాగాలను పడగొట్టి, దాని పేరు మార్చాడు.' ఇటువంటి నిందలే క్రైస్తవులు, పార్సీలు, వగైరా ఎందరి మీదనో చేశారు. ముస్లింలలాగనే వాళ్లందరినీ 'పరాయివాళ్లు', 'విదేశీయులు' అని

నిర్వచించి, వాళ్లకు పూర్తి స్థాయి పౌరసత్వ హక్కుల అర్హత లేదని అన్నారు.

భారతదేశాన్ని పితృభూమిగానూ, పుణ్య భూమిగానూ గుర్తించే వారికి మాత్రమే భారతీయులుగా ఉండే అర్హత ఉంటుందని సావర్కర్ ఇచ్చిన నిర్వచనాన్ని వాడుకున్నారు. అది ఎంత అర్థ రహితమైన నిర్వచనమంటే యూరప్, అమెరికా, కొరియాలలో ఉన్న క్రైస్తవులకు, లేదా జపాన్‌లోని బౌద్ధులకు ఈ నిర్వచనాన్ని అన్వయిస్తే, వాళ్లు నివసించే దేశాలలో వాళ్ల పవిత్ర స్థలాలు లేవు గనుక వారందరూ ఆయా దేశాలలో విదేశీయులు అయిపోతారు! చరిత్ర వక్రీకరణకు ప్రభుత్వాధికార ఉపయోగం 1977-79 కాలక్రమంలో వేలాదిగా పెరిగిపోయిన ఆర్ఎస్ఎస్ పాఠశాలల్లో ఇటువంటి తరహా చరిత్ర పాఠాలను ప్రబోధిస్తుండడం సరిపోనట్టు, ఇటువంటి చరిత్రను ప్రభుత్వం నడిపే పాఠశాలల్లో, జాతీయ పాఠ్యాంశాలలోను ప్రవేశపెట్టడానికి, లౌకిక, శాస్త్రీయ చరిత్ర మీద దాడి చేయడానికి ఆర్ఎస్ఎస్‌కు ప్రభుత్వాధికారం చేజిక్కినప్పుడల్లా, ఆ ప్రభుత్వాధికారాన్ని ఉపయోగించుకుని ప్రయత్నించడం ఇంకా ప్రమాదకరం.

అటువంటి మొట్ట మొదటి దాడి 1977-79 మధ్య జనతా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ఆర్ఎస్ఎస్‌కు రాజకీయ/ఎన్నికల విభాగం అయిన జనసంఘ్, జనతా పార్టీలో విలీనమైనప్పుడు జరిగింది. మన మేధావులలో అత్యున్నతులూ, ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన వారూ అయిన రొమిల్లా థాపర్, బిపిన్ చంద్ర, సతీష్ చంద్ర, ఆర్ఎస్ శర్మ, అర్జున్ దేవ్ వంటి వారు రాసిన ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలను నిషేధించడానికి ప్రయత్నించారు. కాని ఆ సమయంలో దేశంలో ఎన్‌సీఈఆర్‌టీ ఇంకా చెప్పుకోదగినంత స్వయం ప్రతిపత్తితో పని చేస్తుండింది గనుక ఆ ప్రయత్నాన్ని దృఢంగా అడ్డుకున్నారు. ఈ ప్రయత్నాలను అడ్డుకోవడానికి మరో ముఖ్య కారణం దేశంలో ప్రతిపక్షాలు ప్రధానంగా వామపక్షాలు పార్లమెంటరీ రాజకీయాల్లో మెరుగైన ప్రాతినిధ్యాన్ని కలిగి ఉండటం కూడా.

ఎన్‌సీఈఆర్‌టీ లోపలి నుంచీ, దేశవ్యాప్తంగా పత్రికా రంగం నుంచీ, విశ్వవిద్యాలయాల నుంచీ నిరసన పెల్లుబికింది. పుస్తకాలు నిషేధానికి గురి కాకుండా మనుగడ సాగించాయి.

### 1999-2004 ఆ తర్వాత,

1999లో కేంద్ర ప్రభుత్వాధికారాన్ని ఎన్డీఏ చేపట్టిన తర్వాత, ఆర్ఎస్ఎస్ రాజకీయ అంగంగా జనసంఘ్ స్థానంలో భారతీయ జనతా పార్టీ సారథ్య స్థానంలోకి వచ్చింది. గత అనుభవం నుంచి పాఠాలు నేర్చుకున్న భారతీయ జనతా పార్టీ మొదట పాఠ్యాంశాల నిర్ణాయక కమిటీల నుంచి కీలక వ్యక్తులను తొలగించింది. ఎన్‌సీఈఆర్‌టీ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఐసిఎస్ఎస్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రిసర్చ్), ఐసిఎచ్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసర్చ్) వంటి సంస్థలలో అత్యున్నత పాలనాధికార స్థానాలలో తమ మాట వినే వాళ్లను నియమించారు. శాస్త్రీయ చరిత్రకారుల మీద మూకుమ్మడి దాడి ప్రారంభించడానికి ముందు ఈ పనులన్నీ చేశారు. ఆర్ఎస్ శర్మ, రొమిల్లా థాపర్, బిపన్ చంద్ర, సతీష్ చంద్ర వగైరాలు రాసిన ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి కొన్ని భాగాలను కొన్ని సామాజిక తరగతుల, మతానుయాయుల మనోభావాలు గాయపడుతున్నాయనే కారణంతో తొలగించారు.

అంతకు ముందు ఆర్ఎస్ఎస్ ప్రచురించిన 'ది ఎనెమీస్ ఆఫ్ ఇండియనైజేషన్ : ది చిల్డ్రన్ ఆఫ్ మార్క్స్, మెకాలే అండ్ మదరసా' అనే పుస్తకంలో తొలగించవలసిన 41 భాగాలను గుర్తించారనేది గమనార్హం. కొత్తగా నియమితులైన ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ జెఎస్ రాజపుత్ రాసిన వ్యాసం ఆ పుస్తకంలో ఉంది. దేశంలోని వృత్తిపరమైన చరిత్రకారుల ప్రాతినిధ్య సంస్థ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్, భారత రాష్ట్రపతి కేఆర్ నారాయణతో సహా ఈ చరిత్రకారులను సమర్థించిన లౌకిక మేధావులను 'దేశద్రోహులు' అని నిందించారు. ఆర్ఎస్ఎస్ అధినేత కెఎస్ సుదర్శన్ అయితే వారిని 'హిందూ వ్యతిరేక యూరో-ఇండియన్స్' అని అభివర్ణించాడు.

చరిత్ర పట్ల హిందుత్వ వైఖరితో (హిందూ మతోన్మాదంతో) అంగీకరించని వారందరినీ బెదిరించే ధోరణి నానాటికీ ప్రమాదకరంగా పెరిగింది. భారత జాతీయవాదానికి పరిరక్షకుల మని తమకు తాము చెప్పుకుంటున్న కొంత మంది విద్యా శాఖ మంత్రి మురళీ మనోహర్ జోషి ఇంటికి చేరి, రొమిల్లా థాపర్, ఆర్ఎస్ శర్మ, అర్జున్‌దేవ్ వంటి చరిత్రకారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేయడమే ఆ ధోరణికి నిదర్శనం. ఆ ఫాసిస్టు ధోరణి అగ్నిలో ఆజ్యం పోసినట్టు మంత్రి ఈ మేధావులు రాసిన చరిత్రను 'మేధో తీవ్రవాదం' అని వ్యాఖ్యానించాడు. అది 'సీమాంతర ఉగ్రవాదం కన్న ఎక్కువ ప్రమాదకరమైనదని, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాల'ని అన్నాడు. చివరికి, ఈ 'మేధో తీవ్రవాదులు' అనబడేవాళ్లు రాసిన ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను తొలగించి, కొత్త పుస్తకాలను ప్రవేశపెట్టారు.

ఈ కొత్త పుస్తకాల నాణ్యత ఎంత అన్యాయంగా ఉన్నదంటే, ఈ పుస్తకాల్లో మన పిల్లలకు వండి వార్చిన మతోన్మాద దురభిప్రాయాలు ఎంత ఘోరంగా ఉన్నాయంటే, 2003లో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 'హిస్టరీ ఇన్ ది న్యూ ఎన్‌సీఈఆర్‌టీ టెక్స్ట్ బుక్స్ : ఎ రిపోర్ట్ అండ్ యాన్ ఇండెక్స్ ఆఫ్ ఎర్రర్స్' ('కొత్త ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలలో చరిత్ర : ఒక నివేదిక, ఒక తప్పుల సూచిక') అనే పుస్తకం ప్రచురించక తప్పలేదు.

ఆ నివేదిక ముగింపులో ఇలా రాసి ఉంది. 'చాలా తరచుగా ఈ తప్పులు అజ్ఞానపు ఫలితాలు మాత్రమేననిపిస్తుంది. కాని

అంతే తరచుగా అవి చరిత్రను బలమైన దురహంకార, మతోన్మాద దురభిప్రాయాలతో సమర్పించే ఉత్సాహం నుంచి పుట్టాయనిపిస్తుంది. సంఘ పరివార్ ప్రచురణలనబడేవి చాలా కాలంగా ముందుకు తెస్తున్న ప్రచారం నుంచి ఈ పుస్తకాలు చాల ఎక్కువగా సంగ్రహించాయి'.

హిందూ మతోన్మాద శక్తులు కేంద్ర ప్రభుత్వాధికారాన్ని పోగొట్టుకున్న 2004 నుంచి ఒక దశాబ్దంపాటు ఈ మతోన్మాద దాడికి కాస్త విరామం దొరికింది. వాళ్లు రాసిన పుస్తకాలను ఉపసంహరించారు. దేశవ్యాప్తంగా మేధావులను కలుపుకుని ఒక బృందాన్ని తయారు చేసి, వారిచే కొత్త పుస్తకాలు రాయించి ప్రవేశపెట్టారు. ఈ బృందాన్ని పూర్తిగా మేధస్సునూ కృషినీ దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేశారు. కాని వారు రాజకీయంగా వంది మాగధులవునా కాదా అని కాదు. అది ఒక ఆహ్వానించ దగిన చర్యే అయినప్పటికీ, ఆర్ఎస్ఎస్ పాఠశాలల్లోనూ, మత మైనారిటీలు నిర్వహిస్తున్న పాఠశాలల్లోనూ చరిత్రకు దుర్మార్గమైన, మతోన్మాద పూరితమైన వ్యాఖ్యానాల ప్రచారం ద్వారా సమాజంలో వేగవంతంగా సాగిపోతున్న మతోన్మాదాన్ని యుద్ధ ప్రాతిపదిక మీద ఎదుర్కోవడానికి ఈ అవకాశాన్ని వాడుకోవడంలో లౌకిక శక్తులు దురదృష్టకరంగా విఫలమయ్యాయి.

## 2021-23

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ మళ్లీ 2014లోనూ, 2019లోనూ కేంద్ర ప్రభుత్వ అధికారానికి రావడంతో, ఆర్ఎస్ఎస్, బీజేపీ కూటమికి భారత గత చరిత్రను తమ సొంత ఊహల ప్రకారం తిరగరాయడం అనే ఇష్టమైన వ్యావృత్తికి కొత్త అవకాశాలు దొరికాయి. అమలులో ఉన్న ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలలో నుంచి ప్రధాన భాగాలను తొలగిస్తున్నారనే వార్తలు తరచుగా రావడం మొదలైంది. 2001లో జరిగినట్టుగానే, ఎన్సీఈఆర్టీ పుస్తకాలలోంచి తొలగింపులు అంతకుముందు ఆర్ఎస్ఎస్ ప్రచురణలో కోరినట్టుగానే జరగడం మొదలైంది.

భారతీయ జనతా పార్టీకి చెందిన ఇ-ట్రెయినింగ్ సెల్ కన్వీనర్ నాయకత్వంలో నడిచే పబ్లిక్ పాలసీ రీసెర్చ్ సెంటర్ 2021 జూన్‌లో, అమలులో ఉన్న చరిత్ర పాఠ్య ప్రణాళికలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ ఒక నివేదిక వెలువరించింది. దీనితోపాటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త వినయ్ సహస్రబుద్ధే నాయకత్వంలోని ఒక పార్లమెంటరీ కమిటీ అటువంటి నివేదికనే తయారుచేసింది. ఆ తర్వాత ఎన్సీఈఆర్టీ సవరించిన పాఠ్య ప్రణాళికను రూపొందించింది. ఆ వివరాలన్నిటినీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2022 ఏప్రిల్‌లో బైటపెట్టింది. ఈ కొత్త పాఠ్య ప్రణాళికలో మొఘల్ కాలం నుంచీ, తుగ్లక్‌లు, ఖిల్జీలు, లోడీలతో సహా ఢిల్లీ సుల్తాన్‌ల కాలపు చరిత్ర నుంచీ ప్రధాన భాగాలను తొలగించారు.

ఇదంతా కేవలం విద్యా సంబంధమైన కసరత్తు మాత్రమేనని ఎవరైనా అనుకుంటారేమోనని, 2022 నవంబర్ 24న హోం మంత్రి ఒక ప్రకటన చేశాడు. పాత వక్రీకరణలను తొలగిస్తూ గర్వంగా చరిత్రను తిరగ రాయకుండా భారత్‌ను ఎవరూ ఆపలేరని ఆయన అన్నాడు. అలాగే ఇంత కాలమూ నేర్పిన 'కల్పిత కథనాలను సరిచేయవలసి ఉందని ప్రధాన మంత్రి 2022 డిసెంబర్ 26న అన్నాడు. 'ఒకవైపున తీవ్రవాదం ఉండింది, మరొకవైపున ఆధ్యాత్మికవాదం ఉండింది. ఒక పక్క మత తీవ్రవాద ఉన్మాదంతో కళ్లు మూసుకుపోయిన శక్తిమంతమైన మొఘల్ సుల్తనత్ ఉండింది. మరొక పక్కన, జ్ఞాన ప్రకాశంతో వెలిగిపోతూ, ప్రాచీన భారత సూత్రాలతో జీవితం గడుపుతుండిన గురు పరంపర ఉండింది" అని కూడా అన్నాడు.

అన్ని తొలగింపులతో కూడిన కొత్త పాఠ్యపుస్తకాలు 2023 ఏప్రిల్ మొదట్లో మార్కెట్‌లోకి వచ్చాయి. మళ్లీ, ఈ పుస్తకాలు విడుదల అయిన వెంటనే, భారతీయ జనతా పార్టీ నాయకుడు కపిల్‌మిశ్రా ప్రకటన ఒకటి ఏప్రిల్ 4న వెలువడింది. ఆ ప్రకటనలో ఆయన, 'ఎన్సీఈఆర్టీ పుస్తకాల నుంచి మొఘల్స్ తప్పుడు చరిత్రను తొలగించాలనే నిర్ణయం మహత్తరమైనది. తస్కరులను, జేబు దొంగలను, దారిదోపిడీ గాళ్లను మొఘల్ సుల్తాన్లుగా, భారత చక్రవర్తులుగా పిలిచారు. ఇప్పుడిక అక్బర్, బాబర్, షాజహాన్, ఔరంగజేబు చరిత్ర పుస్తకాలలో లేరు, చెత్త బుట్టలో ఉన్నారు" అన్నాడు.

ఈ నేపథ్యంలో, కొవిడ్-19 వల్ల ఇబ్బంది పడిన విద్యార్థుల మీద చదువు భారాన్ని తగ్గించడానికి హేతుబద్ధీకరణలో భాగంగానే ఈ తొలగింపులు జరిగాయని ఎన్సీఈఆర్టీ డైరెక్టర్ పదే పదే చేస్తున్న ప్రకటనలకు అర్థం లేదని తెలిసిపోతున్నది. అలాగే, ఏవో కొన్ని 'పనికిరాని' భాగాలను తొలగించామని ఆయన చెప్పుకుంటున్న దానికి అర్థం లేదు. అలా తొలగింపుకు గురైన 'పనికిరాని భాగాలను' ఊరికే పైపైన చూసినా అసలు కారణమేమిటో అర్థమైపోతుంది. కొన్ని తొలగింపులకైతే, సంపూర్ణమైన అజ్ఞానమూ అసమర్థతా తప్ప మరే కారణమూ కనిపించదు. పైన చెప్పినట్టుగా చాలా తొలగింపులు మొఘల్ కాలానికీ, ఢిల్లీ సుల్తాన్‌ల కాలానికీ సంబంధించినవి. ముస్లిం సముదాయాన్ని నిరంతరం శత్రువుగా చూపుతుండడం, వాళ్ల పేర్లను రోడ్ల నుంచి, నగరాల నుంచి, ఇప్పుడు పుస్తకాల నుంచి తొలగించడం, వారిని జన సమ్మర్థంతో నిండిన మురికి వాడల్లోకి తోసివేయడం అన్నీ ఒక వరుసలో సాగుతున్నవే.

అలాగే, 2002 గుజరాత్ మారణకాండ ప్రస్తావనలను, ఆ మారణకాండ గురించి నరేంద్ర మోదీ నాయకత్వంలోని

గుజరాత్ ప్రభుత్వ వైఖరి పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యాఖ్యలను, అటువంటి మారణకాండలు కొన్ని సముదాయాలను ఎలా ఘెట్టోలలోకి తోస్తాయో, మిశ్రమ సమూహాల స్థలాలను ఒకే సమూహపు స్థలాలుగా మారుస్తాయో చేసిన వ్యాఖ్యలన్నిటినీ తొలగించారు.

ఒక సమూహం మీద హననకాండ జరిగిందంటే, సాధారణంగా అంతకు ముందు ఆ సమూహం మీద దురభిప్రాయాలు ప్రచారం చేయడం, వారిని రాక్షసులుగా ప్రచారం చేయడం, వారి పేర్లను మార్చడం, వారి చరిత్రను తుడిచివేయడం, వారిని ఘెట్టోలలోకి తోసివేయడం జరిగాయని, సాధారణ ప్రజలు వారితో నిత్య జీవిత సంబంధాలలోకి రాకుండా చేశారని, ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిశోధనలు చూపుతున్నాయి. భారతదేశంలోను ఈ పనుల క్రమం ప్రారంభమైంది. ముస్లింలపై హననకాండ జరపాలని దేశంలో అనేకచోట్ల బహిరంగంగా పిలుపులు వినవస్తున్నాయి. ఆశ్చర్యకరంగా వాటి మీద శిక్షలు గాని, విచారణలు గాని జరగడం లేదు. దేశంలోని ప్రజాస్వామిక శక్తులన్నీ ఈ ముందస్తు సూచనలను గుర్తించి ప్రతిఘటించవలసి ఉంది. అంతేకాదు, ఇలా మొఘల్, సుల్తానత్ కాలాలను తుడిచి వేయడం మన సొంత చరిత్రను అర్థం చేసుకోవడంలో తీవ్రమైన అవరోధాలు కల్పిస్తుంది. ఈ కాలంలో జరిగినదంతా చెడు మాత్రమే అయితే, పద్దెనిమిదో శతాబ్ది ప్రారంభంలో ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు పావు భాగాన్ని భారతదేశం ఉత్పత్తి చేస్తుండే అవకాశం ఉండేది కాదని గుర్తుంచుకోండి. ఆ నాటి భారత జాతీయోత్పత్తి మొత్తం పశ్చిమ యూరప్ దేశాల జాతీయోత్పత్తి కన్న ఎక్కువ. యునైటెడ్ కింగ్ డం జాతీయోత్పత్తి కన్నా ఎనిమిది రెట్లు ఎక్కువ. అప్పటికి భారతదేశం ప్రపంచంలో కెల్లా అతి ఎక్కువ చేనేత వస్త్రాల ఎగుమతిదారు. భారతదేశపు చేనేత వస్త్రోత్పత్తి సాంకేతిక విధానాలనూ, నమూనాలనూ దొంగిలించడానికి బ్రిటిష్ వాళ్లు పారిశ్రామిక గూఢచర్యానికి పాల్పడుతుండేవారు. అదే సమయంలో అది భారతదేశంలో ఒక సంకీర్ణ సంస్కృతి ఆవిర్భవించిన సమయం కూడ. సంగీతం, కళ, భవన నిర్మాణం, సాహిత్యాలలో అపూర్వమైన ముందంజ సాధించిన సమయం కూడా అదే.

భారత ప్రజానీకం ఎన్నడూ ఈ కాలాన్ని హిందువుల మీద ముస్లిం అత్యాచారాల కాలంగా చూడలేదు. ఈ రకమైన దృష్టిని మొట్టమొదటిసారి ప్రవేశపెట్టిన వాళ్లు బ్రిటిష్ వలసవాద సిద్ధాంతకర్తలు. సరిగ్గా ఆ దృష్టినే హిందూ మతోన్మాదులు అందిపుచ్చుకుని ప్రచారం చేయడం ప్రారంభించారు.

1857 తిరుగుబాటు సమయంలో అన్ని సముదాయాలకు చెందిన సైనికులు, ప్రజలు బ్రిటిష్ వారిని కూలదోయాలని, ఆ స్థానంలో మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్‌ను నెలకొల్పాలని ప్రయత్నించారని మనకు మనం గుర్తు తెచ్చుకోవడం సముచితం! ఈ కాలానికి సంబంధించి మన పిల్లలు తొంగిచూడకుండా చేయడం మన కాళ్లను మనం నరుక్కున్నట్టే.

హిందూ రాష్ట్రం కోరుకుంటున్న వాళ్లు పాకిస్తాన్‌లో చరిత్ర బోధనలో ఏమి జరుగుతున్నదో దానికి సరిగ్గా అద్దంలో ప్రతిబింబంలాంటి వాళ్లు ముస్లిం పాకిస్తాన్‌ను అనుకరిస్తున్నవారు. పాకిస్తాన్‌లో హిందూ పూర్వ హరప్పా, మొహెంజోదారోలు ఉన్నాయి గనుక వాటి గురించి చెప్పి, ఆ తర్వాత ఇస్లామిక్ పూర్వ కాలంలోని కొన్ని శతాబ్దాలను, భారత జాతీయోద్యమాన్ని తప్పించి చరిత్ర బోధిస్తున్నారు. పైగా, ఈ అనుకరణ, సరిగ్గా భారతదేశంలో చరిత్ర అధ్యయనం, రచన, బోధన ప్రపంచంలోకెల్లా ప్రగతిశీలంగా ఉన్న సమయంలో జరుగుతున్నది.

తొలగింపులకు గురైన మరొక సమూహపు భాగాలు మహాత్మా గాంధీ హత్యకు సంబంధించినవి. ఈ తొలగింపులను రహస్యంగా, దొంగతనంగా జరిపారు. 2022 ఏప్రిల్లో పాఠశాలలకు పంపిన ఉత్తర్వులలో ప్రస్తావించలేదు. ఈ విషయాలను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా కథనంలో రాశారు. 'భారతదేశాన్ని హిందువులకు మాత్రమే సంబంధించిన దేశంగా మార్చే ఏ ప్రయత్నమైనా దేశాన్ని ధ్వంసం చేస్తుంది' అని గాంధీ ప్రకటించిన విశ్వాసాన్ని తొలగించారు.

గాంధీ కట్టుబడిన 'హిందూ ముస్లిం ఐక్యత అనే దృఢమైన ఆకాంక్ష హిందూ అతివాదులను రెచ్చగొట్టింది, అందువల్లనే వారు ఆయన మీద అనేకసార్లు హత్యాప్రయత్నాలు చేశారు' అనే మాటలనూ తొలగించారు. అలాగే, 'మత విద్వేషాలను రెచ్చగొడుతున్న సంస్థల మీద భారత ప్రభుత్వం కొమ్ము బిరుచుకుని ఎంచుకుని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ వంటి సంస్థలను కొద్ది కాలం కోసం నిషేధించారు' అనే మాటలనూ తొలగించారు. పన్నెండో తరగతి చరిత్ర పుస్తకంలో గాంధీ హంతకుడి రాజకీయాభిప్రాయాల గురించిన పారాగ్రాఫులో సవరణలు చేశారు. సవరణల తర్వాత ఆ పారాగ్రాఫు, 'జనవరి 30న సాయంత్రం ప్రార్థనల తర్వాత గాంధీని ఒక యువకుడు కాల్చి చంపాడు. ఆ తర్వాత లొంగిపోయిన ఆ హంతకుడి పేరు నాథూరాం గాడ్సే' అని మాత్రమే ఉంది. జాతిపిత హత్యలో హిందూ మతోన్మాద శక్తుల పాత్ర ఉందని చెప్పిన మాటలను మాసిపూసి మారేడుకాయ చేసి, వారి బాధ్యతను తప్పించడానికి స్పష్టమైన ప్రయత్నం జరిగిందని ఇక్కడ కనబడుతుంది. అదే సమయంలో ఇవాల్టి రాజకీయ వాతావరణంలో నాథూరాం గాడ్సేను ఆరాధించే ప్రయత్నాలను అనుమతిస్తున్నారు. గాడ్సేను 'దేశభక్తుడు' అని అభివర్ణించిన తర్వాత కూడా భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యురాలు ప్రజ్ఞా ఠాకూర్ తన పదవిలో

**(36వ పేజీ తరువాయి)**

# సావర్కార్‌ను మోడీ గౌరవించటం అంటే గాంధీ, సర్దార్ పటేల్, అంబేద్కర్‌ను అవమానించటమే

- ఎస్.ఎన్.సాహు

స్వాతంత్ర్యోద్యమానికి తిలోదకాలివ్వటమే కాక హిందూ ముస్లింలు వేర్వేరు దేశాలుగా ఏర్పడటానికి కావాల్సిన సైద్ధాంతిక పునాదిని ఏర్పాటు చేసిన వ్యక్తిగా సావర్కార్ భారత చరిత్రలో నిల్చిపోతారు. జాతినుద్దేశించి ప్రధానమంత్రులు చేసే ప్రసంగాల్లో వినాయక దామోదర సావర్కార్ పేరు పదే పదే ప్రస్తావించేది మోదీ ఒక్కరే. మోదీ ఈ మధ్యనే ఢిల్లీ విశ్వ విద్యాలయం పరిధిలో కొత్తగా ప్రారంభం కానున్న ఓ కాలేజీకి శంకుస్థాపన చేశారు. ఆ కాలేజీ పేరు వీడీ సావర్కార్ కాలేజీ. ఇటువంటి చర్యలన్నీ జాతిపిత గాంధీ, సర్దార్ పటేల్, అంబేద్కర్‌లనూ, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలనూ అవమానించటం తప్ప మరొకటి కాదు.

## సావర్కార్ గురించి గాంధీ ఏమన్నారు?

20వ శతాబ్దం తొలి దశాబ్దంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సావర్కార్ మాండలే జైలులో శిక్ష అనుభవిస్తున్న 1911–14 మధ్యకాలంలో ఎన్నోసార్లు క్షమాభిక్ష పెట్టమని వేడుకుంటూ బ్రిటిష్ ప్రభుత్వానికి లేఖలు రాశారు. ఎన్ని అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేకపోవటంతో చివరకు తనను విడుదల చేస్తే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఏ కార్యక్రమంలో పాల్గొనబోననీ, జీవితాంతం రుణపడి ఉంటానని కూడా రాత పూర్వకంగా ఇచ్చారు. ఇంకా చెప్పాలంటే 1920 జనవరి 8న మహాత్మా గాంధీకి రాసిన లేఖలో బ్రిటిష్ పాలకులు క్షమాభిక్ష పెట్టదల్చుకున్న ఖైదీల జాబితాలో తన పేరు, ఖైదీగా ఉన్న మరో సోదరుడి పేరూ లేవని గుర్తుచేశారు. జనవరి 25న సమాధానం రాస్తూ గాంధీ సావర్కార్, అతని సోదరుడు చేసిన తప్పులు కేవలం రాజకీయ స్వభావంతో కూడుకున్నవన్న విషయం గురించి ప్రజలను ఒప్పించేందుకు ప్రయత్నం చేస్తానని వ్రాశారు. సావర్కార్ సోదరులు అన్న శీర్షికన యంగ్ ఇండియా పత్రికలో గాంధీ 1920 మే 26న ఓ వ్యాసం రాశారు. ఫ్రెంచి తీరపు సముద్ర జలాల ఓ పడవ నుండి తప్పించుకుని పారిపోవడానికి సావర్కార్ సోదరులు చేసిన ప్రయత్నాన్ని, ఆ తర్వాత కేసుకు సంబంధించిన వివరాలనూ ప్రస్తావిస్తూ ఆ సోదరులిరువురూ భారతదేశానికి బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం అవసరం లేదని భావిస్తున్నందున తమను దేశద్రోహులుగా గుర్తించరాదని అభ్యర్థించిన విషయాన్ని ప్రస్తావిస్తారు. సావర్కార్ సోదరులు ఈ దేశానికి స్వాతంత్ర్యం అవసరం లేదని ప్రకటించటం నాటి స్వాతంత్ర్యోద్యమ సమరస్ఫూర్తికి విరుద్ధం.



## జిన్నాకంటే ముందే ద్విజాతి సిద్ధాంతం ప్రతిపాదన

యావత్ భారత జాతి ముక్తకంఠంతో స్వాతంత్ర్య సమర భేరి మోగిస్తుంటే దాన్ని తిరస్కరించటమే కాక భారత ఉపఖండాన్ని హిందూ దేశం, ముస్లిం దేశంగా విభజించాలని ప్రతిపాదించిన తొలి వ్యక్తి సావర్కార్. అహ్మదాబాద్‌లో 1937లో హిందూ మహాసభ వార్షిక సమావేశాలను ఉద్దేశించి ప్రసంగిస్తూ సావర్కార్ 'ఒకవేళ ఇంగ్లాండ్ పాలకులు దేశాన్ని విడిచి వెళ్లినప్పటికీ భారతదేశం ఓ దేశంగా మిగలాలన్న ఆకాంక్షకు ఈ దేశంలో ముస్లింలే అత్యంత ప్రమాదకారులుగా మారే అవకాశం ఉందని హిందూ సోదరులను హెచ్చరిస్తున్నాను.' అంటూ తన ముస్లిం ద్వేషాన్ని బాహాటంగానే వెళ్లగక్కారు.

అదే ఉపన్యాసంలో 'హిందువులు, ముస్లింలు ఇరుగు పొరుగున నివసిస్తున్న రెండు వైరి దేశాలు' అని చెప్తూ కొందరు రాజకీయ పసికూనలు భారతదేశం శాంతి సామరస్యాలు, సౌహార్ద్రతతో సమైక్య దేశంగా ఎదిగిందనో లేక బ్రిటిష్ పాలకులు దేశాన్ని వీడిపోతే అటువంటి సమైక్య భారతంగా ఎదుగుతామనో ఆశ పడుతున్నారంటూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో నిర్మితమవుతున్న భారత జాతీయతా భావనను, ఆ భావన ప్రతిపాదకులనూ దుయ్యబట్టారు. ఈ వాదనలు చేసేవారు అవగాహన కలిగిన వారే అయినప్పటికీ ఆలోచన లేని వారని, ఊహాలోకంలో విహరిస్తూ ఉంటారనీ, సామాజిక పరిణామాల్లో మతకోణాన్ని విస్మరిస్తారనీ విమర్శించారు. కానీ ఇక్కడ సమస్య ఏమిటంటే మతపరమైన ప్రశ్న హిందూ ముస్లింల మధ్య శతాబ్దాలపాటు ఘనీభవించిన సాంస్కృతిక, ధార్మిక, జాతి వ్యతిరేకత వల్ల తలెత్తిన సమస్యేనని స్పష్టం చేస్తారు. ఇటువంటి ద్వేషపూరిత భావజాలం కలిగిన సావర్కార్ 1940 దశకంలో జిన్నా ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతానికి కావల్సిన సైద్ధాంతిక భూమికను ఏర్పర్చారు.

## సావర్కార్ పట్ల గాంధీ, పటేల్, అంబేద్కర్ విమర్శలు

క్విట్ ఇండియా పిలుపునివ్వటానికి ముందురోజు 1942 ఆగస్టు 8న బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశాల్లో మాట్లాడుతూ గాంధీ దేశాన్ని మతం ప్రాతిపదికన ముక్కలు చేయాలంటూ ఇస్తున్న పిలుపును పురస్కరించుకుని అదే జరిగితే ఈ దేశం అన్నదమ్ముల రక్తంతో తడిసి ముద్దవుతుందని ఆందోళన చెందారు. మూంజీ, సావర్కార్ లాంటి హిందూ సోదరులు ముస్లింలకు కరవాలంతోనే బుద్ధి చెప్పాలని, ముస్లింలపై హిందూ ఆధిపత్యాన్ని స్థాపించాలని ఉవ్విళ్లూరుతున్నారని గుర్తు చేస్తూ అటువంటి హిందువులకు నేను ప్రాతినిధ్యం వహించనని స్పష్టం చేశారు. సావర్కార్ సిద్ధాంతంలోని హింస, విభజనవాదాన్ని 1942లోనే గాంధీ ప్రస్తావించిన అంశాలను అంబేద్కర్ తన పాకిస్తాన్ లేక దేశ విభజన అన్న గ్రంథంలో చర్చించారు. ఈ గ్రంథం 1946లో అచ్చయ్యింది. 1937లో దేశాన్ని విభజించాలని సావర్కార్ ముందుకు తెచ్చిన ప్రతిపాదనలను ఖండిస్తూ అంబేద్కర్ 'ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే జిన్నా, సావర్కార్‌ల మధ్య ద్విజాతి సిద్ధాంతం విషయంలో ఏకాభిప్రాయం ఉండటం' అని గుర్తుచేశారు. వీరిద్దరూ ఈ విషయం మీద ఏకాభిప్రాయాన్ని కలిగి ఉండటమే కాక దేశాన్ని రెండుగా చీల్చాలన్న విషయంపై కూడా ముక్తకంఠంతో వాదిస్తున్నారని అంబేద్కర్ గుర్తు చేస్తారు. వీరిద్దరి మధ్య ఉన్న తేడా అంతా ఏ షరతుల ప్రాతిపదికన ఈ దేశాన్ని చీల్చాలన్న విషయంలోనే తప్ప దేశాన్ని సమైక్యంగా ఉంచాలా వద్దా అన్న అంశంలో వారి మధ్య తేడాలు లేవని అంబేద్కర్ మరీ మరీ గుర్తు చేస్తున్నారు. 'ఈ దేశాన్ని రెండు ముక్కలు చేసి ముస్లింలు మెజారిటీగా ఉన్న భూభాగాన్ని పాకిస్తాన్‌గానూ, హిందువులు అధిక సంఖ్యాకులుగా ఉన్న భూభాగాన్ని హిందూస్తాన్‌గానూ గుర్తించాలని జిన్నా ప్రతిపాదిస్తుంటే సావర్కార్ దీనికి భిన్నంగా ఈ రెండు దేశాలూ ఒకే రాజ్యాంగం కింద ఉండాలనీ, కాకపోతే ఆ రాజ్యాంగం హిందువుల ఆధిపత్యానికి అవకాశం కల్పించేదిగానూ, తద్వారా ముస్లింలను రెండో తరగతి పౌరులుగా మార్చేందుకు అవకాశం కలిగించేదిగానూ ఉండాలని సావర్కార్ ఆకాంక్ష.

సావర్కార్ ప్రతిపాదించే ఈ సిద్ధాంతం భారత దేశ సమైక్యతా సమగ్రతలకు చేటు కలిగించేదిగా ఉంటుందని అంబేద్కర్ హెచ్చరించారు. 'హిందూ ఆధిపత్య దేశం అయినంత మాత్రాన దేశంలో నివసించే హిందువులందరూ శాంతి సౌభాగ్యాలతో తులతూగుతారనుకోవడం వట్టి భ్రమ. ఎదుకంటే ముస్లింలు భయానికి లొంగిన దాఖలాలు లేవు. నడవడికను మార్చుకున్న దాఖలాలూ లేవు" అని అంబేద్కర్ హెచ్చరించారు.

మహాత్మాగాంధీ హత్యకు సావర్కారే బాధ్యుడని నేరుగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ ప్రకటించటం గమనించాల్సిన విషయం. గాంధీ హత్య జరిగిన నెల రోజుల తర్వాత నాటి ప్రధాని నెహ్రూకు రాసిన లేఖలో పటేల్ 'హిందూ మహాసభకు చెందిన సాయుధ దుండగులు సావర్కార్ నాయకత్వంలోనే ఈ కుట్రకు వ్యూహ రచన చేశారు.' అని రాశారు. గాంధీ హత్య కేసులో నిందితుడిగా విచారణ ఎదుర్కొన్న సావర్కార్ తన పాత్ర గురించి తగిన సాక్ష్యాధారాలు లేకపోవటం వలన నిర్దోషిగా బయట కొచ్చారు. కానీ నెహ్రూకు పటేల్ రాసిన లేఖలోని ఆరోపణలను తర్వాత జీవన్ లాల్ కపూర్ కమిటీ కూడా నిర్ధారించింది. ఈ కమిటీ 1970లో తన నివేదికను సమర్పించింది. నెహ్రూకు పటేల్ రాసిన లేఖ సర్దార్ పటేల్ కరస్పాండెన్స్ నాలుగో సంపుటంలో అచ్చయ్యింది. ఈ పుస్తకాన్ని దుర్గాదాస్ సంపాదకత్వంలో నవజీవన్ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. తిరువనంతపురం సంస్థానం భారతదేశంలో విలీనం కావడాన్ని వ్యతిరేకించిన సావర్కార్ తనకు తాను వీర్ అని బిరుదు ఇచ్చుకున్న సావర్కార్ దేశంలోని సంస్థానాల పాలకులను సమర్థించటం క్షమించరాని విషయం. ప్రధానంగా తిరువనంతపురం మహారాజు భారత దేశంలో విలీనం కాబోవటం లేదు అని చెప్పినప్పుడు సావర్కార్ ఆ ప్రతిపాదనను సమర్థించారు. దానికి ఆయన చెప్పిన కారణం తిరువనంతపురం సంస్థానానికి దక్కిన రాజ్యాధికారం నేరుగా పద్మనాభస్వామి అనుగ్రహమే తప్ప ప్రజానుగ్రహమో రాజ్యాంగానుగ్రహమో కాదన్నది వారి వాదన. అందువలన దైవాజ్ఞను రాజ్యాంగ శాసనానికి లోబర్చలేమన్నది ఆ వాదనకు కొనసాగింపు. ఈ నేపథ్యంలో పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో 1998లో సర్దార్ పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ చెప్పిన మాటలను ఇక్కడ ప్రస్తావించుకోవటం సముచితంగా ఉంటుంది. అప్పట్లో తిరువనంతపురం దివాన్‌గా ఉన్న సీపీ రామస్వామి అయ్యర్ 'తిరువనంతపురం సంస్థానం శ్రీ పద్మనాభునికి ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఆ సంస్థానం భారతదేశంలో విలీనం కావడం అన్న ప్రశ్నే తలెత్తదు' అని వాదించిన విషయాన్ని వాదనను రాష్ట్రపతి నారాయణన్ గుర్తుచేశారు. దీనికి బదులుగా సర్దార్ పటేల్ 'మరి అలాంటప్పుడు అంతటి అనంత పద్మనాభుడే బ్రిటిష్ పాలనకు ఎందుకు తలొగ్గినట్లో సెలవిస్తారా' అని సవాలు విసిరిన విషయాన్ని కూడా రాష్ట్రపతి గుర్తుచేశారు. దేశాన్ని సమైక్యం చేసే బృహత్ కర్తవ్యంలో సర్దార్ పటేల్ మునిగి ఉంటే దేశాన్ని ముక్కలు చేయటంలో భాగంగా తిరువనంతపురం సంస్థానాధీశుల పక్షాన సావర్కార్ నిలిచారు.

సావర్కార్ : వివాదాస్పద వారసత్వం 1924-66 అన్న తన గ్రంథంలో విక్రం సంపత్ 'దివాన్ రామస్వామి అయ్యర్ తిరువనంతపురం సంస్థానం స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యంగా ఉంటుందని ప్రకటించటం, దానికి సావర్కార్ మద్దతు పలకటం భారత దేశ ఐక్యతకు విఘాతం కలిగించే అంశం అని రాశారు.

**(మిగతా 36వ పేజీలో)**

# చరిత్రలో ఇప్టా వారసత్వం



- నీరజ చందోక్

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ అందించిన నాటకాలు, సినిమాలు అద్భుతమైన కళా ఖండాలు. వాటిని ఎన్నటికీ మరువలేము. ఇప్టా సభ్యులను చిన్నపాటి రాజకీయ కార్యకర్తలు అని పిలవటం వారి కృషిని అవమానించటమే. కేంద్ర ప్రభుత్వం, దాని తైనాతీలు చరిత్రను, చారిత్రక పరిణామాలనూ, చారిత్రక వాస్తవాలనూ వికృతీకరించటంలో ప్రావీణ్యం సంపాదించారు. మరీ ముఖ్యంగా ఫాసిజాన్ని, సామ్రాజ్యవాదాన్ని ఈ దేశంలోని అసమానతలతో కూడిన సమాజ నిర్మాణాలను సవాలు చేసిన ప్రజా ఉద్యమాల విషయంలో ఈ వికృతీకరణ మరింత ఎక్కువగా ఉంటోంది. భారతదేశంలో అభ్యుదయ రచయితల సంఘం 1936లో ప్రారంభమైంది. ఆరంభం నుంచి పితృస్వామిక వ్యవస్థ, పేదరికం, సామాజిక అసమానతలు, భూస్వామ్య దోపిడీ, మితవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడం ఈ సంస్థ లక్ష్యాలుగా ఉన్నాయి. ఇదే లక్ష్యాలతో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఏర్పడే నాటికి ప్రపంచం, దేశం రాజకీయంగా అల్లకల్లోలంగా ఉంది. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమం నాటికి దేశవ్యాప్తంగా పనిచేస్తున్న వివిధ థియేటర్ బృందాలు ఏక తాటి మీదకు వచ్చాయి. 1943 మే 25న ఇప్టా బొంబాయిలో ప్రారంభమైంది. ప్రారంభ సమావేశానికి ప్రొఫెసర్ హీరేన్ ముఖర్జీ అధ్యక్షత వహించారు. ఇప్టా ఏర్పడే నాటికి జాతీయంగానూ అంతర్జాతీయంగానూ పరిణామాలేమంత ఆసక్తికరంగా ఆహ్లాదకరంగా లేవు. రెండో ప్రపంచయుద్ధంలో పరుగులు తీస్తున్న జర్మనీ దాదాపు యావత్ యూరప్‌పై జయకేతనం ఎగురవేసి రష్యా భూభాగంలోకి చొచ్చుకుపోయింది. ప్రపంచాన్ని తన పదఘట్టనల కింద నలిపి వేయటానికి సిద్ధమవుతున్న ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సృజనాత్మక శక్తులు, కళాకారులు, రచయితలు ఏకమైన ఓ ప్రతిఘటనా వేదికను ప్రారంభించారు. జర్మనీ ప్రపంచం మీద సాగిస్తున్న సైద్ధాంతిక దాడికి వ్యతిరేకంగా ప్రపంచంలో పేరెన్నికగన్న మేధావులంతా ఒక వేదిక మీదకు రావటం దేశంలో ఇప్టా సభ్యులను ప్రభావితం చేసింది. అంతర్జాతీయంగా సాగుతున్న ప్రతిఘటనా సంస్కృతికి వీరిని మరింతగా ఆకర్షించింది. ఇప్టా ప్రారంభం వెనక అప్పటి భారత కమ్యూనిస్టు పార్టీ కృషి ఉన్నదని పలువురు పరిశోధకులు గుర్తించారు. అంగీకరించారు.

అభ్యుదయ రచయితల సంఘంలో లాగానే ఇప్టాలో కూడా




ఉన్న క్రియాశీల కార్యకర్తలందరూ కమ్యూనిస్టులు కాదు. వేర్వేరు రాజకీయ సైద్ధాంతిక ధోరణులు ఉన్నవాళ్లు కూడా అంతే స్థాయిలో ఉన్నారు. భారతదేశం ఆ నాటి దుస్థితికి దిగజారటానికి కారణమైన అన్నిరకాల దుర్గుణాల నుండి దేశాన్ని విముక్తి చేయటమన్నదొక్కటే వారందరినీ ఏకం చేసిన లక్ష్యం. ఈ లక్ష్యాల దిశగా జనాన్ని సమీకరించటానికి నాటకరంగం సాధనంగా అక్కరకొస్తుందని భావించారు. అత్యంత దోపిడీ పీడనలతో కునారిల్లుతున్న దేశంలో నాటకరంగం ప్రత్యేకించి కళారంగం పాత్ర గురించి పునరాలోచించాల్సి ఉంది. కళ కళ కోసం కాదనీ, సమాజం కోసమనీ 1936లో విడుదల చేసిన మానిఫెస్టో ద్వారా అభ్యుదయ రచయితల సంఘం ప్రకటించింది.

కానీ నేడు పరిస్థితులు మారిపోయాయి. ఇప్టా గురించిన సమాచారం కోసం అంతర్జాలంలో వెతుకుతుంటే అజాదీ కా అమృత మహోత్సవ్ పేరుతో కేంద్ర సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న వెబ్‌సైట్ కనిపించింది. అందులో అందులో డిజిటల్ డిస్ట్రిక్ట్ రిపాజిటరీ వివరాలు అన్న శీర్షికన ఈ వెబ్ సైట్ నడుస్తోంది. ఇప్టా గురించిన సంక్షిప్త పరిచయం అన్న శీర్షికన ఉన్న వ్యాసంలో స్వాతంత్ర్యోద్యమంతో సమాంతరంగా సాంస్కృతికోద్యమాన్ని చేపట్టడానికి ఈ సంస్థ ఏర్పాటయ్యిందని రాశారు. 'ఈ సంస్థ మౌలిక లక్ష్యం ప్రజల్లో ఆత్మాభిమాన

భావనను పెంపొందించటం. ప్రజలెదుర్కొంటున్న సమస్యల పట్ల అవగాహన కల్పించటం, ప్రజలు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించటం' కోసం ఏర్పాటైందని రాశారు.

సరిగ్గా ఈ వ్యాఖ్యానంలోనే ఇప్టా సభ్యుల మౌలిక రాజకీయ ఉద్దేశ్యాలను పాఠకుల దృష్టికి తీసుకురాకుండా చేయటానికి అధికారిక చరిత్రకారులు, వ్యాఖ్యాతలు ఇప్టా సభ్యులు దేశంలో పేదరికాన్ని నిర్మూలించటం, ప్రజల దుస్థితి నుండి వారిని విముక్తి చేయటం వంటి కీలకమైన లక్ష్యాలు ఉన్నాయి. దాంతో పాటు బెంగాల్ క్షామానికి వలసపాలన విధానాలతోపాటు జమీందారీ వ్యవస్థ కారణమన్న విషయంలో ఇప్టా శ్రేణుల్లో ఎటువంటి సందేహాలూ లేవు. కానీ కేంద్ర ప్రభుత్వం భావితరాలకు ఇప్టా గురించి వారి రాజకీయ కార్యాచరణ గురించి తెలియచెప్పే ఈ విషయాల్లో ఈ కీలకమైన సారాన్ని మాత్రం చెప్పటానికి సిద్ధం కావటం లేదు. చరిత్రను వక్రీకరించటంలో ఇదో వినూత్న మార్గం. ఇప్టా సభ్యులకు స్థిరమైన రాజకీయాభిప్రాయలు లేవనీ, స్వల్పంగా రాజకీయ భావాలు కలిగిన వారిని ఈ సంస్థలోకి ఆహ్వానించేదనీ, ప్రధానంగా సాంస్కృతిక రంగం ద్వారా జాతీయోద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో పని చేసిందని ఈ వ్యాఖ్యానంలో చెప్పారు. ఇప్టా సభ్యులు స్వల్ప రాజకీయాభిప్రాయాలు కలిగిన వారు అని చెప్పటం అంటే వారి కృషిని, త్యాగాలను అవమానించటమే కాదు. మన పాలకవర్గాల భేషజాన్ని నగ్నంగా బయటపెట్టుకోవడంతో పాటు కోట్లాదిమందిని దోపిడీ పీడనల నుండి విముక్తి చేయాల్సి ఉందన్న ఇప్టా లక్ష్యాన్ని అటకెక్కించటమే అవుతుంది. ఇప్టాలో అత్యధికులు కమ్యూనిస్టు పార్టీకి చెందినవారే అయినప్పటికీ అందరూ వామపక్షవాదులే కాదు. అయితే అభ్యుదయ రచయితల సంఘంలో లాగానే ఇప్టా సభ్యులు కూడా మౌలికంగా సామ్రాజ్యవాద వ్యతిరేకులు. ప్రజాతంత్రవాదులు. భూస్వామ్య వ్యతిరేక, పెట్టుబడిదారీ వ్యతిరేక లక్ష్యాలకు కట్టుబడి ఉన్న వాళ్లు. ఇప్టా సభ్యుల రాజకీయ భావజాలం ఏమిటో అర్థం చేసుకోవడానికి కొంతమంది నాయకుల గురించి అయినా మనం గుర్తు చేసుకోవాలి. సోంబు మిత్ర, బిజోన్ భట్టాచార్య, ఉత్పల్ దత్. భూపేన్ హజారికా, రాజారావు, కె.ఎ.అబ్బాస్, బలరాజ్ సాహ్ని, రాజేందర్ సింగ్ బేడి, సాదత్ హసన్ మంటో, కృష్ణ చందర్, ఇందర్‌రాజ్, ఆనంద్ పృధ్వీరాజ్ కపూర్, కైఫీ అజ్మి, ఎ.కె.హంగల్, బిమల్‌రాయ్, సత్యేన్ బోస్, బాసు భట్టాచార్య, దుర్గా ఖోటే, దీనా పాఠక్, షౌకత్ అజ్మి, సలిల్ చౌదురి, సజ్జన్, సత్యేన్ కప్పు, ఎం.ఎస్.సత్యు, అనంత్‌నాగ్ నాటి ఇప్టా అగ్రశ్రేణి నాయకత్వంలో కొందరు. వీరితోపాటు మరెందరో మెరికల్లాంటి ప్రజా సాంస్కృతిక మేధావులున్నారు. అందరూ దేశాన్ని, ప్రజలను పట్టి పీడిస్తున్న మితవాద ప్రగతి నిరోధక ఆలోచనలు, అవగాహనలు, ఆచరణల నుండి విముక్తి చేయాలన్న తలంపుతో కళారంగాన్ని కార్యక్షేత్రంగా ఎంచుకున్న వారే. ఈ దిశగా సాగించిన కృషిలో భాగంగా ఇప్టా సినీ, నాటక మాధ్యమాల్లో ఇప్టా అందించిన కొన్ని ఆణిముత్యాలను మనం ఎన్నటికీ మరువలేము.

ప్రజల వద్దకే నాటకం అన్నది అద్భుతమైన సృనాత్మక కార్యాచరణ. అప్పటి వరకూ నాలుగు గోడలు, కులీన ప్రేక్షకుల నడుమ బందీ అయిన నాటకాన్ని స్వేచ్ఛగా రెక్కలు విప్పుకుని ప్రజల ముంగిట్లో వాలే చేసింది ఇప్టా. ఆకాశమే పందిరిగా భూదేవే వేదికగా నాటకాలు ప్రదర్శించటం మొదలైంది. ఈ నాటకాలు వాస్తవానికి దగ్గరగానూ, ప్రజల జీవిత సమస్యలను ప్రతిఫలించేవిగానూ ఉండేవి. ఇక్కడ కళాకారుల ఉద్దేశ్యం ఒక్కటే. ప్రజల ఈతిబాధలతో పాటు ఆకాంక్షలను కూడా కళాత్మక ప్రదర్శనల ద్వారా ప్రజల ముందుంచటం. ఆర్థిక ఆధిపత్యం, దోపిడీ, మతోన్మాద మూఢత్వం, సామాజిక ధూర్త లక్షణాలను వ్యతిరేకించడమే ఇప్టా లక్ష్యంగా ఉండేది.

1943 నాటి కలకత్తా క్షామం తర్వాత 1944లో సోంబు మిత్ర దర్శకత్వంలో నబన్నా (మిగులు పంట) పేరుతో ప్రదర్శించిన నాటకమే ఇప్టా తొలి భారీ ప్రదర్శన. ఇప్టా వ్యవస్థాపక సభ్యులు బిజోన్ భట్టాచార్య రాసిన నాటకం ఇది. రైతాంగాన్ని పీడిస్తున్న భూస్వాములు, కటిక పేదరికం, ఆకలి చావులు గురించి నాటకంలోని వర్ణన గుండెలను పిండేస్తుంది. ఈ మహా క్షామం మనిషి అనుసరించిన అర్థం లేని విధానాల ఫలితమే తప్ప కేవలం ప్రకృతి కృత్యం కాదని బిజోన్ బాబు నిస్సంకోచంగా చెప్పాడు. క్షామం బారిన పడ్డ గ్రామం వదిలిన కొందరు రైతులు సుదూరంగా ఉన్న నగరానికి చేరి అనాథలుగా, భిక్షగాళ్లుగా బతుకులీడుస్తున్న తీరే ఈ నాటకం సారాంశం. నగరం నేర్పిన రాజకీయ చైతన్యంతో ఈ రైతాంగం రెట్టించిన పట్టుదలతో తిరిగి గ్రామానికి చేరుకుంటారు. దాంతో నాటకం ముగుస్తుంది.

1943 నాటి క్షామంలో చనిపోయిన శవాలు చూడటానికి సిద్ధపడక మొఖం తిప్పుకున్న వాళ్లు నబన్నా నాటకం చూసిన తర్వాత కన్నీళ్లు పెట్టకుండా వెళ్లలేదు. ప్రముఖ చలన చిత్ర దర్శకులు రిత్విక్ ఘటక్ మాటల్లో నాటకం కేవలం సామాజిక సంఘర్షణ సాధనం మాత్రమే కాదు. ఆయుధం కూడా అని విశ్లేషించాడు. నాటకం ప్రజా ప్రయోజనాల క్షేత్రంగా ఎలా ఉండగలదో, ముక్కలు ముక్కలుగా చీలిపోయి ఉన్న సామాజిక వాస్తవాన్ని ఒకేసారి బహుముఖ రూపాల్లో ప్రేక్షకుల ముందు ఆవిష్కరింపచేయవచ్చని తొలిసారి చూపిన వ్యక్తి బిజోన్ బాబు అంటాడు రిత్విక్ ఘటక్. ఇటువంటి నాటక రంగాన్ని, కళా రూపాల సృష్టికర్తలను స్వల్పమైన రాజకీయ భావాలు కలిగిన వారిగా చిత్రీకరించటం అంటే వాస్తవాన్ని మసిపూసిమారేడు కాయ చేయటం తప్ప మరేమీకాదు.

1930లో బీమార్ పేరుతో సజ్జాద్ జహీర్ రాసిన ఏకాంకికకు ఆంగ్లానువాదం 1941లో అచ్చయ్యింది. ఈ నాటికలో మధ్య తరగతి రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు మధ్య ఉండే వైరుధ్యాలను ఎత్తిచూపుతారు రచయిత. నాటిక చరమాంకంలో ప్రధాన పాత్ర బషీర్ 'ఇప్పుడున్న చట్టం కష్టపడే వాడికి ఫలితం దక్కేలా చూసేది కాదు. ఏ పనీ చేయని వాడే భూస్వామిగా మారి పెత్తనం చేస్తున్నాడు. కార్మికులు ఆకలితో అలమటిస్తుంటే ఆసాములు మాత్రం సుఖసంతోషాలు, విందులు వినోదాలతో కాలక్షేపం చేస్తుంటారు. ఇక్కడున్న సాంప్రదాయం ఏమిటంటే ఫలానా ఫలితం కావాలని ఎవరన్నా గొంతెత్తి నిలదీస్తే లాఠీలు, అప్పటికీ వినకపోతే తూటాలు ప్రయోగించటం. శ్రమ

## చరిత్రను ఆయుధంగా మారుస్తున్న హిందుత్వ

(31వ పేజీ తరువాయి)

యథాతథంగా కొనసాగుతున్నారు! భారతీయులలో అత్యంత ఉన్నతుడైన ఒక వ్యక్తిని దారుణంగా హతమార్చడానికి దారి తీసిన పరిస్థితుల గురించి రాబోయే తరం ఎటువంటి పాఠాలు నేర్చుకోనక్కరలేదని బోధించబోతున్నారని స్పష్టమే. పారిశ్రామిక విప్లవం, కుల అణచివేత, ప్రజా ఉద్యమాల అభివృద్ధి, సంస్కృతుల ఘర్షణ, ప్రజాస్వామ్యం వైవిధ్యం, ప్రజాస్వామ్యానికి సవాళ్లు, ఎమర్జెన్సీ, ప్రధాన ఇస్లామిక్ దేశాలు, పర్యావరణం – సమాజం, పట్టణ వాతావరణం (పట్టణాలలో అసమానతల గురించీ, అక్కడ పేదలకు వ్యతిరేకంగా సంపన్నులను కాపాడే పోలీసుల వైఖరి గురించీ చెప్పిన భాగం) వగైరా ఇతర 'పనికిరాని' అంశాలను తొలగించడానికి కారణాలను చర్చించడానికి స్థలాభావం వల్ల ఇక్కడ ప్రయత్నించడం లేదు. ఇటువంటి తొలగింపులతో మనం ఎటువంటి ప్రశ్నలూ అడగని, ఆలోచించలేని భక్తులను తయారు చేయడంలో విజయం సాధించగలం. కాని మనం మన పిల్లలు మూఢులూ తెలివితక్కువవాళ్లూ కావాలని కోరుకోవడం లేదు. అదృష్టవశాత్తూ, చాలా మంది విద్యావేత్తలూ, ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలూ ఈ తొలగింపుల మీద తీవ్రమైన నిరసనలు ప్రకటించారు. ఈ మార్పులన్నిటినీ తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మార్పులన్నీ రాజ్యాంగ ఆదర్శాలకూ, భారత ఉపఖండంలోని ప్రజాస్వామిక, సంకీర్ణ సంస్కృతికీ వ్యతిరేకమైన విచ్ఛిన్నకర దురుద్దేశాలతో సాగుతున్నవని అన్నారు. ఎన్సీఈఆర్టీ నిర్ణయాన్ని విమర్శిస్తూ ఎన్నో వార్తాపత్రికలు సంపాదకీయాలు రాశాయి. మన పిల్లల విద్యా బాధ్యతలు చూస్తున్న వారికి ఈ మంచి మాటలు మనసుకెక్కి వారు పిల్లల ఉత్తమ ప్రయోజనాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకునేలా ఒత్తిడి చేస్తాయని ఆశిద్దాం. ❑

ఫలితంగా సృష్టించిన సంపదంతా అర్చకులు, సోమరులు, పరాన్నభుక్కులు, భజనపరులు, ముందు చూపులేని మూర్ఖుల పాలవుతుంది. సంపద ఉన్న వాళ్ల చేతుల్లోనే అధికారం ఉంటుంది. అధికారం చేజిక్కించుకున్న వాళ్లే చట్టాలు చేస్తారు. ఆ చట్టాలు పేదలకు, శ్రమజీవుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంటాయి. ఇదే నేటి నీతి. అటువంటి చట్టాలకు లొంగి ఉండటం అంటే నా దృష్టిలో మానవాళికి అన్యాయం చేయటమే' అంటాడు బాధగా. ఇలాంటి నాటికల ద్వారా రచయితలు చెప్పదల్చుకున్న సందేశం స్పష్టంగానే ఉంది. శ్రమ దోపిడీయే అన్ని రకాల సామాజిక సమస్యలకూ కారణం. అందువల్లనే ఇప్టా నేతృత్వంలో నాటకరంగం, సృజనకారులు శ్రమదోపిడీకి వ్యతిరేకంగా కళారూపాల ద్వారా గళమెత్తారు.

బొంబాయి కేంద్రంగా నడుస్తున్న చలనచిత్ర రంగాన్ని 1950, 1960 దశకాల్లో ఇప్టా పెద్ద ఎత్తున ప్రభావితం చేసింది. స్వాతంత్ర్యానంతరం దేశం ఆర్థిక సామాజిక బానిసత్వం నుండి విముక్తి పొందలేదన్న వాస్తవాన్ని ఈ కాలంలో విడుదలైన సినిమాల్లో మనం చూడవచ్చు. ముగింపుగా చెప్పాలంటే ఇప్టా సభ్యులు స్వల్ప రాజకీయ భావాలు కలిగిన వారు మాత్రమేనని వర్ణించటం వారు జీవితాలు అంకితం చేసుకున్న లక్ష్యాలను ఎగతాళి చేయటమే. స్వాతంత్ర్య భావనను అనేక కోణాల్లో విస్తరించేందుకు కృషి చేసిన సృజనకారులు నిర్మించిన ఉద్యమ వాస్తవిక చరిత్రను తప్పుదారి పట్టించటమే. తీవ్రవాద భావాలున్న వారి గురించి భావితరాలకు తెలియచెప్పకుండా ఉండటమే అధికారిక చరిత్ర క్రమం అయితే ప్రస్తుత పాలకులు రాజకీయాలంటే ఓనమాలు తెలీదనే చెప్పాలి. భిన్నాభిప్రాయాల మధ్య జరిగే ఘర్షణే రాజకీయాలు. ఎన్నికల్లో పోటీ చేయటం ఒక్కటే రాజకీయం కాదు. ❑

## సావర్కార్‌ను మోడీ గౌరవించడమంటే

(33వ పేజీ తరువాయి)

### ప్రాథమిక బాధ్యతలను తిరస్కరిస్తున్న మోడీ వైఖరి


అటువంటి సావర్కార్ దేశంలో అగ్రగామి నేత అని కీర్తిస్తూ ఆయన పేరు మీద ఓ కాలేజీని ప్రారంభించేందుకు శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోడీని ఎలా అర్థం చేసుకోవాలి? స్వయంగా ప్రధాని హోదాలో ఉన్న వ్యక్తి ఆ పని చేయటం అంటే మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, డాక్టర్ అంబేద్కర్‌ల అత్యున్నత వారసత్వాన్ని ఎగతాళి చేయటమే. రాజ్యాంగంలో ఆర్టికల్ 51(అ)(ఆ)లో ప్రస్తావించిన స్వాతంత్ర్యోద్యమ ఉన్నత విలువలను పెంపొందించి ప్రోత్సహించాలన్న కర్తవ్యానికి తిలోదకాలు ఇవ్వటమే. **(వైర్ సౌజన్యంతో)** ❑

# మన స్థల కాలాలకు గ్రాంసీ



- పాణి

**'నీవు ఎవరికి చెబుతున్నావు?' అనేది గ్రాంసీకి చాలా ముఖ్యమని ఈ రచనలో అశోక్ అన్నారు. మార్క్సిజమంటే ఆయనకు 'ఆచరణాత్మక తత్వశాస్త్రం' అనీ ప్రస్తావించారు. గ్రాంసీని అర్థం చేసుకోడానికి అశోక్ ఈ రెంటినీ గీటురాయి చేసుకున్నారు. అందువల్ల 'అసలు గ్రాంసీ'ని తెలుసుకోవడం, మనకు చెప్పడం చాలా తేలికైంది. గ్రాంసీ విశ్లేషకులు ఆయన ను 'ఓల్డ్ గ్రాంసీ', 'న్యూ గ్రాంసీ' అని విభజించి చూస్తారు. అట్లాగే గ్రాంసీ భావాలను పోస్టు మార్క్సిస్టులు, యాంటీ మార్క్సిస్టులు, నాన్ మార్క్సిస్టులు కూడా గొప్పవని కీర్తిస్తుంటారు.**




మన దగ్గర ఓ ముప్పై ఏళ్ల కింద గ్రాంసీ పెద్దగా తెలియదు. ఆయన ఆలోచనల పరిచయమే మార్క్సిజం మీద విమర్శతో, విసుగుతో, అసంతృప్తితో మొదలైంది. ముఖ్యంగా నడుస్తున్న విప్లవోద్యమం మీద ఎంతో కొంత వ్యతిరేకతతో మొదలైంది. మార్క్సిజం తెలిసినవాళ్లను, ప్రజా ఉద్యమాల్లో ఉన్నవాళ్లను కూడా సందేహాలకు లోను చేసేలా ఈ చర్చ జరిగింది. మార్క్సి జాన్ని సవరించాలని, సృజనాత్మకంగా అభివృద్ధి చేయాలని అన్నారు. విప్లవ రాజకీయ కార్యక్రమాన్నే మార్చుకోవాలని అన్నారు. సారాంశంలో ఇదంతా వర్గపోరాటంతో సంబంధం లేని సిద్ధాంత చర్చకు దారి తీసింది. వర్గ సమాజం స్థానంలోకి పౌర సమాజం వచ్చింది. వర్గం బదులు 'సబాల్ట్రన్' అనే భావన వచ్చింది. ఈ ఉధృతి కొద్ది కాలం నడిచింది. తెలుగులో ఇప్పుడు అంతగా గ్రాంసీ గురించి మాట్లాడటం లేదు. బహుశా ఈ తరహా మేధావులందరూ మార్క్సిజాన్ని గ్రాంసీ ఆచరణాత్మక తత్వశాస్త్రంగా గుర్తించాడనే మౌలిక విషయాన్ని విస్మరించి ఉంటారు. మానవ ఆచరణలోకి గ్రాంసీ ఆలోచనలను అన్వయించాలనుకోవడం వల్ల కొద్ది రోజులు ఆసక్తిగా చర్చించి ఆ తర్వాత వదిలేశారు.

ఈ తరహా చర్చల వల్ల గ్రాంసీ భావనలు అనేక అర్థాల్లో ప్రచారంలోకి వచ్చాయి. అవి మన ఆలోచనలను, ఉద్యమాలూ ప్రభావితం చేశాయి. గ్రాంసీ జీవించి, రచించి, మరణించిన ఫాసిస్టు సందర్భానికి ఇప్పటి భారత సామాజిక ఫాసిస్టు దశకు చాలా పోలికలు ఉన్నందువల్ల ఆయనను అధ్యయనం చేయాల్సిన అవసరం పెరిగింది. గ్రాంసీ మౌలిక భావనలకు ప్రాధాన్యత పెరిగింది.

అనేక కారణాల వల్ల గ్రాంసీ ఒరిజినల్ భావనలను, వాటి అర్థాలను, లక్ష్యాలను తెలుసుకోవడంలో చాలా సంక్లిష్టత ఉన్నదని గ్రాంసీ విశ్లేషకులందరూ అంటారు. పెట్టుబడిదారీ విధానం నుంచి, ప్రపంచ యుద్ధం నుంచి ఫాసిజం పుట్టిన సందర్భంలో, జైల్లో దారుణమైన పరిస్థితుల్లో గ్రాంసీ రాసుకున్న నోట్స్‌లోని ఆలోచనలు అవి. జైలు సెన్సార్షిప్‌ను దాటుకోడానికి ఆయన కొత్త పరిభాషను, రచనా శైలిని ఎంచుకున్నాడు. ఆ తర్వాత ఇటలీ కమ్యూనిస్టు పార్టీ గ్రాంసీ నోట్స్‌ను పరిష్కరించి ప్రచురించింది. వీటన్నిటి వల్ల చోటు చేసుకున్న సంక్లిష్టత నుంచి కూడా గ్రాంసీని 'సంప్రదాయ మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతానికి'

భిన్నంగా, వ్యతిరేకంగా నిలబెట్టే వాళ్లు తయారయ్యారు. మౌలికంగా మార్క్సిస్టు సంవిధానానికి ఇతరంగా ఆయనను ఆలోచించాడని అంటున్నారు. ఈ ధోరణి తెలుగులోకి కూడా దిగుమతి అయింది.

ఇంత విస్తృతమైన, జటిలమైన గ్రాంసీ అధ్యయన పర్యావరణం లోకి అశోక్ రాసిన ఈ పుస్తకం వస్తోంది. 'ఓల్డ్ గ్రాంసీ', 'న్యూ గ్రాంసీ' అనే విభజనకు భిన్నంగా ఆయనను అన్వేషించడానికి అశోక్ ప్రయత్నించారు. ఇటలీ పరిణామాలు, ప్రపంచ వ్యాప్తంగా యుద్ధం తరహా భీతావహ పరిస్థితులు, చారిత్రకంగా, తాత్వికంగా మార్క్సిస్టు గతితార్కిక పద్ధతి వికాసానికి ఉన్న అవకాశాలు దృష్టిలో పెట్టుకొని గ్రాంసీని అధ్యయనం చేసిన ఫలితమే ఈ పుస్తకం. గ్రాంసీని ఆయన జీవితం నుంచి, స్థలకాలాల నుంచి, ఆయనను రూపొందించిన ఆనాటి చారిత్రక పరిస్థితుల నుంచి వేరు చేయకుండా పరిశీలించడం ఇందులోని ప్రత్యేకత. గ్రాంసీ ప్రవేశపెట్టిన అనేక కొత్త ఆలోచనలను మార్క్సిస్టు పద్ధతి విస్తరణలో భాగంగా చూసినందు వల్ల గ్రాంసీని దగ్గరిగా అశోక్ మనకు చూపించారు. గ్రాంసీ భావనల చుట్టూ ఉన్న అనేక చర్చలను పరిగణలోకి తీసుకొని మార్క్సిస్టుగా, ఆచరణకు ప్రాధాన్యత ఇచ్చిన విప్లవకారుడిగా ఆయన సిద్ధాంతాలను పునర్నిర్మించే ప్రయత్నం ఈ రచనలో ఉంది. దీనికి గ్రాంసీ సోషలిస్టు పార్టీలో ఉన్న రోజుల్లో చేసిన ఆలోచనల దగ్గరి నుంచి ఒక పరిణామ క్రమాన్ని అశోక్ సూక్ష్మంగా పరిశీలించారు. 'ప్రతి వ్యక్తికి, సిద్ధాంతానికి ఒక ప్రయాణం ఉంటుంది' అనే వాక్యంతో ఈ పుస్తకం ఆరంభం అవుతుంది. ఇక్కడి నుంచి అశోక్ తనదైన పరిశీలన పద్ధతిని రూపొందించుకున్నారు.

చరిత్రలో ఏ వ్యక్తినైనా పరిశీలించేందుకు, అందునా గ్రాంసీ లాగా ఒక ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కొన్న ఆలోచనాపరుడిని అంచనా వేయడానికి శాస్త్రీయమైన పద్ధతి అవసరం. మౌలికంగా ఆ వ్యక్తి ఆలోచనా చట్రం, దాని వికాసం తెలుసుకోకుండా పరిశీలిస్తే దూరంగా ఉండిపోతాం. ఊహా కల్పనల్లో చిక్కుకపోయే ప్రమాదం ఉంటుంది. దీనికి భిన్నంగా అశోక్ పరిశీలించాడు. మార్క్స్ భావనలకు, పద్ధతిని గ్రాంసీ ఏ విషయాల్లో సృజనాత్మకంగా, కొత్తగా చెప్పిందీ వివరించారు. తన కాలపు మార్క్సిజానికి ఆయన కొత్తగా చేర్చిన ముఖ్య భావనలను ప్రత్యేకంగా చెప్పారు. తద్వారా మార్క్సిస్టు సిద్ధాంతానికి, ముఖ్యంగా రాజకీయాలకు, సాంస్కృతిక, భాషా విశ్లేషణల్లో గ్రాంసీ చేర్పును చాలా నిర్దిష్టంగా రాశారు. హెజిమొని, ఇంటలెక్చువల్, కామన్‌సెన్స్, సివిల్ సొసైటీ వంటి భావనలను గ్రాంసీ వాడిన పద్ధతిలోని ప్రత్యేకతలను అశోక్ వివరించారు. ఇందులో ముఖ్యమైనది ఫాసిజాన్ని అర్థం చేసుకోవడం. ఆర్థిక సంక్షోభకాలంలో బూర్జువా వర్గం చేసే ప్రతీఘాతుక చర్యగా ఫాసిజాన్ని గ్రాంసీ చూడలేదు. మార్క్స్, ఏంగెల్స్ పదే పదే తిరస్కరించిన ఆర్థిక నియతివాదానికి పూర్తి భిన్నంగా గ్రాంసీ చేసిన ఆలోచనలు మార్క్సిస్టు సిద్ధాంతరంగానికి గొప్ప చేర్పు ఎట్లా అయిందో అశోక్ చాలా జాగ్రత్తగా, సున్నితంగా చెప్పారు. పునాది, ఉపరితలం పరస్పర సంబంధాల్లో, ప్రభావాల్లో కలిసి ఉండే చారిత్రక స్థితిని 'హిస్టారికల్ బ్లాక్' అనే భావనతో గ్రాంసీ వివరించాడని అశోక్ అంటారు. ఆర్థిక నియతివాదాన్ని ఎదుర్కోడానికి గ్రాంసీ చేసిన ఈ చేర్పు అద్భుతమైనది.

'మనిషి అంటేనే హిస్టారికల్ బ్లాక్' అనే భావనతోపాటు సామాజిక మానసికతను, సమ్మతిని వివరించేందుకు ఆయన ఎంచుకున్న పద్ధతి మార్క్సిస్టు విశ్లేషణలో భాగంగా అశోక్ చెప్పారు. ఏ సమాజంలో అయినా పాలకవర్గ భావాలే ఆ సమాజ భావాలుగా ఆధిక్యంలో ఉంటాయనే మార్క్సిస్టు సూత్రీకరణను గ్రాంసీ మరో వైపు నుంచి చెప్పారు. పాలక భావాలు ప్రజల మనసుల్లోంచి, సమ్మతిలోంచి ఆధిక్యంలోకి వస్తాయని చెప్పడం గ్రాంసీ ఉద్దేశం. అశోక్ ఎంచుకున్న పద్ధతి గ్రాంసీని అధ్యయనం చేయడంలోని క్లిష్టతలను ఛేదించడానికి దారి చూపుతుంది. ఇటలీలోని ముసోలినీ ఫాసిజానికి, మన దేశంలోని హిందుత్వ కార్పొరేట్ ఫాసిజానికి కొన్ని తేడాలు ఉన్నప్పటికీ చాలా పోలికలు ఉన్నాయి. ఎక్కడైనా ఫాసిజం పని చేసే పద్ధతిలో సారూప్యతలు ఉంటాయి. అత్యంత అమానవీయమైన, విధ్వంసకరమైన, ప్రతీఘాతుకమైన ఫాసిజాన్ని నిందించి లాభం లేదు. దాని పని విధానం తెలుసుకోవాలి. మన దేశంలో ఫాసిజాన్ని అర్థం చేసుకోడానికి గ్రాంసీ అత్యవసరం. కేవలం ఫాసిజాన్ని ఓడిరచడానికే కాదు. విప్లవం విజయవంతం చేయడానికి కూడా గ్రాంసీ కావాలి.

మార్క్సిస్టులందరిలాగే గ్రాంసీ సాధారణ ప్రజల మానసికతకు, చైతన్యవంతమైన ఆచరణకు చాలా ప్రాధాన్యత ఇచ్చారు. అత్యంత క్లిష్టమైన మార్గంలో కొనసాగుతున్న భారత విప్లవోద్యమాన్ని పురోగమింపచేయాలంటే ఈ సమాజంతో, దాని చరిత్రతో, దాని మానసికతతో విప్లవాత్మకంగా వ్యవహరించాల్సిందే. విప్లవకారుల లక్ష్యం అదే. నిజానికి భారత విప్లవోద్యమ ఆచరణలో గ్రాంసీ భావనలు చాలా స్పష్టంగా కనిపిస్తాయి. దేనికంటే ఆయన ఆలోచనలు పూర్తి ఆచరణాత్మకమైనవి. ఆ రకంగా అది పూర్తి సైద్ధాంతికమైనది. మానవ ఆచరణకు ప్రాధాన్యత ఇచ్చే గ్రాంసీ అధ్యయనం విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి అత్యవసరం. గ్రాంసీని మనకు పరిచయం చేయడంలో అశోక్ లక్ష్యం ఇదే. ఈ పుస్తకం చూడ్డానికి చాలా చిన్నదే కావచ్చు. ఈ రకంగా చాలా ప్రాధాన్యత ఉంది. అందరూ, ముఖ్యంగా ప్రజా క్షేత్రంలో ఉండే కార్యకర్తలకు ఈ పుస్తకం చాలా అవసరం. ❑

**(కొలిమి సౌజన్యంతో..)**

# ఏం చేయాలి ?

## ఉద్యమం ఎదుర్కొంటున్న తక్షణ సవాళ్లు


- ఎంవిఎస్ శర్మ



**ప్రపంచవ్యాప్తంగా, మన దేశంలోనూ విప్లవోద్యమాలు పెను సవాళ్ళు ఎదుర్కొంటున్న కాలంలో మనం ఉన్నాం. ఎదురయే సవాళ్ళను అధిగమించే ప్రయత్నంతోటే మనం పురోగమించగలుగుతాం. నిత్యం ఉద్యమంలో అంకితభావంతో పని చేస్తున్న మన కామ్రేడ్స్‌కు తామెదుర్కొంటున్న సవాళ్ళేమిటో తెలుసు. కానీ కొద్ది మందికి మాత్రమే వాటిని అధిగమించి ముందుకు సాగడం పట్ల స్పష్టత ఉంటుంది. ఇటువంటి పరిస్థితినే రష్యన్ విప్లవోద్యమం ఎదుర్కొంటున్నప్పుడు లెనిన్ 'ఏం చేయాలి?' అన్న గ్రంథం రాశాడు. 1902లో రచించిన ఈ గ్రంధానికి టైటిల్ కింద 'ఉద్యమం ఎదుర్కొంటున్న తక్షణ సవాళ్ళు' అన్న ట్యాగ్ లైన్ కూడా ఉంటుంది.**

### పూర్వ రంగం

1900-1903 మధ్య కాలంలో ప్రపంచం యావత్తూ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ సంక్షోభం ఫలితంగా రష్యాలో పారిశ్రామిక మాంద్యం. వేలాది మంది కార్మికులు పనులు కోల్పోయారు. దీనికి గ్రామీణ ప్రాంతాల కరువుతోడైంది. నిరుద్యోగం, కరువుతోబాటు పోలీసుల నిర్బంధం పెరిగింది. ప్రజల్లో రాచరికపు నిరంకుశ పాలన పట్ల తీవ్ర ద్వేషం ఏర్పడింది. దేశమంతటా నెలకొన్న విప్లవ వాతావరణం ఒక బలమైన విప్లవ పార్టీని నిర్మించవలసిన ఆవశ్యకతను ముందుకు తెచ్చింది. కార్మికవర్గాన్ని రానున్న విప్లవానికి నాయకత్వం వహించేలా తయారు చేయవలసిన ప్రధాన బాధ్యత ఆ పార్టీకి ఉంది. 'ఏం చేయాలి' గ్రంథంకన్నా ముందు లెనిన్ ఇస్క్రా పత్రికలో 'ఎక్కడ ప్రారంభించాలి ?' అన్న పేరుతో సంపాదకీయాన్ని రాశాడు. 'కార్మికులంటే ప్రభుత్వ సైన్యానికి, పోలీసులకు ఎందుకింత భయమో, జారు చక్రవర్తి, యజమానులు ఎందుకు భయభ్రాంతులకు లోనవుతున్నారో ఈ సంపాదకీయం చదివాక నాకు బోధపడింది. నేనొక సాధారణ కార్మికుడిని. పెద్దగా చదువుకోలేదు. కానీ ఏది సత్యమో నాకు తెలుసు. ఈ రోజు కార్మికులకేది అవసరమో నాకు తెలుసు. ప్రస్తుతం కార్మికులలో వేడి పుట్టించడం చాలా తేలిక. ఇప్పటికే అది నివురుగప్పి వుంది. ఒక్క నిప్పు రవ్వ తాకితే చాలు అది




దావాలనంలా వ్యాపిస్తుంది' అంటూ ఒక జౌళి కార్మికుడు లెనిన్‌కు లేఖ రాశాడు. 1902 జూన్‌లో రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (రష్యన్ సోషల్ డెమాక్రటిక్ లేబర్ పార్టీ అన్న పేరుతో ఆ పార్టీ నిర్వహించేది) ముసాయిదా కార్యక్రమం రూపొందించబడింది. విప్లవానికి కార్మికవర్గ నాయకత్వం ఆవశ్యకత ఏమిటో ఆ కార్యక్రమం స్పష్టం చేసింది. అటువంటి నాయకత్వం వహించగల స్థితికి రష్యన్ కార్మికవర్గాన్ని పెంపొందించడం ఎలా? అన్నది ప్రధాన సమస్య. ఈ నేపథ్యంలో లెనిన్ 'ఏం చేయాలి' గ్రంధాన్ని రచించాడు.

### సైద్ధాంతిక సవాళ్లు

సమాజంలో నానాటికీ తీవ్రమౌతున్న వర్గ వైరుధ్యాలను నివృత్తి చేయడంలో కార్మికవర్గ విప్లవం అవసరం అనే మార్క్సిస్టు సూత్రాన్ని తిరస్కరిస్తూ ఆ వైరుధ్యాల తీవ్రతను క్రమంగా తగ్గించుకోవడమే పరిష్కారం అని చెప్పే బెర్న్‌స్టీన్ రివిజనిస్టు సిద్ధాంతాలు, కార్మికవర్గం తమ దైనందిన ట్రేడ్ యూనియన్

కార్యకలాపాలకు పరిమితం కావాలని ప్రబోధించే ఆర్థికవాదం, విమర్శనా స్వేచ్ఛ కావాలనే పేరుతో విప్లవోద్యమంలోకి బూర్జువా భావాలను జొప్పించే సంస్కరణవాదుల ప్రచారం, కార్మికులే విప్లవం తీసుకువచ్చే వర్గంగా ఉన్నప్పుడు మళ్లీ ఒక కమ్యూనిస్టు పార్టీ అవసరం ఏముందంటూ వారు చేస్తున్న వాదనలు, విప్లవం కోరుకునే ప్రతీ ఒక్కరినీ పార్టీలో చేర్చుకోవాలే తప్ప వారు తప్పనిసరిగా నిర్దిష్ట బాధ్యతలతో ప్రజల మధ్య పని చేయాలనే నిబంధనలు విధించకూడదన్న వాదనలు రష్యన్ కమ్యూనిస్టు ఉద్యమం ముందుకు సాగడానికి ఆటంకంగా తయారయ్యాయి. కార్యకర్తలు ఎక్కడా లభించడం లేదనీ, ఉద్యమాలు నిర్వహించే పని చాలా ఉన్నప్పుడు పత్రికను నడిపే బాధ్యతను కూడా పార్టీ ఎందుకు తీసుకోవాలని వాదించే వారు తయారయ్యారు. ఏదో ఒక మేరకు అటువంటి వాదనలు మన ఉద్యమంలో కూడా ప్రస్తుతం కొనసాగుతున్న సంగతిని గమనిస్తే మనకు ఏం చేయాలి పుస్తకాన్ని ఎందుకు లోతుగా అధ్యయనం చేయాలో బోధపడుతుంది.

## కొత్త తరహాలో కమ్యూనిస్టు పార్టీ

'ఏం చేయాలి' గ్రంథంలో లెనిన్ ఈ సైద్ధాంతిక సవాళ్ళతో ఆచరణాత్మకమైన సమస్యల్ని పరిష్కరిస్తూ చేసిన సూత్రీకరణలు రష్యన్ కమ్యూనిస్టు ఉద్యమాన్ని విప్లవకర మార్గం వైపు నడిపించాయి. సిద్ధాంత సమస్యలను నిర్లక్ష్యం చేసే కమ్యూనిస్టు పార్టీలు ఏ విధంగా పురోగమించే శక్తిని కోల్పోతాయో లెనిన్ ఆనాటి యూరపియన్ దేశాలలోని ఉద్యమాలను ప్రస్తావిస్తూ వివరించాడు. ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలను సమన్వయం చేస్తూ ఉద్యమాన్ని ఒక క్రమపద్ధతిలో నడిపినప్పుడే విజయం వైపు. పయనించగలుగుతాం అని లెనిన్ చెప్పాడు.

## ప్రాప్త కాలజ్ఞత

'ప్రజా సామాన్యంలో, ముఖ్యంగా కార్మికవర్గంలో నేడు అపూర్వమైన చైతన్యం కనిపించింది. అందువల్లనే మన ఉద్యమం ఇంత శక్తివంతంగా తయారైంది. కాని, దానిని నడిపే నాయకుల్లో కూడా చొరవ, చైతన్యం లేకపోతే అది బలహీనమై నీళ్ళు కారిపోతుంది.' అని లెనిన్ హెచ్చరించాడు. యజమానులతో జరిపే పోరాటాలలో ట్రేడ్ యూనియన్ చైతన్యం మాత్రమే కలుగుతుంది. అటువంటి పోరాటాల ప్రధాన లక్షణం ప్రాప్తకాలజ్ఞత. కార్మికులకు సోషలిస్టు చైతన్యం వెలుపల నుండే రావాలి. కొంత మంది మేథావులు తత్వశాస్త్రాన్ని, ఆర్థిక శాస్త్రాన్ని, చరిత్రను అధ్యయనం చేసిన క్రమంలో సోషలిస్టు సిద్ధాంతం పుట్టింది. కార్మికోద్యమాలతో ఎట్టి సంబంధాలూ లేకపోయినా ఈ సిద్ధాంతం బయలుదేరింది. ఒకపక్క కార్మికులు పోరాటాలు, అదే సమయంలో కొందరు విప్లవకారులు ఆ కార్మికుల వద్దకు సోషలిస్టు సిద్ధాంతాలను తీసుకువెళ్లడం జరిగింది. ఒకసారి సోషలిస్టు సిద్ధాంతం కార్మికులకు చేరగానే తమ దైనందిన కోర్కెల పరిష్కారం కోసం జరిపే పోరాటాలకు మాత్రమే పరిమితం అయిపోకుండా, జారు చక్రవర్తి నిరంకుశ పాలనను కూలదోసి కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించవలసిన ఆవశ్యకతను పేర్కొన్నారు. ప్రాప్తకాలజ్ఞత అనేది కార్మికవర్గానికి ఉండే బలహీనతగా కొందరు అర్థం చేసుకుంటారు. ఇది పూర్తిగా తప్పు. కార్మికోద్యమంలో పనిచేసే కమ్యూనిస్టుల్లో దైనందిన పోరాటాలకు మాత్రమే పరిమితం అయిపోవడం, ట్రేడ్ యూనియన్లను నిర్వహించడంపై దృష్టిని యావత్తు పెట్టడం అనే ధోరణి ఉంది. దీనినే లెనిన్ ప్రాప్తకాలజ్ఞత అన్నాడు. అంటే ప్రాప్తకాలజ్ఞత అనేది కమ్యూనిస్టుల బలహీనతే తప్ప కార్మికుల బలహీనత కాదు.

## ఆర్థిక తత్వం

ప్రాప్త కాలజ్ఞతకు లోనైన కమ్యూనిస్టు నాయకులు ముందుకు తెచ్చే వాదనలు ఇలా ఉంటాయి : 1. ఒక పథకం ప్రకారం క్రమబద్ధంగా కార్మికోద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఏమీ లేదు. దానంతట అదే అభివృద్ధి చెందుతుంది. 2. కార్మికోద్యమంతో కార్మికులు కాని వారెవరూ సంబంధం పెట్టుకోరాదు. వర్గ పోరాటాలు పెరుగుతున్న కొద్దీ కార్మికులు సోషలిజం అవసరాన్ని వారంతట వారే గుర్తిస్తారని ప్రాప్తకాలజ్ఞులు వాదిస్తారు. ఈ వాదనలలోని లోపాన్ని వివరిస్తూ లెనిన్ ఈ విధంగా చెప్పాడు : పెట్టుబడిదారీ వర్గ దోపిడీ ఫలితమైన దుర్భర దారిద్ర్యాన్ని ఎదుర్కొనే విధంగా వర్గ పోరాటాలు పుట్టుకొస్తాయి. కానీ, వర్గపోరాటం, సోషలిస్టు సిద్ధాంతం రెండూ ఒక దాని నుంచి ఇంకొకటి ఆవిర్భవించవు. ఈ రెండు పెట్టుబడిదారీ వ్యవస్థ లోనే పుట్టుకొచ్చాయి. కానీ ఒకదాని నుంచి ఇంకొకటి రాలేదు. రెండూ ఒక దాని పక్కన ఇంకొకటిగా పుట్టుకొస్తాయి. దానంతట అదే తలెత్తే వర్గ పోరాటంలో ఎట్టి సిద్ధాంతాలూ పుట్టవు. ఆ పోరాటాల సందర్భంలో కార్మికులకు బూర్జువా సిద్ధాంతాలైనా బైట నుంచి ఎక్కుతాయి. లేదా సోషలిస్టు సిద్ధాంతాన్నైనా బైట నుంచే ఎక్కించాలి. సిద్ధాంత కృషిని విస్మరించి ట్రేడ్ యూనియన్ పోరాటాలకే అంకితం అయిపోవటం అంటే ఆచరణలో బూర్జువా సిద్ధాంతానికి దాసోహం అయిపోవడమే. బూర్జువ వర్గం తన ఏర్పాట్ల ద్వారా నిరంతరం తన బూర్జువా సిద్ధాంతాన్ని కార్మికులకు, తక్కిన ప్రజానీకానికి ఎక్కిస్తూనే వుంటుంది. కమ్యూనిస్టులు సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రత్యేకంగా కార్మికుల మధ్య ప్రచారం చేయకుండా, ఎప్పటికో ఒకప్పటికి కార్మికులు తమ పోరాటాల అనుభవాల నుండే సోషలిజం ఆవశ్యకతను గుర్తిస్తారు అని అనుకుంటే అంతకన్నా పొరపాటు మరొకటి ఉండదు. కమ్యూనిస్టు పార్టీ అంటేనే కార్మికోద్యమానికి ముందుండి దారి చూపించి ఆ దారివెంట వారు నడిచేలా చైతన్యపరచి వారితో కలిసి నడవడం.

ఆ పని చేయకుండా కార్మికులలోనే,వారి పోరా టాల నుంచే దానంతట అదే సోషలిస్టు సిద్ధాంతం బయలు దేరుతుంది అని ప్రాప్తకాలజ్ఞులు చేసే వాదన కమ్యూనిస్టు పార్టీని కార్మికవర్గానికి అగ్రగామిగా కాకుండా తోకలాగా దిగజారు స్తుంది. అంతే కాక దైనందిన పోరాటాలకే పరిమితం చేసి విప్లవ సాధన దిశగా అడుగులు పడకుండా నిరోధిస్తుంది.

## ట్రేడ్ యూనియన్ చైతన్యం

సోషలిస్టు చైతన్యం కార్మికులు తమ శ్రమశక్తికి ఎక్కువ ప్రతిఫలాన్ని రాబట్టుకోవడం కోసం చేసే పోరాటాలు అవసరమే. కానీ ఆ పోరాటాలన్నీ జరిగినా, కార్మికుల ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలే ఎక్కువ వేతనం కోసం, మరిన్ని హక్కుల కోసం పోరాటాలు చేయడానికి పూనుకుంటారే తప్ప అసలు ఈ పెట్టుబడిదారీ వ్యవస్థనే మొత్తంగా కూలదోసి కార్మికరాజ్యాన్ని స్థాపించాలని అనుకోరు. ఇక్కడే కమ్యూనిస్టులు పోషించవలసిన పాత్ర ముందుకొస్తుంది. కార్మికుల ప్రయోజనాలు, యజమానుల ప్రయోజనాలు వేరు అని చెప్పడమో, నిరంకుశ విధానాలు కార్మికులకు చాలా నష్టదాయకమని వివరించడమో,కార్మికుల కార్మికుల శ్రమను యజమానులు ఏ విధంగా దోపిడీ చేయగలుగుతున్నారో చెప్పడమో సరిపోదు. పెట్టుబడిదారుల చేతుల్లోంచి అధికారాన్ని లాక్కుని తామే శ్రమజీవుల రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని, అప్పుడే తమకు విముక్తి లభిస్తుందని కార్మికులు అందరూ గ్రహించినప్పుడు మాత్రమే వారికి సోషలిస్టు చైతన్యం ఎక్కినట్లు భావించాలి. సోషలిజం వస్తే బాగుంటుంది అని అనిపించే చాలదు. ఆ సోషలిస్టు వ్యవస్థను తీసుకురావాల్సిన కర్తవ్యాన్ని తామే నిర్వహించాలన్న చైతన్యం కార్మికులకు వచ్చినప్పుడే అది సోషలిస్టు చైతన్యం ఔతుంది.

## ఆందోళన-ప్రచారం పోరాటాలు

ఏ డిమాండ్ల కోసం, ఏ రూపాలలో, ఎంత కాలం, ఏవిధంగా నడపాలో ఆ కార్మికులే నిర్ణయించుకుంటారు. పోరాటాలు ప్రజలు చేస్తారు. ఆ పోరాటాలకు తోడుగా వారి వెన్నంటి వుంటూ,అదే సమయంలో వారిలో సోషలిస్టు చైతన్యాన్ని పెంపొందించే పని కమ్యూనిస్టులు చేస్తారు. ఈ స్పష్టత కొరవడినందువలన కొన్ని సంఘాలను నడిపే కమ్యూనిస్టు నాయకులు పోరాట రూపాలనూ, డిమాండ్లనూ నిర్ణయించేస్తూ ఉంటారు. పోరాటం ఆవశ్యకతను గానీ, అందుకు ఆ ప్రజలు సిద్ధంగా ఉన్నారా లేదా అన్న విషయాన్ని పట్టించు కోకుండా వ్యవహరిస్తారు. ప్రజాతంత్ర పనివిధానం గురించి ఎంత చెప్తూన్నా, ఆ ధోరణులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఒక పక్క మాట వరస కోసం 'చరిత్ర నిర్మాతలు ప్రజలే' అని అందరూ ఉంటారు. కానీ ఆ పనిని ఆ ప్రజలు చేసేలా దోహదప దవలసింది పోయి, అన్నీ తామై వ్యవహరిస్తారు. ఈ ధోరణిని లెనిన్ తీవ్రంగా ఖండించారు. పోరాటాల గురించి ప్రజలు నిర్ణయించుకుంటారు. ఆ క్రమంలో వారికి మనం తోడుగా ఉండాలి. అదే సమయంలో వారికి సోషలిస్ట్ చైతన్యం గరిపేందుకు కమ్యూనిస్టులు నిరంతరం ఆందోళన, ప్రచారం కార్మికుల మధ్య నిర్వహిస్తూనే ఉండాలి. ఎక్కువ మందికి హత్తుకునేలా కొద్దిపాటి విషయాల నైనా చెప్పడం ఆందోళన అని,కొద్దిమందికైనా ఎక్కువ, ప్రాథమిక విషయాలను లోతుగా వివరించడం ప్రచారం అని లెనిన్ వివరించారు. ఆందోళన ప్రధానంగా నోటి మాట ద్వారా, ప్రచారం ప్రధానంగా పుస్తకాల ద్వారా సాగుతుందని సూచించాడు. ఆందోళన, ప్రచారం కల్పించే వాతావరణం సానుకూలమా, కాదా అని నిర్ధారించడం తప్పు అని, ప్రజాస్వామ్య, స్వేచ్ఛాయుత వాతావరణంలో కూడా, తీవ్ర నిర్లక్ష్య పరిస్థితులలో కమ్యూనిస్టులు ఆయా పరిస్థితులలో సాధ్యా సాధ్యాలను బట్టి నిరంతరం ఆందోళన, ప్రచారం నిర్వహించడం అవసరం అని నిర్దేశించారు. అందుకు అవసరమైన నైపుణ్యాన్ని నిరంతరం పెంపొందించుకుంటూ ఉండాలి. పోరాటానికి ముందు, పోరాటం జరుగుతున్నప్పుడు, పోరాటాన్ని విరమించినప్పుడు - ఇలా అన్ని వేళలా ఆందోళన, ప్రచారం జరుగుతూనే వుండాలి అని చెప్పాడు. పెట్టుబడిదారులు అనునిత్యమూ కార్మికులను వివిధ శిక్షణద్వారా తమ బూర్జువా సిద్ధాంతాల ద్వారా ప్రభావితం చేస్తూనే వుంటారు. ఈ సంగతి మన దృష్టిలో ఉంటే మనం ఆందోళన, ప్రచారం వివిధ పద్ధతుల ద్వారా అనునిత్యం ఏదో విధంగా కొనసాగిస్తూనే వుండాలి అన్నది మరిచిపోము.

## రాజకీయ విమర్శ

ఎడతెగకుండా ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూండాలి. ఆ విమర్శలు సర్వతోముఖంగా ఉండాలి. ప్రభుత్వం అసలు స్వరూపాన్ని బట్టబయలు చేస్తూ వుండాలి.కేవలం కార్మికుల పరిస్థితులపైనే మన విమర్శ పరిమితం కారాదు. నిరంకుశత్వం, దోపిడీ,హింసాకాండ,అణచివేత నాడు ఏ వర్గపు ప్రజలపై ప్రయోగించినా, తక్షణమే కార్మికవర్గం దానిని గొంతెత్తి ఖండించేలా మన విమర్శ ఉండాలి. ఈ విమర్శను సోషలిస్టు సిద్ధాంత ప్రాతిపదిక మీదనే చేయాలి తప్ప తతిమ్మా బూర్జువా సిద్ధాంతాన్ని దేనినీ దగ్గరికి రానియ్యరాదు. కార్మికవర్గం తనను తాను విముక్తి చేసుకోవాలంటే సిద్ధాంత పరిజ్ఞానం మాత్రమే చాలదు.ఆధునిక సమాజంలో వివిధ వర్గాల మధ్య ఉన్న సంబంధాలెట్టివో తెలుసుకుంటూ, తమ రాజకీయ జీవితంలో సంపాదించిన అనుభవాన్ని కార్యరంగంలో ఉపయోగించడ మెలాగో నేర్చుకోవాలి. ఒక్కొక్క సంస్థ, ఒక్కొక్క చట్టం ఏ వర్గపు ప్రయోజనాలను ఎలా ప్రతిబింబిస్తోందో అర్థం చేసుకోగలగాలి. సమర్థ రాజకీయ విమర్శను నిరంతరం చేపట్టడం ద్వారా మాత్రమే కార్మికులకు తాము కూలదోయవలసిన వ్యవస్థ మొత్తం

స్వరూపం బాగా అర్థం అవుతుంది. వారి తక్షణ సమస్యలను తప్పక రాజకీయలను, సిద్ధాంతాన్ని కార్మికులు పట్టించుకోలేరు. వారి చైతన్యం తక్కువ స్థాయిలో ఉండడమే దీనికి కారణం అని చెప్తూ ఆర్థిక వాదులు సోషలిస్టు కృషిని చేపట్టడానికి ఆటంకంగా తయారవుతారు.

## కార్యకర్తలు-నిర్మాణం

'ఈ రోజున సమ్మెలు అనేక ప్రాంతాల్లో వాటంతట అవే ప్రారంభం అవుతున్నాయి. వీటిపై విప్లవ సంస్థ (పార్టీ) ప్రాబల్యం కొంచెం కూడా కనపడడం లేదు. ఆందోళనకు, ప్రచారానికి అవసరమైన కరపత్రాలు, గ్రంధాలు లేకపోవడం కూడా ఒక పెద్ద లోటు. నేడు ఒక్క ఆందోళనకారుడు కూడా లేదు. వీటితోబాటు ధనం కూడా లేదు. క్లుప్తంగా చెప్పాలంటే కార్మికోద్యమ అభివృద్ధితో సమానమైన విప్లవసంస్థ నిర్మాణం జరగడం లేదు.' అని ఆనాటి రష్యన్ ఉద్యమ పరిస్థితిపై లెనిన్ వివరించాడు. ఇప్పుడు అందులో చాలా భాగం మన ఉద్యమానికి కూడా వర్తిస్తాయి. 'పట్టుదలతో పని చేయగల విప్లవకారులు బహు కొద్దిమంది మాత్రమే సమాజంలో ఉద్భవిస్తారు అనుకోవడం పొరపాటు. నిజానికి అట్టివారు చాలామంది ఉద్భవిస్తారు. మనం మాత్రం వారి శక్తి సామర్థ్యాలను వినియోగించు కోలేని పరిస్థితిలో ఉన్నాం. ప్రజల్లో అసంతృప్తి నానాటికీ పెరుగుతోంది. కానీ వారందరినీ కదిలించి ఒక ప్లాను ప్రకారం వారి పోరాట శక్తికి తగిన పనిని కల్పించగల ఆర్గనైజర్లు మనలో లేరు. ఆర్థిక పోరాటాలకే ప్రధానంగా మన శక్తియుక్తుల పరిస్థితి వెచ్చిస్తూ ఉన్నంత కాలమూ పరిస్తితిలో మార్పు తీసుకురాలేము" అని ఈ సందర్భంగా చెప్పారు. ఒక్కో వ్యక్తి నిర్వహించవలసిన పని ఎంత చిన్నదిగా ఉంటే అంత ఎక్కువమంది ఆ పనిని చేయడానికి ముందుకు వస్తారు. అంటే వివరంగా పనిని ప్లాను చేయడం, దానిని చిన్న చిన్న ముక్కలుగా విభజించడం, ఆ ముక్కలన్నీటి మధ్య సమన్వయం ఉండేలా చూడడం - ఇది ఆర్గనైజర్గా ఉన్నవారు చేయవలసిన పని. వివిధ పనులు చేయడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడం చాలా ముఖ్యం. అలా కాకుండా ఆయా వ్యక్తులలో కనిపించే లోపాలనే ప్రధానంగా చూస్తూ,వారు చేయగలిగిన పనులేమిటో గుర్తించకుండా ఉంటే మనం ఎన్నటికీ కార్యకర్తలను గుర్తించలేం, తయారు చేయనూలేము.


## పార్టీ సభ్యత్వం

పార్టీ ఆశయాలను,అంగీకరించే ప్రతీవారినీ కమ్యూనిస్టు పార్టీలో చేర్చుకోవచ్చును అనే వాదనను లెనిన్ అంగీకరించ లేదు. కార్మికులలో, ప్రజలలో సోషలిస్టు చైతన్యాన్ని పాదు కొల్పడం, వారికి మార్గదర్శకంగా నడుచుకోవడం పార్టీ బాధ్యత. అటువంటప్పుడు ఆ బాధ్యతలో పాలుపంచుకోకుండా కేవలం ఆశయాలను అంగీకరిస్తే సరిపోతుందని భావించే ప్రజల మధ్య పని చేయని సభ్యులు చాలామంది తయారవుతారు. ఇటాంటి వారు తాము పనిచేయకపోగా, ఇతరుల పనికి కూడ ఆటంకంగా తయారవుతారు. శుష్క వాదనలు, అడ్డు పుల్లలతో ముందుకు సాగకుండా చేస్తారు. అసలు ప్రజలతో సంబంధం లేకుండా ఉండేవారు ఆ ప్రజలకు సోషలిస్టు చైతన్యాన్ని గరపడం ఎలా సాధ్యం ? కనుక విప్లవకర పార్టీకి విప్లవకర నిర్మాణం అవసరం అని లెనిన్ బలంగా చెప్పాడు.


## పార్టీ పత్రిక

విప్లవ సాధనలో పత్రిక ప్రాధాన్యత ఏమిటో లెనిన్ ఈ గ్రంథంలో చక్కగా వివరించాడు. 'సజీవమైన రాజకీయ పరిజ్ఞానం ద్వారానే సజీవమైన రాజకీయ కార్యక్రమం జరుగుతుంది. దేశవ్యాప్త రాజకీయ పత్రిక ఒకటి లేనిదే ఈ రాజకీయ పరిజ్ఞానం లభించదు. అట్టి పత్రికలు తరచుగా పాఠకులకు అందజేయబడాలి. సక్రమంగా పంచిపెట్టబడాలి. అన్ని తరగతులకు, అన్ని వర్గాలకు మన పత్రిక అందినప్పుడే దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా ప్రతీ ప్రాంతంలోనూ, ప్రజానీకంలో మన పని ఎలా ముందుకు సాగాలో అర్థం అవుతుంది.' ఒక ప్రాంతంలో పని చేసేవారి అవగాహన ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా, తమ కృషి మొత్తం విప్లవోద్యమంలో ఒక భాగంగా ఉంటుందన్న గ్రహింపు వారికి ఉండాలి. ఆ కృషి రోజూ ఏ విధంగా పెంపొందుతుందో వారే బాగా తెలుసుకోగలిగి వుండాలి. ఒక పత్రిక లేకుండా ఇది సాధ్యం కాదు. కనుకనే కమ్యూనిస్టులు పత్రిక నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. తీరుబాటు ఉన్నప్పుడు చదవడానికో, లేక వారు పాల్గొన్న కార్యక్రమాల వివరాలు అచ్చులో చూసుకోడానికో మాత్రమే పత్రిక అనుకునే ధోరణి పెరిగింది. అందుకే పత్రిక సర్క్యులేషన్ మీద, అధ్యయనం మీద, ఆ పత్రికలో వచ్చిన అనేక విషయాలు తమ రంగంలోని ప్రజలకు అందజేయడం మీద శ్రద్ధ తగ్గుతోంది. ఏం చేయాలి గ్రంథాన్ని లెనిన్ రచించిన కాలంలో రష్యాలో, ప్రపంచంలో నెలకొన్న పరిస్థితులకు, వర్తమాన ప్రపంచంలో ఉన్న పరిస్థితులకు కొంత తేడా ఉండవచ్చు. కానీ ప్రాప్త కాలజ్ఞత, ఆర్థికతత్వం, కార్మికవర్గంలో, ఇతర ప్రజల్లో పని చేసే కమ్యూనిస్టులు తప్పనిసరిగా చేయవలసిన పని స్వభావం, విప్లవపార్టీ నిర్మాణ సూత్రాలు, కార్యకర్తలను గుర్తించి అభివృద్ధి చేయడం, పత్రిక ఆవశ్యకత వంటి అంశాలు మనకు పూర్తిగా వర్తిస్తాయి. మన ఆచరణను ఉపయోగించు కోడానికి, దేశంలో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి, ప్రజలకు అర్థం చేసుకోవడానికి 'ఏం చేయాలి' గ్రంథం కరదీపికగా ఉంటుంది. మన ఆచరణకు అన్వయించుకుంటూ దానిని అధ్యయనం చేసినప్పుడు తప్పనిసరిగా ఫలితం మనకు కనిపిస్తుంది. ❑


**(మార్క్సిస్టు మాస పత్రిక సౌజన్యంతో..)**




దటీజ్.. నిర్మలమ్మ




ఆకలి.. అడగొద్దు
సనాతనమే ముద్దు






చాలెంజ్ స్టంట్


కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**
Vol : 3 - Issue No : 4 January 2025

## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.